thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 79 | కరీంనగర్ గురువారం, 29 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# రైతులకు మరో కానుక ప్రకటించిన మోదీ సర్కార్..

## ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంపు

## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు మరో బహుమతిని ప్రకటించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచారు. పంటల పెట్టుబడిపై కనీసం 50 శాతం లాభాలు ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయించారు. వరికి క్వింటాకు రూ. 69 కనీస మద్దతు ధర పెంచారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని బద్వేల్-నెల్లూరు మధ్య నాలుగు లేన్ల హైవే నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం(మే 28) జరిగిన మంత్రివర్గ సమావేశంలో, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. కేబినెట్ సమావేశంలో మరో ఐదు ముఖ్యమైన నిర్ణయాలకు ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వీటిలో రైతులకు సంబంధించి మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. బద్వేల్-నెల్లూరు మధ్య నాలుగు లేన్ల హైవే నిర్మాణంతో నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లకు కనెక్టివిటీ పెరుగుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. హైవే నిర్మాణానికి రూ. 3,653 కోట్లు కేటాయిస్తునట్టు వెల్లడించారు. వార్ధా-బల్లార్షా రైల్వే మార్గాన్ని నాలుగు లేన్లుగా విస్తరించబోతున్నట్లు పేర్కొన్నారు. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపుదలకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచిందని, తద్వారా ఉత్పత్తిదారులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు లభించేలా చూడవచ్చని ఆయన అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే అత్యధికంగా MSP పెరుగుదల నైజర్ సీడ్ (క్వింటాకు రూ. 820), ఆ తరువాత రాగి (క్వింటాకు రూ. 596), పత్తి (క్వింటాకు రూ. 589), నువ్వులు (క్వింటాకు రూ. 579) ఉన్నాయి. 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు ఖరీఫ్ పంటలకు MSP పెరుగుదల 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఉందని, ఇది అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు మద్దతు ధరని నిర్ణయించినట్లు ఆయన అన్నారు. రైతులు తమ ఉత్పత్తి వ్యయం కంటే ఆశించే మార్జిన్ చిరు ధాన్యాలు (63%), తరువాత మొక్కజొన్న (59%), కంది (59%), మినుములు (53%) విషయంలో అత్యధికంగా ఉంటుందని కేంద్ర మంత్రి అన్నారు. మిగిలిన పంటలకు, రైతులకు వారి ఉత్పత్తి వ్యయంపై 50% లాభం ఉంటుందని ఆయన అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన వడ్డీ సబ్సిడీ పథకం కింద వడ్డీ సబ్సిడీ భాగాన్ని కొనసాగించడానికి ఆమోదం లభించిందని, అవసరమైన నిధుల ఏర్పాటుకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. MISS అనేది కేంద్ర రంగ పథకం, ఇది కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు సరసమైన వడ్డీ రేట్లకు స్వల్పకాలిక రుణాల లభ్యతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద, రైతులు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 7% రాయితీ వడ్డీ రేటుతో రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను పొందుతారు. అర్హత కలిగిన రుణ సంస్థలు 1.5% వడ్డీ సబ్సిడీని అందిస్తాయి. అదనంగా, సకాలంలో రుణం తిరిగి చెల్లించే రైతులు ప్రాంప్ట్ రీపేమెంట్ ఇన్సెంటివ్ గా 3% వరకు ప్రోత్సాహకానికి అర్హులు, దీని వలన KCC రుణంపై వారి వడ్డీ రేటు 4% కి చేరుకుంటుంది. దేశంలో 7.75 కోట్లకు పైగా %ఖజజ% ఖాతాలు ఉన్నాయి. వ్యవసాయానికి సంస్థాగత రుణ ప్రవాహాన్ని కొనసాగించడానికి ఈ మద్దతును కొనసాగించడం చాలా కీలకం. ఇది ఉత్పాదకతను పెంచడానికి, చిన్న-సన్నకారు రైతులకు ఆర్థిక చేరికను నిర్ధారించడానికి చాలా ముఖ్యమైనది.





**రహదారులకు ఆమోదం....** కేంద్ర కేబినెట్ సమావేశంలో అనేక రహదారులకు ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం ఓడరేవు వరకు 4 లైన్ల హైవేకు ఆమోదం తెలిపినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీనితో పాటు, బద్వేల్-నెల్లూరు వరకు కొత్త రహదారిని నిర్మిస్తారు. తర్లాం నుండి నాగ్దా రైల్వే వరకు 4 లైనింగ్‌లు చేయడానికి ఆమోదం లభించింది. రూ. ఈ 41 కి.మీ. పొడవైన లైన్ కోసం 1,018 కోట్లు ఆమోదించింది కేబినెట్. దీంతో ముంబై నుండి ఢిల్లీ కారిడార్ సామర్థ్యం పెరుగుతుంది.

**రెండు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం..** రైల్వే లైన్ సామర్థ్యాన్ని పెంచే క్రమంలో, ప్రయాణీకులు, వస్తువుల రవాణాను సజావుగా, వేగంగా ఉండేలా భారతీయ రైల్వేలలో రెండు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులను ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. రత్లాం-నాగ్దా 3వ, 4వ లైన్లు, వార్ధా-బల్హార్షా 4వ లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 3,399 కోట్లు. ఇది 2029-30 నాటికి పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టులు PM-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఫర్ మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఫలితంగా ఉన్నాయి. ఇది సమగ్ర ప్రణాళిక ద్వారా సాధ్యమైంది. ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు సజావుగా కనెక్టివిటీని అందిస్తుంది.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని నాలుగు జిల్లాలను కవర్ చేసే ఈ రెండు ప్రాజెక్టులు భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను దాదాపు 176 కి.మీ.ల మేర విస్తరిస్తాయి. ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ కనెక్టివిటీని పెంచుతుంది. 784 గ్రామాలు, వీటి జనాభా దాదాపు 19.74 లక్షలు.

## రేవంత్‌రెడ్డి మనసున్న ముఖ్యమంత్రి : భట్టి విక్రమార్క



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంచి మనసున్న ముఖ్యమంత్రి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. నేడు ఎస్సీ గురుకులాల్లో చదివిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద తమ ప్రభుత్వం చాలా ఖర్చు చేసిందని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిధులను గాలికి వదిలేసిందని, కానీ తాము అలా చేయడం లేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మనసున్న నాయకుడని, ప్రజల కోసం నిజంగా పని చేస్తున్నారని భట్టి పొగడ్తల వర్షం కురిపించారు. తాము మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవాలని చూడటం లేదని, నిజంగా పనులు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం 104 స్కూళ్లను కొత్తగా ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. వారి చదువు, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

అలాగే తాము అధికారంలోకి వచ్చిన వెం టనే గురుకుల, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలను 200 శాతం పెంచామని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలదేనని, దొరల పాలన కాదని భట్టి అన్నారు. ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిజాయితీగా పని చేస్తోందని, అందరికీ సమాన అవకాశాలు ఇస్తున్నామని వివరించారు.



## బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్

తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ముఖ్యనేతలతో సమావేశమై నేతలకు క్లాస్ ఇచ్చారు. కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు ప్రెస్ మీట్లు పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అనుమతి తప్పనిసరి...** పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు గట్టిగా చెప్పారు. పార్టీ ఆఫీసులో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు పెట్టాలంటే అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది తనతో పాటు అందరికీ వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ నేతలు హుందాగా ప్రవర్తించాలని సూచించారు.

## 'పద్మశ్రీ' ఉద్యమాలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నా




న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని.. ఈ అవార్డు ఉద్యమాలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. పద్మశ్రీ పురస్కారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు, ఉద్యమానికి దక్కిన గౌరవమని, జాతికి అండగా ఉన్న సమాజానికి వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని అన్నారు. లక్ష్యం కోసం పనిచేస్తే గుర్తింపు, గౌరవం వస్తుందనడానికి తనకు వచ్చిన పురస్కారమే నిదర్శనమని మంద కృష్ణ అన్నారు.

**బాధ్యత మరింత పెంచింది..** కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి, చంద్రబాబు.. వర్గీకరణ లక్ష్యానికి చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంద కృష్ణ అన్నారు. పద్మశ్రీ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజానికి రుణపడి ఉన్నామని, ఎమ్మార్పీఎస్ లక్ష్యం వర్గీకరణ అయినప్పటికీ సమాజం కోసం అనేక పోరాటాలు చేస్తున్నామని అన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు సంబంధం లేకుండా స్వతంత్ర్యం అనంతరం అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెడతామన్నారు. ప్రజా ఆకాంక్షలకు అణుగుణంగా ముందుకు వెళతామని, మేధావులు, సంఘాలు, రాజకీయ వర్గాలతో చర్చించి భవిష్యత్ అజెండా రూపొందించుకుని ముందుకు వెళతామని స్పష్టం చేశారు.




# 'రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు'

## కుటుంబ శ్రేయస్సు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టని గత ప్రభుత్వం

## కేసీఆర్ కుటుంబంపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: గత పాలకులకు కాంగ్రెస్‌కు మధ్య నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత పాలకులు ఎవరూ అభివృద్ధి చెందకూడదు.. తమ కుటుంబమే శాసించాలన్న ధోరణిలో ఉంటే తమ ప్రభుత్వం మాత్రం ప్రతి వర్గం వారికి పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. ఆర్థికంగా రాష్ట్రం ఎన్ని కష్టాల్లో ఉన్నా ప్రజల సంక్షేమం, వారి అభ్యున్నతి విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడట్లేదని అన్నారు. పైగా ఇప్పుడు తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుంటే అడ్డుకోవడానికి చాలా మంది కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన గురుకుల అవార్డుల కార్యక్రమంలో ఈ విషయంపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలని కోరారు రేవంత్. "అనేక మంది మహానీయులు అయ్యారంటే అందుకు వారి చదువే కారణం కానీ కులం కాదు. మనల్ని ఉన్నత శిఖరాలకు చేర్చే సత్తా చదువుకు మాత్రమే ఉంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నాం. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నాం. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు బాగుండటం చాలా అవసరం. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువు వద్దు.. కుల వృత్తులే ముద్దు అని గత ప్రభుత్వం నమ్మింది. కానీ మా ప్రభుత్వం అలాకాదు" అని పేర్కొన్నారు. దళితులు, బీసీలు సామాజిక వర్గాలకు చెందిన వారు గొర్రెలు, బర్రెలు తోలుకుంటూ, చేపలు పెంచుకుంటూ ఉండాలని మాజీ సీఎం ప్రవర్తించారన్నారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయిన భావించిన ఆశలపై గత పాలకులు నీళ్లు చిలకరించారని ఆరోపించారు. గత సీఎం ఏకాడికి తన ఇంట్లో వాళ్లకి ఉద్యోగాలు వచ్చినాయా లేదా అని చూసుకున్నారు తప్పితే ప్రజల పరిస్థితి ఏంటి అని కలలో కూడా ఆలోచించలేదంటూ ఆరోపణలు గుప్పించారు. "తన ఇంట్లో వాళ్లు ఒకచోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల వ్యవధిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. అందుకు తగ్గట్టుగా మా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తే కొందరు మాత్రం వాటిని అడ్డుకోవడం కోసం కుట్రలు చేస్తున్నారు. అలాంటి వారిని ప్రజలు నిలదీయాలి" అని కోరారు.

**ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలి...** అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన గురుకుల అవార్డుల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

"చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు.. చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నాం. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు కూడా బాగుండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువులు వద్దు.. కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు.. గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్టుగా మాజీ సీఎం వ్యవహరించారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు.

ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాల భర్తీ త్వరగా జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారు. అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలి. నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్టుగా కేసులు వేస్తున్నారు. ఆర్నెల్లు కూడా విరామం లేకుండా వాళ్ల ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారు. విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు" అని సీఎం విమర్శించారు.




## రైతుల ఖాతాల్లో నిధులు జమ.. చెక్ చేసుకున్నారా..!

హైదరాబాద్, మే 28: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి శుభవార్త చెప్పింది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఆసరాగా నిలిచింది. రైతులకు ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పంట నష్ట పరిహారం నిధులను బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల వడగంట్ల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 29 జిల్లాల్లోని 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనా నివేదిక ప్రచారం ప్రభుత్వం రూ. 51.52 కోట్లను విడుదల చేసింది.

ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మే నెలకు పంట నష్టపరిహారం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు.

## ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన గురుకుల అవార్డుల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. "చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు.. చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నాం. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు కూడా బాగుండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువులు వద్దు.. కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు.. గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్టుగా మాజీ సీఎం వ్యవహరించారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాల భర్తీ త్వరగా జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారు. అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలి. నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్టుగా కేసులు వేస్తున్నారు. ఆర్నెల్లు కూడా విరామం లేకుండా వాళ్ల ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారు. విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు" అని సీఎం విమర్శించారు.

## అనుకున్న సమయానికే రైతుభరోసా నిధులు జమ చేస్తాం: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రైతులకు మంచి రోజులు వస్తున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చిన్న రాష్ట్రం, కొత్త రాష్ట్రమైన తెలంగాణ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుందని చెప్పారు. వాటిని అధిగమించి సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారన్నారు.

గతేడాది మొదటి పంట కాలంలోనే రైతుల ఖాతాల్లో రూ.33 వేల కోట్లు వేశారన్నారు. దేశంలోనే అత్యధిక ధాన్యం సేకరించిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. అనుకున్న సమయానికే రైతుభరోసా నిధులు వేస్తామని హామీ ఇచ్చారు. అతి త్వరలోనే నల్గొండ జిల్లాలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.




## తెలంగాణ ప్రజలకు అలర్ట్.. నేటి నుంచి 3 రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దేశ ప్రజలకు షాక్ ఇచ్చేలా వర్షాకాలం ఊహించని విధంగా ముందుగానే వచ్చేసింది. గత కొద్దిరోజుల నుంచి దేశ వ్యాప్తంగా మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నేటి నుంచి రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా అన్ని జిల్లాల్లో సాధారణం నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రేపు ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




సినీ నటుడు, మక్కల్ నీది మయ్యమ్(ఎంఎన్ఎం) పార్టీ చీఫ్ కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ బుధవారం ( మే 28 ) ఈ మేరకు ప్రకటించింది. తమిళనాడు నుంచి సల్మా, అడ్వకేట్ పీ. విల్సన్, ఎస్ఆర్ శివలింగం లను రాజ్యసభకు నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించిన డీఎంకే.. కమల్ హాసన్ పార్టీ ఎంఎన్ఎం కు ఒక రాజ్యసభ స్థానం కేటాయిస్తున్నట్లు తెలిపింది. పొత్తులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం డీఎంకే నేతృత్వంలోని కూటమితో కమల్ హాసన్‌కు చెందిన మక్కల్ నీది మయ్యమ్ చేతులు కలిపింది. ఈ ఏడాది రాజ్యసభ ఎన్నికలకు కూటమిలో భాగంగా ఎంఎన్ఎం ఒక స్థానాన్ని కూడా దక్కించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో మద్దతు ఇచ్చినందుకు ఒప్పందంలో భాగంగా సీఎం ఎంకే స్టాలిన్ కమల్‌కు రాజ్యసభ సీటును హామీ ఇచ్చినట్టు సమాచారం. మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కమలహాసన్.. ఎన్నికల్లో మాత్రం చిత్తు చిత్తు ఓడిపోయారు. ఒక్క సీటుగా కూడా గెలవలేదు. ఆ తర్వాత డీఎంకే పార్టీకి మద్దతు ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే కమలహాసన్ ను రాజ్యసభకు ఎంపీగా పంపించాలని డిసైడ్ అయ్యింది డీఎంకే పార్టీ. జూలై నెలలో తమిళనాడు నుంచి ఆరు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. డీఎంకే పార్టీకి నాలుగు సీట్లు గ్యారంటీగా వస్తాయి. అందులో ఒక సీటును కమలహాసన్ ఇవ్వాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. గత ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిన తర్వాత.. కాంగ్రెస్ పార్టీ సైతం కమలహాసన్ కు మంచి ఆఫర్ ఇచ్చింది. లోక్ సభ ఎన్నికల్లో డీఎంకే.. కాంగ్రెస్ పొత్తులో భాగంగా లోక్ సభ ఎంపీ సీటు ఇస్తామని ఆఫర్ చేసింది కాంగ్రెస్ పార్టీ. అయితే ఆ ఆఫర్ ను తిరస్కరించారు కమలహాసన్. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయకుండా డీఎంకే పార్టీకి మద్దతు ఇచ్చారు కమలహాసన్.

## తెలంగాణ కాంగ్రెస్ నేతలతో మీనాక్షి నటరాజన్ సమీక్ష



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమావేశమయ్యారు. హైదర్‌గూడలోని క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఆమె సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇవాళ ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నేతలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాల నేతలతో సమీక్షించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతో మీనాక్షి నటరాజన్ విడివిడిగా సమావేశం కానున్నారు.

## ఎన్టీఆర్ కు భారత రత్న ఎందుకివ్వడం లేదో అర్థం కావడం లేదు: మోత్కుపల్లి



ప్రస్తుతం రాజకీయాలు భ్రష్టుపట్టాయని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసహింపులు సంచలన వ్యాఖ్యలు చేశారు. నందమూరి తారకరామారావుకు భారతరత్న ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఇవాళ హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోత్కుపల్లి.. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్డీఆర్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ బిక్షతో నాలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉన్నారని, నేను ఏ పార్టీలో ఉన్నా తన స్ఫూర్తితో వచ్చి పోతుంటానన్నారు. కోట్లు ఉన్నవాడితే రాజకీయం అవుతోంది. ఒక్క రూపాయి లేకపోయినా నేను ఎమ్మెల్యేను ఆయ్యానంటే అది ఎన్టీఆర్ వల్లేనన్నారు.

## జీడిమెట్లలో మావోయిస్టుల పేరుతో లేఖ.. నిందితుల్లో ఇంట్లో అద్దెకున్న వ్యక్తి..




షాపూర్‌నగర్: జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల లేఖ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న మావోయిస్టుల పేరుతో నిందితులు లేఖ రాశారు. వారిని కూన రాఘవేందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటుబాంబులు, 3 సెల్‌ఫోన్లు, 2 బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటుబాంబులను వారు విజయనగరంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

**అసలేం జరిగిందంటే..** మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి కుటుంబాన్ని లేఖలో లక్ష్యంగా చేసుకున్నారు. రూ.50 లక్షలు ఇవ్వకపోతే కూన రవీందర్‌గౌడ్ కుమారుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపుతామని అందులో పేర్కొన్నారు. రెండు ఇళ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు వస్తువులు ధ్వంసం చేసి అక్కడ లేఖను ఉంచారు. కారుపై ఎరుపు రంగు టవల్‌లో లేఖ పెట్టి వెళ్లిపోయారు. ఘటన ఈ నెల 21న జరిగినట్లు రాఘవేందర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు గుర్తించారు. తాజాగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.



## మరోసారి కేసీఆర్‌ను కలిసిన హరీశ్‌రావు

సిద్దిపేట: భారాస అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని నివాసంలో ఆయన్ను కలిశారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కమిషన్ నోటీసులు, విచారణ సంబంధిత అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.



## హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పేరు సిఫార్సు

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పేరును సుప్రీంకోర్టు కొలీజీయం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆయన త్రిపుర హైకోర్టు సీజేగా ఉన్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది.




థియేటర్‌ల బంద్ చిన్న విషయం కాదన్నారు సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్. తన తాజా చిత్రం 'షష్టిపూర్తి' ప్రీరిలీజ్ వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్, ఆకాంక్ష సింగ్ కీలకపాత్రల్లో నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. "థియేటర్‌లు మూసేయడం అనేది ఒకరు చెబితే చేసేది కాదు. అది సమష్టిగా తీసుకోవాల్సిన నిర్ణయం. దీన్ని ఎవరో మిస్ గైడ్ చేశారు. చివరకు ఏమైంది.. అది నిలబడలేదు కదా. పవన్ కల్యాణ్ ఫీల్ అయ్యాడంటే అది సరైనదే అవుతుంది. ఇలాంటివి సృష్టించిన వారిని కనిపెడితే ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. థియేటర్లను బంద్ చేస్తాం అనే మాట చిన్నది కాదు.. ఇలాంటివి ఇంకెప్పుడూ జరగకూడదని కోరుకుంటున్నాను. పవన్ ఈ విషయంలో బాధ్యత తీసుకొని దీని వెనక ఎవరున్నారో కనిపెట్టాలని కోరడం హర్షించదగ్గ విషయం" అని అన్నారు. తన కెరీర్ గురించి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ జేబు నింపుకోవడానికి సినిమాలు చేయలేదు. ఒకవేళ నేను సంపాదించిన డబ్బును కొందరు హీరోలు పెట్టుబడులు పెట్టినట్లు పెట్టి ఉంటే ఈ పాటికి మద్రాసు, హైదరాబాద్‌లలో వేల కోట్ల రూపాయల ఆస్తులుండేవి. సంపాదన గురించి పట్టించుకోకుండా సినిమాలు చేశాను. మంచి పాత్ర అవునా.. కాదా అనేది మాత్రమే చూస్తాను. పవన్ కల్యాణ్ నాకు తమ్ముడితో సమానం. ఆయన సినిమాలో నటించడం ఎందుకో కుదర్లేదు. త్వరలోనే ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

# హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రగామి పృథ్వీరాజ్

## – మే 29... పృథ్వీ రాజ్ కపూర్ వర్ధంతి




పృథ్వీరాజ్ కపూర్ భారతీయ థియేటర్ కు ఆద్యుడు. హిందీ సినీ పరిశ్రమలో పేరొందిన నటుడు. కపూర్ వంశ పితామహుడు, ఆయనకు సంబంధించి ఐదు తరాలు హిందీ సినిమా రంగం (బాలీవుడ్) లో నటించడం విశేషం. పృథ్వీరాజ్ 1906, నవంబరు 3న పాకిస్తాన్ లోని లయాల్‌పూర్ వద్ద (ఇప్పుడు ఫైసలాబాద్) ఉన్న సముంద్రీలో మధ్య తరగతి, హిందూ ఖత్రి కుటుంబంలో జన్మించాడు. పృథ్వీరాజ్ పంజాబీ, హిందీ భాషలు మాట్లాడేవాడు. కపూర్ కుటుంబం పంజాబీ హిందూ మూలానికి చెందిన కుటుంబం. పృథ్వీరాజ్ కపూర్ ఈ కుటుంబం నుంచి మొట్టమొదటి సినిమా నటుడు. పాకిస్థానీ పంజాబ్ లోని సముంద్రి పట్టణంలో 1906లో జన్మించారు పృథ్వీరాజ్. ఆయన తండ్రి బసవేశ్వరనాథ్ కపూర్ పేష్వార్ లో భారత ఇంపీరియల్ పోలీస్ శాఖలో పోలీసు అధికారిగా పనిచేశాడు. పృథ్వీరాజ్ తాత సముంద్రి పట్టణానికి తహశీల్దారుగా వ్యవహరించేవారు. తన స్వస్థలమైన లిల్లాపూర్, పెషావర్లలో థియేటర్ ఆర్టిస్ట్ గా తన నటనా వృత్తిని ప్రారంభించాడు. 1928 లో, పృథ్వీరాజ్ తన అత్త నుండి అరువు తెచ్చుకున్న కొంత డబ్బుతో బొంబాయికి (ఇప్పుడు ముంబై) వెళ్లి ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీలో చేరాడు. సంస్థలో సినిమాల్లో చిన్న పాత్రలు చేయడం ప్రారంభించాడు. 1929 లో కపూర్ తన మూడవ చిత్రం సినిమా గర్ల్ లో మొదటి ప్రధాన పాత్రను పొందాడు. దో ధారి తల్వార్ , షేర్–ఎ–అరా బి మరియు ప్రిన్స్ విజయ కుమార్ వంటి తొమ్మిది నిశ్శబ్ద చిత్రాలలో పృథ్వీరాజ్ నటించాడు. 1931 లో, భారత దేశంలో మొట్టమొదటి టాకీ, "ఆలం అరా" విడుదలైంది. ఆ చారిత్రక చిత్రంలో కపూర్ సహాయక పాత్ర పోషించాడు. ప్రఖ్యాత థియేటర్ నటుడిగా, పృథ్వీరాజ్ బ్రిటిష్ ప్లేహౌస్ అయిన గ్రాంట్ ఆండర్సన్ థియేటర్ కంపెనీలో చేరాడు. ఆయన చేరిన వెంటనే కంపెనీ ఇంగ్లాండ్ కు మారింది. 1946 లో, పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్ అనే థియేటర్ సంస్థను స్థాపించాడు, పృథ్వీరాజ్ పృథ్వీ థియేటర్లలో పెట్టుబడులు పెట్టాడు, ఇది భారతదేశం అంతటా చిరస్మరణీయమైన ప్రదర్శనలను అందించింది. ఆ నాటకాలు అత్యంత ప్రభావవంతమైనవి. భారత స్వాతంత్ర్య ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడానికి యువతను ప్రేరేపించాయి. 16 సంవత్సరాల కాలంలో థియేటర్ 2,662 ప్రదర్శనలను ప్రదర్శించింది. ఇందులో పృథ్వీరాజ్ ప్రధాన నటుడిగా నటించాడు. 1996 లో, థియేటర్ యొక్క గోల్డెన్ జూబ్లీలో, ఇండియన్ పోస్ట్ రెండు రూపాయల పోస్టల్ స్టాంప్‌ను జారీ చేసింది. భారతీయ సినిమా 100 సంవత్సరాల సందర్భంగా, మరొక తపాలా బిళ్ళను ఇండియా పోస్ట్ 3 మే 2013 న విడుదల చేసింది. ఆయన ప్రసిద్ధ నాటకాల్లో ఒకటైన ఒక ముస్లిం మరియు హిందూ స్నేహితుడి కథ, 13 ఏప్రిల్ 1947 న ప్రారంభమైన "పఠాన్" నాటకం. అది ముంబైలో దాదాపు 600 సార్లు వేదికపై ప్రదర్శించ బడింది. 1950 దశాబ్దం చివరి నాటికి, ట్రావెలింగ్ థియేటర్ యుగం, సినిమా ప్రభావ కారణంగా అంతిమ దశకు చేరుకుంది. క్రమంగా పృథ్వీ థియేటర్ కార్యకలాపాలను నిలిపి వేసాడు. తన సొంత కుమారులతో సహా చిత్ర నిర్మాతల నుండి అప్పుడప్పుడు ఆఫర్లను అంగీకరించాడు. తన కుమారుడు రాజ్ కపూర్ తో కలిసి 1951 చిత్రం అవారాలో కనిపించాడు. తరువాత, పృథ్వీ థియేటర్ ఇండియన్ షేక్స్పియర్ థియేటర్ సంస్థ "షేక్స్పియెర్నా" తో విలీనం అయ్యింది. సంస్థ 5 నవంబర్ 1978 న ముంబైలో పృథ్వీ థియేటర్ ప్రారంభోత్సవంతో శాశ్వత గృహాన్ని పొందింది. ఆయన చిత్రాలలో ఒకటి, కల్ ఆజ్ అవుర్ కల్ , కపూర్ కుటుంబానికి చెందిన మూడు తరాలు – కుమారుడు రాజ్ కపూర్, మనవడు రణధీర్ కపూర్ మరియు పృథ్వీరాజ్. పృథ్వీరాజ్ తండ్రి, దేవాన్ బాషేశ్వర్నాథ్ కపూర్ కూడా రాజ్ కపూర్ చిత్రం అవారాలో అతిథి పాత్రలో నటించారు. పృథ్వీరాజ్ ముగ్గురు కుమారులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ లు గొప్ప నటులే. భారతీయ సినిమా చరిత్రలో రాజ్ కపూర్ ను "ది గ్రేటెస్ట్ షోమాన్"గా అభివర్ణిస్తారు. రాజ్ కపూర్ బాలీవుడ్ లో ప్రసిద్ధ నటుడే గాక, నిర్మాత, దర్శకునిగా కూడా మంచి కృషి చేశాడు. రాజ్ కపూర్ కుమారులు రణధీర్ కపూర్, రిషి కపూర్ లు బాలీవుడ్ లో మంచి నటులుగా గుర్తింపు తెచ్చుకోగా, చిన్న కుమారుడు రాజీవ్ కపూర్ మాత్రం అంతగా రాణించలేదు. శశి కపూర్ కుమార్తె సంజన కపూర్ కూడా నటిగా మంచి గుర్తింపే తెచ్చుకున్నది. కానీ ఆమె చాలా తక్కువ సినిమాల్లో నటించింది. రణధీర్ కపూర్ నటి బబితాను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కరిష్మా కపూర్, కరీనా కపూర్. ఇద్దరు బాలీవుడ్ లో బాగా రాణించినవారే. కరీనా మాత్రం ఇప్పటికి టాప్ హీరోయిన్ గా కొనసాగుతున్నది. రిషి కపూర్ నటి నీతూ సింగ్ ను వివాహం చేసుకున్నాడు. రణబీర్ కపూర్ వీరి కుమారుడే. బాలీవుడ్ లో అగ్ర కథానాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందాడు రణబీర్. రాజకపూర్ కూతురు రితుకపూర్, రంజన్ నందల కుమారుడు నిఖిల్ నంద– అమితాబ్ బచ్చన్, జయ బచ్చన్ ల కుమార్తె శ్వేత బచ్చన్ ను వివాహం చేసుకున్నాడు. అలా కపూర్ కుటుంబం భారత దేశంలో ఐదు తరాల సినీ కళాకారులను కలిగి ఉన్న ఏకైక కుటుంబంగా మిగిలి పోయింది. .. ఆలం ఆరా (1931) (భారత మొదటి టాకీ సినిమా)బీ విద్యాపతి (1937)బీ సికందర్ (1941)బీ ఆవారా (1951)బీ ఆనంద్ మఠ్ (1952)బీ పర్దేశీ (1957)బీ మొఘల్ ఎ ఆజం (1960) (అక్బర్ చక్రవర్తి పాత్ర)బీ జిందగీ (1964)బీ ధాకూ మంగళ్.సింగ్ (1966)బీ హీర్ రాంఝూ (1970)బీ కల్ ఆజ్ ఔర్ కల్ (1971)బీ సాక్షాత్కార – (కన్నడ) (1971)బీ తదితరాల్లో భిన్నమైన పాత్రలలో ప్రతిభ కనబరిచిన నటునిగా గుర్తింపు పొందాడు. ఆయన పంజాబీ చిత్రాలలో నానక్ దుఖియా సబ్ సంసార్ (1970) మరియు మేలే మిత్రాన్ దే (1972) లలో కూడా నటించాడు. మొఘల్ ఎ ఆజం (1960)లో అక్బర్ పాత్ర మరువ లేనిది. 1954 లో ఆయనకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ , మరియు 1969 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డులను ప్రదానం చేసింది. ఎనిమిదేళ్ల పాటు నామినేటెడ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగాడు. 1972 మే 29న (వయసు 70) మరణించాడు. పృథ్వీరాజ్ కు కుమారులు షంషేర్ రాజ్ (షమ్మీ) మరియు బల్బీర్ రాజ్ (శశి) (వారు ప్రసిద్ధ నటులు, చిత్ర నిర్మాతలుగా మారారు), కుమార్తె ఉర్మిలా సియాల్. ఆయన 1949%–% రాష్ట్రపతి మెడల్‌బీ 1954%–% సంగీత నాటక అకాడమీబీ ఫెలోషిప్. (సంగీత నాటక అకాడమీ ద్వారా)బీ 1956%–% సంగీత నాటక అకాడమీ అవార్డు (సంగీత నాటక అకాడమీ ద్వారా)బీ 1969%–% భారత ప్రభుత్వం నుండి పద్మభూషణ్ అవార్డులను అందు కున్నారు. ఆయనకు మరణానంతరం 1971 సంవత్సరానికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వ్యవసాయం ఉద్యమంలా ముందుకు సాగాలి

## మే 29.. చరణ్ సింగ్ వర్ధంతి సందర్భంగా...




పరిశ్రమ కంటే వ్యవసాయం ప్రాధాన్యతను, యాంత్రిక ఉత్పత్తి కంటే ఉపాధి ప్రాధాన్యతను వాదిస్తూ, గాంధీ సూత్రాలతో భారతదేశ అభివృద్ధి కోసంచౌదరి చరణ్ సింగ్ ను చరిత్రకారులు, ప్రజలు 'భారతదేశపు రైతుల విజేత' గా గుర్తించారు. వ్యవసాయపరంగా ఆధిపత్యం కలిగిన మీరట్ జిల్లాలోని గ్రామీణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన స్వతంత్ర భారతదేశంలో ఏకైక ప్రముఖ రైతు నాయకుడు. ఆయన ఉత్తరప్రదేశ్‌లో భూసంస్కరణల ప్రధాన రూపశిల్పి, రాష్ట్రమంతా ఏకరీతిగా వుండేలా భూ కమతాలపై సీలింగ్‌ను తగ్గించే లక్ష్యంతో 1960 భూ హెూల్డింగ్ చట్టం తీసుకురావడంలో ముఖ్యమంత్రిగా కీలకపాత్ర పోషించారు. 1952లో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేస్తున్నప్పుడు జమీందారీ వ్యవస్థను రద్దు చేసే ప్రయత్నాలకు ఆయన నాయకత్వం వహించారు. రుణ విముక్తి బిల్లు 1939 సూత్రీకరణ అమలు ఆయన నాయకత్వంలో జరిగింది. వడ్డీ వ్యాపారుల నుంచి రైతాంగానికి ఉపశమనం కలిగించడమే ఈ బిల్లు లక్ష్యం. 1950లలో ఉత్తరప్రదేశ్ లోని అప్పటి ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లబ్ పంత్ పర్యవేక్షణలో భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అత్యంత విప్లవాత్మక భూ సంస్కరణల చట్టాలను రూపొందించడంలోను, వాటిని ఆమోదించడంలోనూ చరణ్ సింగ్ మంచి గుర్తింపు పొందాడు. దేశాన్ని అనుక్షణం అప్రమత్తతతో కంటికి రెప్పలా కాపాడే సైనికులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే అన్నదాతలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాధాన్యతను గుర్తించే దివంగత మలి ప్రధాని జై జవాన్... జై కిసాన్ అని నినదించారు. రైతును దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు. రైతు అహర్నిశలు శ్రమిస్తే గాని మనకు తినడానికి తిండి దొరకదు. అయితే ఆరు గాలం కష్టపడినా, శ్రమకు ఫలితం లభిస్తుందనే నమ్మకం ఏ నాడూ ఉండదు. లేదు. రైతులు అటు ప్రకృతి మీద ఆధారపడి జీవనం సాగించడం సర్వత్రా కనిపించేదే. అతివృష్టి, అనావృష్టి అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తెస్తున్నాయి. ఒత్తిళ్లు, నష్టాలు, వ్యవసాయ పనుల చాకిరీకి తట్టుకోలేక చాలామంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకు తున్నారు. వేసిన పంటలకు సరిగా దిగుబడి రాక అప్పుల బాధలు భరించలేక, సరైన సమయంలో రుణమాఫీ కాక, దిక్కుతోచని స్థితిలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలు రైతులకైతే స్వంత భూమి కాక, వ్యవసాయ రుణాలు రాక, ప్రభుత్వ సహాయంకు నోచుకోక, యాజమాని కాకపోవడం వల్ల ప్రైవేటు రుణ సాయం దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పంటలు పండిస్తే దళారులు రైతుల శ్రమను చౌకగా కొని ఎక్కువ రేట్లకు కొనుగోలు దార్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు కూలీగా, దళారులు సంపన్నులుగా అవుతున్నారు. పంటల విషయంలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత రైతులకు అవగాహన లేమికి కారణం అవుతోంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గత కాలంలో లాగా కాకుండా ప్రస్తుతం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు బట్వాడా చేస్తున్నాయి. అయితే నకిలీ విత్తనాలు రాకుండా, గిట్టుబాటు ధర ఇవ్వాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలదే. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు దళారీల బారిన పడకుండా చూడాలి. రైతును వివిధ రకాలుగా మోసం చేసే వారిపై కఠిన చర్యలు గైకొనాలి. ప్రభుత్వ చేయూత, ఆర్థిక సాయం, సబ్సిడీలు, రుణ మాఫీలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండి, గతంలో సాగునీటికి పడిన ఇబ్బందుల పరిస్థితి కొంత మెరుగుపడి, సేద్యానికి అవసరమయ్యే సాగు నీరు అధిక శాతం సరఫరా అవుతున్న వేళ...వ్యవసాయం ఉద్యమం రీతిలో ముందుకు సాగాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. చౌదరి చరణ్ సింగ్ చేసిన అనేక ఉద్యమాల వల్ల జమీందారీ చట్టం రద్దై, కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. రైతులకు బ్యాంక్ ఋణాలు అందించే విధానము ప్రవేశ పెట్టబడింది. రైతుల గురించి, వ్యవసాయరంగం గురించి అంతగా ఆలోచించి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన చరణ్ సింగ్ సేవలకు గుర్తుగా ప్రభుత్వము చరణ్ సింగ్ జన్మదినోత్సవాన్ని జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించింది. చరణ్ సింగ్ మూడవ వర్ధంతి (1990, మే 29) సందర్భంగా భారత ప్రభుత్వం చరణ్ సింగ్ చిత్రంతో తపాలా బిళ్లను విడుదల చేసింది.రైతులు మరియు గ్రామీణాభివృద్ధికి ఆయన జీవితాంతం చేసిన కృషికి గుర్తింపుగా, న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ స్మారక సముదాయంలో కిసాన్ ఘాట్ ("రైతుల వేదిక") అని పిలువబడే ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు .

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రేమకు హద్దు లేదు.. కోమాలోకి వెళ్లిన భార్యకు ప్రాణం పోసిన భర్త!





ఈ సృష్టిలో ప్రేమకు మించిన శక్తి లేదు. చరిత్రలో కష్టసమయాల్లో ఆ ప్రేమ చూపిన అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. చైనాలో సరిగ్గా అలాంటి ఒక అద్భుతం జరిగింది. భార్య క్యాన్సర్‌తో పోరాడుతూ కోమాలోకి వెళ్లిపోయింది. బతకడం కష్టమని డాక్టర్లు కూడా ఆశ వదులుకున్నారు. తన చికిత్సకు డబ్బులు వృథా చేయొద్దని, తమ కుటుంబాన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టొద్దని ఆమె భర్తను వేడుకుంది. కానీ ఆ భర్త మాత్రం వెనక్కి తగ్గలేదు. తన ప్రేమను నమ్ముకున్నాడు. ఏకంగా 2,80,000 డాలర్లు (భారత కరెన్సీలో రూ.2 కోట్లకు పైగా) ఖర్చు చేసి, తన భార్యను మృత్యువు నుంచి తిరిగి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో తన ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు. చైనాలోని గువాంగ్జీకి చెందిన 30 ఏళ్ల డెంగ్ యూకాయ్ అనే వ్యక్తి 2016లో యే మెయిడిని ఓ పెళ్లిలో చూసి ఇష్టపడ్డాడు. డెంగ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోవడంతో చిన్న వయసులోనే చదువు మానేసి కూలీగా మారాడు. ఇక యే మెయిడికు గ్లియోమా (%+శ్రీఙశీఝ%) అనే బ్రెయిన్ ట్యూమర్ ఉందని డెంగ్‌కు తెలుసు. ఈ ట్యూమర్ 90 శాతం మళ్లీ వచ్చే అవకాశం ఉంటుంది. అయినా సరే, యే మెయిడి వ్యక్తిత్వాన్ని డెంగ్ అమితంగా ఇష్టపడ్డాడు. ఆమె అనారోగ్యాన్ని లెక్కచేయకుండా పెళ్లికి ప్రపోజ్ చేశాడు. మొదట యే తన అనారోగ్యం కారణంగా నిరాకరించింది. కానీ డెంగ్, ఆమె జీవితకాల పోరాటంలో తాను తోడుగా ఉంటానని నమ్మబలకడంతో యే మెయిడి అంగీకరించింది. 2019లో వారి పెళ్లి జరిగింది. అప్పుడు డెంగ్, యేతో "నేను ఎప్పుడూ నీకు అండగా ఉంటాను, నా మాట ఎప్పటికీ తప్పను" అని మాటిచ్చాడు. 2021లో వారికి హన్వాన్ అనే ముద్దుల కుమార్తె పుట్టింది. కానీ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. ఒక సంవత్సరం తర్వాత యేకు మళ్లీ గ్లియోమా తిరగబెట్టింది. ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. కోమాలోకి వెళ్లడానికి ముందు, యే డెంగ్‌తో "నా కోసం డబ్బులు వృథా చేయొద్దు, నన్ను పోనివ్వు" అని చెప్పింది. ఆమె మాటలు డెంగ్‌ను మరింత కలిచివేశాయి.డెంగ్ ఆమె కోసం రెండు సర్జరీలు చేయించాడు. కానీ అవి విఫలమయ్యాయి. డాక్టర్లు కూడా తను దక్కదు ఆశలు వదిలేసుకోమని చెబుతారు. చేసేదేమీ లేక, డాక్టర్ల సలహా మేరకు డెంగ్ తన భార్యను ఇంటికి తీసుకువచ్చాడు. కుటుంబ సభ్యులు చివరిసారి వీడ్కోలు చెప్పడానికి వచ్చారు. ఇంటి దగ్గర వారి కూతురు హన్వాన్, కోమాలో ఉన్న తల్లి యే చెంపపై ముద్దు పెట్టుకుంది. డెంగ్ ఆ పవిత్ర క్షణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. డెంగ్ పోస్ట్ చేసిన ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయ్యింది. ఆ వీడియో చూసిన నెటిజన్లు కంటతడి పెట్టారు. డెంగ్‌కు ధైర్యం చెప్పడమే కాకుండా చికిత్స కోసం డబ్బులు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత డెంగ్ యేను తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. మూడు నెలల తర్వాత, యే కోమా నుంచి బయటకు వచ్చింది. రెండు నెలల తర్వాత మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టింది. ప్రతిరోజూ కోమాలో ఉన్న భార్యను సంతోషపెట్టడానికి పాటలు పాడుతూ, ఆమెతో కలిసి నాట్యం చేసేవాడు. ఇప్పుడు యే ఒక చిన్న దుకాణాన్ని కూడా నడుపుతోంది. ఈ జంటకు సోషల్ మీడియాలో దాదాపు 20 లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు.

# ఫేక్‌న్యూస్ వార్నింగ్.. జవాన్లపై దాడి వీడియో నిజం కాదు.. కేంద్రం క్లారిటీ!

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక నకిలీ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. మన జవాన్లపై దాడి జరిగినట్లుగా చూపించే ఈ వీడియోపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. జమ్మూకశ్మీర్‌లో సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా, వారి కాన్వాయ్‌పై కొందరు రాళ్ల దాడి చేసినట్లుగా ఈ వీడియో సర్క్యులేట్ అవుతోంది. అయితే, ఈ వీడియోను నమ్మవద్దని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం తన పోస్టులో ఇలా పేర్కొంది: "ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం. షేర్ అవుతున్న వీడియో పాతది. అది కూడా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌కు సంబంధించినది. అప్రమత్తంగా ఉండండి. ఇలాంటి వీడియోను షేర్ చేయొద్దు." అని స్పష్టం చేసింది. నకిలీ వార్తలను ఎదుర్కొనేందుకు జరుగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలని పీఐబీ పిలుపునిచ్చింది. ఏవైనా అనుమానాస్పద వీడియోలు లేదా సమాచారం





కనిపిస్తే, పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ వాట్సప్ నంబర్ 8799711259 లేదా E-mail: factcheck@pib.gov.in కు పంపాలని కోరింది. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించే ఈ రోజుల్లో, ఇలాంటి ఫ్యాక్ట్‌చెక్‌లు చాలా కీలకమని కేంద్రం ఉద్ఘాటించింది. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు వేగంగా వ్యాపించి సమాజంలో అనవసరమైన భయాందోళనలు, అశాంతిని సృష్టించే అవకాశం ఉంది. ముఖ్యంగా జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో తప్పుడు సమాచారం ప్రజలను తప్పుదోవ పట్టించవచ్చు. కాబట్టి, ఏదైనా వీడియో లేదా వార్తను షేర్ చేసే ముందు అది నిజమా కాదా అని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం. కేంద్రం ఇచ్చిన ఈ స్పష్టతతో ప్రజలు తప్పుడు సమాచారం పట్ల అప్రమత్తంగా ఉంటారని ఆశిద్దాం.

# పహల్గాం దాడి జరిగిన చోటే మంత్రుల సమావేశం..

## సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక ప్రకటన!

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్ర దాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. అయితే, ఈసారి ప్రభుత్వం భయపడి వెనక్కి తగ్గకుండా ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన మంత్రుల బృందంతో కలిసి, శ్రీనగర్ లేదా జమ్మూలోని తమ సాధారణ ఆఫీసుల్లో కాకుండా నేరుగా పహల్గాం వెళ్లి క్యాబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఇది కేవలం ఒక మీటింగ్ కాదు ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు తాము భయపడబోమని, ప్రజలకు అండగా ఉంటామని చెప్పే ఒక గట్టి జవాబు అని చెప్పొచ్చు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ అనే ప్రాంతంలో జరిగిన దాడిలో అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. దీంతో పర్యాటకంపైనే ఆధారపడి జీవనం సాగించే స్థానిక ప్రజలు భయపడిపోయారు. వారి



భయాలను పోగొట్టడానికి, వారికి ధైర్యం చెప్పడానికే సీఎం ఒమర్ అబ్దుల్లా ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. "మేం మా ప్రజల ధైర్యాన్ని చూసి గర్విస్తున్నాం. పర్యాటకాన్ని తిరిగి ప్రోత్సహించడానికి మేము పహల్గాం వచ్చాం. మా ప్రయత్నాలు కొనసాగుతాయి" అని ఒమర్ అబ్దుల్లా మీడియాతో అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన ఈ సమావేశం దృశ్యాలను ఆయన తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు మేము ఏమాత్రం భయపడబోమని చెప్పడానికే ఇక్కడికి వచ్చాం. జమ్మూకశ్మీర్ దృఢంగా నిలబడుతుంది" అని ఆయన పోస్ట్‌లో రాశారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇలా రాజధాని నగరాల బయట క్యాబినెట్ సమావేశాలు నిర్వహించడం కొత్తేమీ కాదు. 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ ఆయన గురెజ్, మచిల్, తాంగ్‌ధర్ (ఉత్తర కశ్మీర్), రాజౌరీ, పూంచ్ (జమ్మూ ప్రాంతం) వంటి మారుమూల ప్రాంతాల్లోనూ ఇలాంటి మీటింగ్స్ పెట్టారు. ఇది ఆయన పాలనా శైలిలో ఒక ముఖ్యమైన భాగం. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించే నీతి ఆయోగ్ సమావేశాన్ని కూడా పహల్గాంలోనే నిర్వహించాలని ఒమర్ అబ్దుల్లా కోరారు. ఇలాంటి చర్యలు స్థానిక ప్రజలలో ఉగ్రవాదం పట్ల ఉన్న భయాలను తగ్గిస్తాయని, ప్రభుత్వం తమకు అండగా ఉందని వారికి నమ్మకం కలిగిస్తాయని ఆయన నమ్ముతున్నారు. దాడి జరిగిన ప్రాంతంలోనే మంత్రులు సమావేశం కావడం ద్వారా, ప్రజలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, పర్యాటకాన్ని తిరిగి గాడిలో పెడుతుందని స్పష్టమైన సందేశం పంపారు.

చురకలు

## సంపాదకీయం

# పాక్-ఇరాన్ కొత్త స్నేహం.. చేతులు కలిపిన బద్ధశత్రువులు.. భారత్‌పై దాని ప్రభావం ఎంత?

గతేడాది ఒకరిపై ఒకరు బాంబులు వేసుకున్న దాయాది దేశం పాకిస్థాన్, ఇరాన్ ఇప్పుడు తిరిగి చేతులు కలుపుతున్నాయి. పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఇరాన్ పర్యటన తర్వాత ఈ పరిణామాలు మరింత స్పష్టమయ్యాయి. ప్రపంచ దేశాల ముందు భారత్‌ను దౌత్యపరంగా ఒంటరి చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. ఇరాన్‌తో ఈ కొత్త బంధం భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అసలు ఒకరిపై ఒకరు అనుమానంగా చూసుకునే ఈ రెండు దేశాలు ఎందుకు ఒక్కటవుతున్నాయి? దీని వెనుక ఉన్న అసలు కారణాలేంటో తెలుసుకుందాం. పాకిస్థాన్, ఇరాన్ రెండు దేశాలు ప్రస్తుతం దాదాపు ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ఇజ్రాయెల్ గాజాపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇది ఇరాన్ మద్దతు ఉన్న హమాస్‌కు బలహీనమైన కోట. మరోవైపు ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్ర ఆందోళన చెంది, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఇది దాదాపు అరగంటలోపే సక్సెస్ అయింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ రెండు ముస్లిం దేశాలు తమ శత్రువులను ఎదుర్కోవడానికి దౌత్యపరంగా ఏకమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇది వారి మధ్య శత్రుత్వాన్ని వదిలి మళ్లీ చేతులు కలపడానికి ప్రేరణగా నిలిచిందని విశ్లేషకులు భావిస్తున్నారు. పహల్గాం దాడి తర్వాత భారత్, ఇరాన్, పాకిస్థాన్‌లలోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రతిదాడికి ఈ రెండు దేశాలు ఎలాంటి స్పందన ఇవ్వలేదు. అయితే, ఈ మధ్య పాకిస్థాన్‌ను పరోక్షంగా సమర్థిస్తూ, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇరాన్ సూచించింది. ఇది కూడా రెండు దేశాల మధ్య స్నేహం మళ్లీ చిగురించడానికి ఓ కారణం కావచ్చు. షెహబాజ్ షరీఫ్, ఇరాన్ నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మధ్య ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్', పీఓకే (పాక్ ఆక్రమిత కాశ్మీర్) అంశాలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం షెహబాజ్ షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఎల్లప్పుడూ శాంతియుత చర్చల ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని, అయితే భారత్ కూడా దీనికి అంగీకరించాలని అన్నారు. తర్వాత ఖమేనీ 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య విభేదాలు వీలైనంత త్వరగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఇప్పటికే రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించింది. అయితే, భారత్ తన వైఖరిని మార్చుకుంటూ కాశ్మీర్ ఒక ద్వైపాక్షిక సమస్య అని, ఇందులో ఏ మూడవ పక్షం జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, పాకిస్థాన్ ఎప్పుడూ ఇజ్రాయెల్‌తో సంబంధాలు పెట్టుకోలేదు. కొన్ని ఇస్లామిక్ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చినా, పాకిస్థాన్ మాత్రం పాలస్తీనియన్లకు మద్దతునిచ్చింది. ఇది కూడా రెండు దేశాల మధ్య స్నేహానికి ఒక కారణం. గతేడాది ఇరాన్, పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో ఉన్న జైష్ అల్-ఆదిల్ ఉగ్రవాద శిబిరాలపై మిసైల్ దాడులు చేసింది. ఈ ఉగ్రవాద సంస్థ ఇరాన్‌లోని సిస్తాన్, బలూచిస్థాన్ ప్రాంతాల స్వాతంత్ర్యం కోసం పోరాడుతోంది. ఇరాన్ చేసిన ఈ దాడుల్లో అమాయక పాకిస్థాన్ పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన పాకిస్థాన్, ఇరాన్‌లోని కొన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసింది. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను అమాంతం పెంచింది. ఇలాంటి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని సంవత్సరం తర్వాత టెహ్రాన్ పర్యటించడం, ఆ దేశంతో బలపడుతున్న సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. ఖమేనీ తన 'ఎక్స్' ఖాతాలో ఇరాన్, పాకిస్థాన్ సంబంధాలను ఒక వేదికగా అభివర్ణించారు. రెండు దేశాలు సోదర దేశాలని, చిన్న చిన్న గొడవలు సహజమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్న సమయంలో ముస్లిం దేశాల మధ్య ఐక్యత ఉండాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్, ఇరాన్ చేతులు కలుపుతున్నప్పటికీ భారత్ మాత్రం జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. ఇరాన్‌తో మంచి సంబంధాలను కొనసాగిస్తూనే మే 9 తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రితో 20వ భారత్-ఇరాన్ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి, ఈ లక్ష్యాన్ని సాధించడానికి పరస్పరం సహకరించుకోవాలని వారు నిర్ణయించారు.

# ఆహారపు అలవాట్లపై అవగాహన అవసరం - మే 29న... ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినం

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రతి ఒక్కరూ వారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. మనిషి బతకడానికి తిండి అత్యవసరం. అయితే తిన్న తిండి జీర్ణం కావడం అతి ముఖ్యం. అందుకే ఎలాంటి ఆహారం తినాలి? ఎంత తినాలి? అదెంత శుభ్రంగా ఉండాలి? ఉప్పు, కారం వంటి వాటితో పాటు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలి? అనే అంశాలపై కనీస అవగాహన ఉండి తీరాలి. ఆరోగ్యానికి ఆహారమే పునాది. రోజును ఆరోగ్యకరమైన అల్పాహారంతో ప్రారంభించాలి. చాలావరకు జబ్బులకు గతి తప్పిన ఆహార అలవాట్లే కారణం. భోజనం చేసేటప్పుడు ప్రశాంతంగా ఉండాలి. భోజనం మీదే దృష్టి పెట్టి, రుచిని ఆస్వాదిస్తూ తినాలి. బాగా నములుతూ, నెమ్మదిగా తినాలి. పూర్తిగా నమలి తింటే ఆహారం బాగా జీర్ణమై, పోషకాలు సరిగా ఒంట పడతాయి. ఆహారంలో ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు అన్నీ సమతులంగా ఉండేలా చూసుకోవాలి. రోజుకు 400 గ్రాముల పండ్లు, కూరగాయలు తినాలన్నది ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు. వీటిల్లో 150 గ్రాముల పండ్లు, 250 గ్రాములు కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. మనిషి ఆరోగ్యం జీర్ణ వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. కొవ్వు పదార్థాలు కాకుండా, ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా జీర్ణ క్రియ సమస్యలు మటుమాయం అవుతాయి. గుండె, ఎముకల ఆరోగ్యం, శరీరంలోని మిగిలిన భాగాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వెనుక జీర్ణ వ్యవస్థ పనితీరు చాలా ముఖ్యం. ఆరోగ్యం మన చేతుల్లో ఉండాలంటే , జీర్ణవ్యవస్థలో ప్రధానమైన కాలేయం ను జాగ్రత్తగా కాపాడు కోవాలి. జీర్ణ వ్యవస్థలో వచ్చే మార్పుల ద్వారా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యల వల్ల గుండె మంట, కడుపు నొప్పి, అతిసారం,




కడుపు ఉబ్బరం, వికారం, వాంతులు కలిగే అవకాశం ఉంటుంది. చిరు తిండ్లు, ఘాటైన ఆహారం అధిక కెఫిన్, పంచదార సేవనం, తదితర అనారోగ్యకరమైన ఆహారం వల్ల ఉదర నాళంలో సమస్యలు వస్తాయి. అధిక కొవ్వుతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల పేగుల గీతలలో మార్పులు కలిగించి ఉదర నాళంలో కణితులు ఏర్పడే అవకాశం కలుగుతుంది. ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల, ఐబిడి, హెమరాయి, మలబద్ధం కలిగిన వ్యాధులను నివారించ వీలు కలుగుతుంది. తీసుకునే ఆహారంలో సరిపడా ప్రొటీన్ ఉండేలా, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. జీర్ణ వ్యవస్థ ప్రక్రియను తగ్గించే అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని పరిమితం చేసుకోవాలి. వంటకాల్లో ఆలీవ్ ఆయిల్ను వినియోగించడం చేయాలి. ఆహారం జీర్ణం కావడానికి సమయం ప్రకారం ఆహారాన్ని తీసుకోవడం అతి ముఖ్యం. పసిరకలు, పానిక్రియాస్ సమస్యలతో పాటు మలబద్ధకం, మలంలో రక్తం రావడం, కొలన్ క్యాన్సర్ వంటి సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు తరుచూ వస్తుంటాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. నిరంతర ఒత్తిడి వల్ల కూడా అల్సర్ రావడానికి అవకాశాలు ఉంటాయి. మామూలుగా త్రేన్పులు వచ్చినా, అపాన వాయువులు ఎక్కువగా వచ్చినా గ్యాస్ట్రిక్ సమస్య ఏర్పడిందని అనుకోవడం, అలా ప్రపంచంలో గ్యాస్ట్రిక్ నివారణకు ఏటా రూ లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారు. దోసకాయలు, పుచ్చకాయ, మామిడి మొదలైన పండ్లలో నీరు ఉంటుంది. ఈ పండ్లు అవయవాలను, జీర్ణ వ్యవస్థను శుభ్రపరచ డానికి సహాయ పడతాయి. ఆహారంలో వీలైనంత ఎక్కువ తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు ఉండాలి.

సమతుల్య భోజనం తినడానికి ప్రయత్నించాలి. రుచిగా ఉందని అతిగా తినకుండా చూసు కోవాలి. గింజలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. చిరుతిండి, కృత్రిమ మధుర పదార్థాలు, రంగులు లేదా అధిక చక్కెరను కలిగి ఉన్న అధిక ప్రాసెస్ చేసిన ఆహారాలను నివారించాలి. మానసిక ఒత్తిడి... గుండె సమస్య నుండి జీర్ణ సమస్యల వరకు అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఒత్తిడి స్థాయిల క్రమబద్ధీకణకు వ్యాయామం, ధ్యానం, యోగా, ఇష్టపడేదాన్ని చేయడం, శరీరంపై ఒత్తిడి వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను తగ్గించడంలో సహాయ పడతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పర్వతారోహణ క్రీడకు పెరుగుతున్న ఆదరణ - మే 29...మౌంట్ ఎవరెస్టు దినోత్సవం.




1953 న్యూజీలాండ్కు చెందిన 'సర్ ఎడ్మండ్ హిల్లరీ', నేపాల్కు చెందిన 'టెన్సింగ్ నారే షెర్పా' ద్వయం తొలిసారి అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ పర్వాతాన్ని అధిరోహించి పర్వతారోహణ క్రీడా ప్రపంచ చరిత్రలో రికార్డు సృష్టించారు. 2008లో ప్రఖ్యాత పర్వతారోహకులు ఎడ్మండ్ హిల్లరీ తుది శ్వాస విడిచిన వేళ ఈ చారిత్రాత్మక ఘటనకు గుర్తుగా 29 మే 2008 నుంచి నేపాల్ ప్రభుత్వం 'అంతర్జాతీయ ఎత్తైన ఎవరెస్టు పర్వతం సముద్ర మట్టానికి 8,848, 86 మీటర్ల (29,031.7 " అడుగులు) ఎత్తున ఉన్నది. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమతా' అని అలాగే టిబెటన్లు 'చోమోలున్గమా' పర్వతమని పిలుస్తారు. 1830- 43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. వారి స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. అంతర్జాతీయ ఎవరెస్ట్ దినం వేదికగా పర్వతారోహకులు, ఔత్సాహిక పర్యాటక సంస్థలు పర్వతారోహణ క్రీడ పట్ల అవగాహన కల్పిస్తూ సదస్సులు, కార్యశాలలు ప్రదర్శనలు, ఆసక్తికర పోటీలు నిర్వహిస్తారు.

**పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:** హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్-రేంజ్లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా-నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావరణం, బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, అల్టిట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉ 1 ఎవరెస్ట్ దినం' జరుపు కోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచంలోనే అత్యంత ంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీజన్ బాటిల్ వెంట ఉ న్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రోస్ట్బైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి గర్వంగా దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగర్వంగా దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

**పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:** నేటి వరకు 4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు సాహిత్యానికి ఇంద్రగంటి ఎనలేని సేవలు - మే 29...ఇంద్రగంటి శ్రీకాంత శర్మ జయంతి




తెలుగు సాహితీ ప్రపంచంలో సుపరిచితులైన సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ దాదాపు లేదనే చెప్పాలి. పండిత వంశంలో జన్మించి, సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, సినిమా పాటలు రాసిన కవిగా, పండితునిగా, కథా రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్ర పురంలో శ్రీకాంత శర్మ మే 29 1944 న జన్మించారు. ఆయన తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి. తెలుగు పొట్టి కథలకు "కథానిక" అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి కావడం మూలాన, చిన్ననాటి నుండే సాహిత్య వాతావరణం లో పెరిగిన శ్రీకాంత శర్మ, విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం చేపట్టారు. తెలుగులో ఎం. ఏ. పట్టభద్రులై, తర్వాత అభ్యుదయ కవిగా శర్మ పేరొందారు. అనేక? లలిత గేయాలు కవితలు, సాహిత్య వ్యాసాలతో పాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలను రచించారు. జన్మనిచ్చిన పితృ దేవుల వారసత్వాన్ని నిలబెట్టడంతో పాటు, అర్థవంతమైన రచనలెన్నో చేసి, సాహితీ ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు శ్రీకాంత శర్మ. అపురూపమైన భావావేశం సొంతం చేసుకొని, ఆవేశాన్నైనా, ఆవేదననైనా అక్షరాల్లో లయబద్ధంగా అమర్చ గలగడం, పాఠకుల మనసులతో పాటు, మెదళ్ళనీ రచనల ద్వారా కదిలించ గలగడం శ్రీకాంత శర్మ ప్రత్యేకతలు. పలు తెలుగు సినిమాల్లో ఆయన పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాల రావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడి బొమ్మ', 'చైతన్య రథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రాశారు. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఉప సంపాదకులుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టినా, కొంతకాలం సినిమా రంగంలో పని చేసినా, ఆలిండియా రేడియోలో అడుగు పెట్టాకనే శ్రీకాంతశర్మ సృజనాత్మకత పూర్తిగా రెక్కలు విప్పుకుంది. ఆయన రచించిన ఎన్నో సంగీత రూపకాలు జాతీయ స్థాయిలో బహుమతులు అందు కున్నాయి. ఆయన రచించిన లలిత గీతాలు ఈనాటికీ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. తెలుగు నాటక రంగానికీ, తెలుగు సాహిత్య రంగానికీ ఆయన చేసిన కృషి ఎన్నదగినది. 1976లో ఆకాశవాణి విజయ వాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్ గా శర్మ చేరాడు. తెలుగు ప్రసంగాల శాఖకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికులు ఉషశ్రీకి సహాయకునిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. శర్మ వివిధ పత్రికలలో గేయాలు, కవితలు, సాహిత్య వ్యాసాలు వ్రాశారు. అనేక రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలు రచించారు. రేడియో ప్రసంగాలు చేశాడు. 1994లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా నిజామాబాద్ కేంద్రంలో పని చేశాడు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు. 1977లో అనుభూతి గీతాలు కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం, 1979లో నూతలపాటి సాహితీ పురస్కారం, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో అమరామరం డాక్యుమెంటరీకి ప్రథమ బహుమతి, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో వర్షానందిని సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1986లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నేనుకాని నేను సృజనాత్మక రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మాటా - మౌనం సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నిశ్శబ్దగమ్యానికి ద్వితీయ బహుమతి, 1990లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మెట్లకు ద్వితీయ బహుమతి, తదితరాలు సొంతం చేసుకున్నారు. ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. నవలా రచయిత్రిగా, రేడియో కళాకారిణిగా, లఘు కథల రచయిత్రిగా, కవయిత్రిగా సుపరిచితులు. కుమార్తె కిరణ్మయి కూడా లఘు చిత్రాలు తీస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. కుమారుడు ఇంద్రకంటి మోహన కృష్ణ సినీ దర్శకునిగా మంచి గుర్తింపు పొందారు. దర్శకునిగా ఆయన తొలి చిత్రం 2004లో గ్రహణంకు భారత జాతీయ చలన చిత్ర పురస్కారం, ఉత్తమ నూతన దర్శకులుగా నంది పురస్కారంతో పాటు ఆ సినిమాకు 11 అవార్డులు దక్కడం విశేషం. 2006లో మాయాబజార్, 2008 లో అష్టా చమ్మా, 2011లో గోల్కొండ హైస్కూల్, 2013లో అంతకు ముందు ఆ తర్వాత ( ఉత్తమ కథా రచయిత గా నంది అవార్డు), 2015లో బందిపోటు, 2016లో జెంటిల్ మాన్, 2017 లో అమీతుమీ, 2018లో సమ్మోహనం, 2020లో వి. తదితర చిత్రాలలో తన ప్రతిభను చాటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కన్నడ రెబల్ స్టార్ అంబరీష్ - మే 29...అంబరీష్ జయంతి

అంబరీష్ ( 1952 మే 29 - 2018 నవంబర్ 24 ) సినిమా నటుడు, రాజకీయ నాయకుడు. కన్నడ సూపర్‌స్టార్, రెబల్ స్టార్. అంబరీష్ అసలు పేరు మాలవల్లి హుచ్చే గౌడ్ అమర్నాథ్. ఆయన 1952 మే 29వ తేదీన మైసూర్ స్టేట్ (ప్రస్తుత కర్ణాటక రాష్ట్రం), మండ్య జిల్లా, దొడ్డ రాశినకెరే గ్రామంలో హుచ్చె గౌడ, పద్మమ్మ దంపతుల ఏడుగురు సంతానంలో ఆరవ వాడిగా జన్మించాడు. ఆయన పోషించిన పాత్రలకు గాను రెబెల్ స్టార్ గా పేరు పొందాడు. ఆయనకు మాండ్యా మనిషి అనే ముద్దు పేరు ఉంది. అమర్‌నాథ్ ప్రాథమిక విద్యా భ్యాసం మండ్య పట్టణంలో జరిగింది. మైసూరులో ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. సినిమాల్లో మొదటగా ప్రతినాయక పాత్రలు పోషించి తర్వాత కథానాయకుడిగా మారి సుమారు ఐదు దశాబ్దాల పాటు సినీ రంగంలో ఉన్న ఆయన 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు తెలుగు సినిమాల్లోనూ కీలకపాత్రలు పోషించారు. ఆయన చివరి సినిమా 'అంబి నింగే వయస్సాయ్తో' సైతం బాక్సాఫీసు వద్ద కలెక్షన్లు కురిపించింది. ప్రముఖ కన్నడ చలనచిత్ర దర్శకుడు పుట్టణ్ణ కనగాళ్ తన నాగరహావు చిత్రానికి ప్రతినాయకుని పాత్రకు సరైన నూతన నటుని కోసం వెదుకుతూ అంబరీష్‌ను ఎంపిక చేశాడు. ఆవిధంగా అంబరీష్ 1972 తొలి సారిగా సినిమాలలో అడుగు పెట్టాడు. ఇదే నాగరహావు చిత్రం ద్వారా విష్ణువర్ధన్ కథా నాయకునిగా పరిచయ మయ్యాడు. అప్పటి నుండి అంబరీష్ అనేక కన్నడ, తమిళ, మలయాళ, తెలుగు, హిందీ చిత్రాలలో నటించాడు. ఇతడు అత్యధిక సినిమాలలో నటించి రాజ్‌కుమార్ (206 చిత్రాలు), విష్ణువర్ధన్ (230 చిత్రాలు)ల రికార్డును బద్దలు చేశాడు. చక్రవ్యూహ, నాగరాహువు, రంగనాయకీ, మసండ హూవు, గండు బేరుండ' వంటి పలు ప్రఖ్యాత ప్రేక్షక, అభిమానుల ఆదరణ పొందిన సినిమాలు ఆయన ఫిల్మోగ్రఫీలో ఉన్నాయి. చిరంజీవి 'శ్రీమంజునాథ' సినిమాలో మహరాజు పాత్రలో అంబరీష్ కనిపించాడు. ఆ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కింది. అంబరీష్, ప్రముఖ తెలుగు నటి సుమలత హీరో హీరోయిన్లుగా 'ఆహుతి, అవతార పురుషా, శ్రీమంజునాథ, కల్లరాలై హూవగీ' తదితర సినిమాల్లో నటించారు. వీరి పరిచయం ప్రేమగా మారడంతో 1992లో సుమలత అంబరీశ్ వివాహం చేసుకున్నారు. వారి కుమారుడు అభిషేక్ గౌడ కూడా సినిమా నటుడే. 1994 లో అంబరీష్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. నటనకు స్వస్తి చెప్పిన ఆయన కన్నడ రాజకీయాల్లో కీలక పాత్రను పోషించాడు. కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించాడు. 1996 ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కక పోవడంతో జనతాదళ్ పార్టీలో చేరి 1998 నుంచి మండ్య నియోజక వర్గం నుండి ఎన్నిక య్యాడు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరి రెండు పర్యాయాలు మాండ్య లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందాడు. 1998 నుంచి 2009 వరకు లోకసభ సభ్యుడిగా కొనసాగారు. 2006 నుంచి 2008 వరకు14వ లోక్‌సభలో కేంద్రమంత్రి వర్గంలో సమాచార శాఖా మంత్రిగా కొనసాగారు. కావేరి జలాల విషయంలో నిరసనగా తన పదవికి రాజీనామా చేశాడు. 2009లో సాదరణ ఎన్నికల్లో పరాజయం పాలయ్యాడు. 2013 ఎన్నికల్లో శాసనసభకు ఎన్నికైన అంబరీష్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. అనారోగ్యం కారణంగా తర్వాతి ఎన్నికలలో పోటీ చేయలేదు. సహాయం కోసం వచ్చే ఎవరినీ అంబరీష్ వట్టి చేతులతో పంపేవాడు కాదనీ, సాయం చేసి, ధైర్యం నింపేవారని చెప్పేవారు. కన్నడ ఇండస్ట్రీ 'ట్రబుల్ షూటర్' అనే పేరుని గడించాడు. ఇండస్ట్రీలో ఎటువంటి మనస్పర్థలు ఏర్పడినా, చిన్న చిన్న గొడవలైనా కూడా వాళ్ల మధ్య సఖ్యత కుదిర్చే వారట. పలు రాష్ట్ర ప్రభుత్వ, ఫిలింఫేర్ అవార్డులు ఆయనకు లభించాయి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎన్.టి.ఆర్. పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటుడు పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం, కర్ణాటక ప్రభుత్వం నుండి విష్ణువర్ధన్ పురస్కారం మొదలైన పురస్కారాలు లభించాయి. 2005లో ఆయన ఎన్టీఆర్ జాతీయ అవార్డును అందుకున్నారు.



2013లో ధార్వాడ్ యూనివర్సిటీ ఆయనను డాక్టరేట్‌తో సత్కరించింది. ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ, 2018, నవంబర్ 24 శనివారం సాయంత్రం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అభిమాన నటుడు అంబరీష్ తుదిశ్వాస విడిచాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## తాత్కాలిక మరమ్మతులు ఎన్నాళ్లు నిలిచేను..!

కోనరావుపేట: జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కాజ్‌వేల నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కనీస చర్యలు చేపట్టక పోవడంతో ఈసారికూడా ఇబ్బందులు తప్పేలా లేవని ప్రయాణికులు అంటున్నారు. జిల్లాలో వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి మండలాల్లో అటవీ ప్రాంత గ్రామాలున్నాయి. ఈ మండలాల గుండా పొరుగునే ఉన్న జిల్లాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పలుచోట్ల కాజ్‌వేలు, కల్వర్టుల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిఏటా వర్షాకాలంలో వరద తీవ్రతకు కాజ్‌వేలు కోతకు గురై రాకపోకలు నిలిచిపోవటం పరిపాటిగా మారింది. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు మూడు మాసాలు గడిచిన తరువాత కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇందుకోసం రూ.లక్షల వ్యయం అవుతుండగా సమస్య ఎప్పటిలాగే ఉంటోంది.

**ఏటా అదే సమస్య...**

కోనరావుపేట మండలం కొండాపూర్-వెంకట్రావుపేట గ్రామాల మధ్య పెంటి వాగు, నిజామాబాద్-మామిడిపల్లి, బావుసాయిపేట-



వెంకట్రావుపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై నిర్మించిన కాజ్‌వేలు గత మూడేళ్లుగా వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయి. మూలవాగు పరీవాహక గ్రామాల రైతులు, వాహనదారులు మండల, జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించటానికి సుమారు 20 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. సరైన సమయంలో వ్యవసాయ పనులు చేసుకోవటానికి ఇబ్బందిగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు వర్షం కురిసి వాగు ప్రవహిస్తే ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు**

సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి కోనరావుపేట, మరిమడ్ల, సిరికొండ మీదుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రెండు వరుసల తారు రోడ్డు సౌకర్యం ఉంది. వర్షాకాలంలో పెంటివాగు వద్ద కాజ్‌వే మూడేళ్లుగా కోతకు రెండు, మూడు నెలలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి రావటంతో సుమారు 50 కిలో మీటర్ల మేర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు.పుల్కం ప్రశాంత్, వాహనదారుడు మరిమడ్ల

**నిధులు వృథా**

మూలవాగు, పెంటి వాగుపై నిర్మించిన కాజ్‌వేలు కోతకు గురవుతున్నాయి. కోతకు గురైన కాజ్‌వేలకు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతు చేపట్టినా నిధులు నీటి పాలవుతున్నాయి. కాజ్‌వేలపై అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కూరుకుపోతున్నాయి. మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి.గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బావుసాయిపేట

## కొనసాగుతున్నాయ్..!

ధర్మపురి : నూతన విద్యా సంవత్సరానికి మరో 17 రోజులే మిగిలి ఉంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు కొత్త రంగులు, హంగులతో స్వాగతం పలుకుతాయని భావిస్తున్న పల్లె విద్యార్థులకు ఈ సారి కూడా నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలనే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వం గతేడాది పనులు ప్రారంభించినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దాదాపుగా 75 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పనులు పూర్తయిన చోట సరికొత్తగా విద్యార్థులను ఆహ్వానించనుండగా, కొన్నిచోట్ల అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవనున్నాయి. అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి నిలిపి మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో 517 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులు ప్రారంభించారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు, భవన మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి సూచించిన పనులు చేపట్టాలని భావించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రత్యేక అవసరాల కింద పరిగణనలోకి తీసుకొని 2024 జూన్ నాటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పనులు 75 శాతం పూర్తయినట్లు, వీటిని ప్రారంభం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన పనులు ఎందుకు పూర్తి చేయడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది.

సారంగాపూర్ మండలంలోని 21 పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్తు, తరగతి గదుల మరమ్మతు, మూత్రశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. మండలంలోని రంగపేటలో తాగునీటి వసతి పూర్తి కాగా, నాగునూర్‌లో పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. బాలికల మూత్రశాలలు ఎక్కడా పూర్తి కాకపోవడంతో అవస్థలు తప్పేలా లేవు. పలు పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో ఆరు బయటనే కొనసాగుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తేనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు మౌలిక వసతులు సమకూరి ఇబ్బందులు తప్పనున్నాయి.

ఇది ధర్మపురి పట్టణంలోని ప్రాథమిక పాఠశాల. ఇక్కడ సుమారు రూ.లక్ష వ్యయంతో పాఠశాల పైకప్పు మరమ్మతు, ఇతర పనులు పూర్తి చేశారు. సంపు, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. దీనికి మరో రూ.లక్ష వరకు నిధులు అవసరం అవుతాయి. ఈ నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

**ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..**

ధర్మపురి మండలంలో మిగిలిన పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను జూన్ నెలారంభం వరకు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. సీతాలక్ష్మి, ఎంఈవో ధర్మపురి

## ఉత్పత్తి స్వల్పం.. దిగుమతి అధికం



జగిత్యాల : కూరగాయల ధరలు ఓసారి అమాంతం తగ్గి రైతులు.. మరోసారి అధిక ధరలతో వినియోగదారులు నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 వేల ఎకరాల్లో నిరంతరం కూరగాయలను పండిస్తేనే ధరలు స్థిరంగా ఉంటాయి. ప్రతికూల వాతావరణం, మార్కెట్లో ధరల నిలకడలేమితో సాగు 4-8 వేల ఎకరాలను దాటడంలేదు. దీంతో కూరగాయల రకాలనుబట్టి జిల్లా అవసరాలకు కావాల్సిన 20-90 శాతం వరకు ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి కూరగాయలను తేవటంతో రవాణాలో చెడిపోవటం, స్థానికంగా నిల్వ నష్టాలతో ధరలు అమాంతం పెరిగి వినియోగదారులు ఆర్థిక భారానికి గురవుతున్నారు.

**ఇలా ప్రోత్సహిస్తే..**

కూరగాయల విత్తనాలు అత్యంత ఖరీదుగా ఉంటాయి కాబట్టి గతంలో మాదిరిగా 50 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేయాలి. ఉమ్మడి జిల్లా జనాభాకు అనుగుణంగా రాయితీపై 260 ఎకరాల్లో పాలీహౌజులను మంజూరివ్వాలి. పరిమితులు విధించకుండా రైతులందరికీ షేడ్‌నెట్హౌజులు, గ్రీన్‌నెట్స, బిందు, తుంపరసేద్య పరికరాలు, మల్చింగ్ షీట్లు, పందిళ్ల స్తంభాలు, తీగలు, కూరగాయలను తరలించే ప్లాస్టిక్ పెట్టెలు, వాహనాలను రాయితీపై ఇవ్వాలి. కూరగాయల పంటలకు ఫసల్‌బీమాను అమలు చేయాలి. కూరగాయల నిల్వకు శీతల గిడ్డంగుల వసతి కల్పించాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ఎగుమతులు, దిగుమతులను ప్రోత్సహించాలి. రైతుబజార్లు, సమీకృత మార్కెట్లలో రైతులకే విక్రయ అవకాశాలు కల్పించాలి.

**ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు అంతంతే**

ఉమ్మడి జిల్లాలో అవసరమున్న కూరగాయలు: 845 క్వింటాళ్లు

స్థానికంగా ఉత్పత్తి అవుతున్నవి: 312 క్వింటాళ్లు

దిగుమతి చేసుకుంటున్నవి: 533 క్వింటాళ్లు

ఎక్కడి నుంచి దిగుమతి చేస్తున్నారు: వంటిమామిడి మార్కెట్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలు

ఏయే రకాలు దిగుమతి చేస్తున్నారు: పచ్చిమిరప, బీర, దొండ, క్యాప్సికం, చిక్కుడు, కొత్తిమీర, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, కాకర, బీట్రూట్, టమాట తదితరాలు

స్థానికంగా ఉత్పత్తి అవుతున్నవి: వంగ, బెండ, ఆకుకూరలు, టమాట తదితరాలు.

**అన్నిరకాల పంటలకు అనుకూలం**

సారవంతమైన భూములు, సాగునీటి వసతి, వాతావరణ పరిస్థితులు అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలను పండించేందుకు అత్యంత అనువుగా ఉన్నాయి. ప్రతిరైతు కనీసం కొద్ది విస్తీర్ణంలోనైనా కూరగాయలను పండించాలి. పేరున్న ప్రైవేటు కంపెనీల సంకర విత్తనాలను తీసుకోవాలి, ఎత్తుమడులు, బోదెలపై విత్తుకోవాలి. డాక్టర్ ఇ.రజనీకాంత్, శాస్త్రవేత్త

మేలైన విత్తనాలు రాయితీపై ఇవ్వాలి చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడినిచ్చే మేలైన వంగడాలను ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇవ్వాలి. స్థానికంగా ఉద్యాన శాస్త్రవేత్తలను నియమించి రైతులకు సాగు సలహాలు ఇప్పించాలి. రైతులు పండించిన ఉత్పత్తులను మాల్స్‌కు తరలించేలా ఉద్యానశాఖ మధ్యవర్తిత్వం ఉండాలి. వెంకటేశ్, రైతు

## ఇదేం క్రమబద్ధీకరణ



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరపాలికలు, మున్సిపాలిటీల్లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిష్కారం గందరగోళంగా తయారైంది. రూ.వెయ్యి చెల్లించిన వారందరూ క్రమబద్ధీకరణ చేసుకోవాలని అధికారులు చెబుతుండగా సాంకేతిక సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రుసుం చెల్లించేందుకు ఉన్న అర్జీలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు 25శాతం రాయితీ గడువు ఈ నెలాఖరు వరకు పెంచారు. ప్రభుత్వం గడువు పొడిగిస్తుండగా క్షేత్రస్థాయి అధికారులు అనుసరిస్తున్న తీరు, వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సమస్యలతో ఫీజు చెల్లించేందుకు ముందుకొస్తున్న వారంతా వెనక్కి తగ్గుతున్నారు.

**ఇంతకీ ఎల్-1 అధికారి ఎవరు?**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఎల్-1 అధికారి ఎవరో వెబ్‌సైట్‌లో చూపించడం లేదు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆ బాధ్యతలు చూస్తారు. వారు క్రమబద్ధీకరించే స్థలాన్ని పరిశీలించి ఆమోదించాల్సి ఉండగా వారు రేపు, మాపు అంటూ తిప్పుతున్నారు.

**వెబ్‌సైట్‌లో వివరాలేవీ?**

వెబ్‌సైట్ ఎప్పటికప్పుడు మార్చుతున్నామని రాష్ట్రస్థాయి అధికారులు సమావేశాల్లో చెబుతున్నప్పటికీ కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయి. మూడు స్టేజీలలో దరఖాస్తులు వెంటవెంటనే పరిష్కారం కావాల్సి ఉండగా ఆలస్యం చేస్తున్నారు.

తిరస్కరణ దరఖాస్తుల పరిష్కారం అటకెక్కింది.

దస్త్రాలు ఒక్కోసారి వెబ్‌సైట్‌లో కనిపించకుండా పోతున్నాయి.

కరీంనగర్ గోదాంగడ్డ దోబీఘాట్ ప్రాంతానికి చెందిన అరుణ ఖాళీ స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి తేదీ. 19.3.2025న రూ. 27వేల రుసుం చెల్లించారు. ఆ తర్వాత ప్రొసీడింగ్ రావాల్సి ఉండగా రిజిస్ట్రేషన్ శాఖ ఎన్‌వోసీ జత చేయాలని ఆన్‌లైన్‌లో చూపించింది. దానిని కూడా పొందుపర్చిన తరువాత ఆ దరఖాస్తు ఎల్-1 అధికారి దగ్గరే పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తుంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారి లాగిన్‌లలో ఆ దరఖాస్తే కనిపించడం లేదు.

మల్కాపూర్‌కు చెందిన ఓ ప్లాట్ యజమాని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులో గ్రామం పేరు తప్పుగా నమోదు కావడంతో సవరణకు దరఖాస్తు చేశారు. ఎల్-2 లాగిన్ ద్వారా సవరించుకోగా నవీకరణ విజయవంతమైందని చూపించింది. కానీ ఊరి పేరు మారకుండానే ఎల్-3 లాగిన్‌లోకి వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ ఎల్-2 లాగిన్‌లోకి రాగా మరోసారి సవరించారు. తీరా ఎల్-3 లాగిన్‌లో ఎలాంటి మార్పు లేకుండానే అనుమతి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## వీడిన సందిగ్ధం.. ఇక పనుల్లో వేగం



గోదావరిఖని: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనులు వేగవంతం కానున్నాయి. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయినప్పటికి.. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం(పీపీఏ) కుదరకపోవడంతో పనులపై కొంత సందిగ్ధం నెలకొంది. తాజాగా విద్యుత్తు నియంత్రణ మండలి పీపీఏకు ఆమోదం తెలిపింది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశలో నిర్మించనున్న 800 మెగావాట్ల మూడు యూనిట్ల(2400 మెగావాట్ల) నుంచి ఉత్పత్తయిన విద్యుత్తును కొనుగోలు చేసుకోవచ్చని ఆమోదం తెలపడంతో నిర్మాణానికి సంబంధించిన పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంది.

**అయిదు నెలల క్రితమే ఆరంభం** ఈ ఏడాది జనవరి 28న ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. ఏప్రిల్‌లో పర్యావరణ అనుమతు లు లభించాయి. ప్రాజెక్టును 52 నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక చేసుకున్న ఎన్టీపీసీ.. విద్యుత్తు కొనుగోలు ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో పనులు నెమ్మదించాయి. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోవడానికి ఈఆర్‌సీ నుంచి ఆమోదం కోసం ఎదురుచూసింది. ఎట్టకేలకు ఒక యూనిట్‌కు రూ. 4.12 పైసల చొప్పున కొనుగోలు చేసుకోవడానికి ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. 25 ఏళ్లపాటు ఎన్టీపీసీ రెండో దశలో చేపట్టే 2400 మెగావాట్ల విద్యుత్తును కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలపడంతో నిర్దేశిత కాలంలో పనులు పూర్తి చేసేందుకు వేగం పెంచనుంది.

**11.5 మిలియన్ టన్నుల బొగ్గుకు ఒప్పందం**

ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏటా 11.5 మిలియన్ టన్నుల బొగ్గు కొనుగోలుకు సింగరేణి నుంచి ఒప్పందం చేసుకుంది. నీటిని ఎల్లంపల్లి నుంచి తీసుకోనుంది. బూడిద నిల్వ కోసం సైతం సింగరేణికి చెందిన మేడిపల్లి ఓసీపీ క్వారీని తీసుకోవడానికి సంప్రదింపులు జరుపుతోంది. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేస్తే 2030 నాటికి మొదటి యూనిట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఆ తర్వాత మిగతా రెండు యూనిట్లను ఏడాది గడువులోగా పూర్తి చేసే అవకాశముంది.

**2029-30 నాటికి అందుబాటులోకి**

2029-30 నాటికి ఈ ప్రాజెక్టు విద్యుత్తు కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. అప్పటి విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగానే ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మిస్తున్న మూడు యూనిట్లు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. మొదటి సంవత్సరంలో రూ. 4.12 పైసల చొప్పున కొనుగోలు చేసుకోవడానికి ఆమోదించిన ఈఆర్‌సీ.. అనంతరం పరిస్థితులకు అనుగుణంగా ప్రతి యూనిట్ రూ. 3.81 పైసల చొప్పున తీసుకోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

## నకిలీపై.. బిగించాలి 'పీడీ'కిలి

ఖమ్మం : మొక్కజొన్న కంకి పోసుకోలేదని మొన్నటిదాకా రైతులు గగ్గోలు పెట్టారు. అంతకు క్రితం వరి పైరు ఈనే దశలో నోరెళ్లబెట్టిందని అన్నదాత రోడ్డెక్కాడు. పత్తి, మిరప దిగుబడి దారుణంగా తగ్గిందని సాగుదారులు తలలు పట్టుకున్నారు. సీజన్ ఏదైనా నకిలీ, నాణ్యతలేని విత్తు ఆర్థికంగా దిగజారుస్తోంది. కొద్దిరోజు ల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. వాణిజ్య పంటలు, వరి సాగుకు రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా ప్రసిద్ధి. ఈసారి అత్యధికంగా పత్తి సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగకానుందని వ్యవసాయ శాఖ అంచనా. ఆ తర్వాత మొక్కజొన్న, వరిదే స్థానం. ఆయా విత్తనాలకు ప్రస్తుతం డిమాండ్ అంతకంతకూ పెరిగింది. రైతులు విత్తన సేకరణలో నిమగ్నం కానున్నారు. వీరిని బురిడీ కొట్టించి నకిలీ విత్తులను అంటగట్టేందుకు ముఠాలు కాచుక్కూర్చున్నాయి. వీరికి టాస్క్‌ఫోర్స్ ముకుతాడు వేస్తేనే కృషీవలుర కష్టాలు గట్టెక్కుతాయి. లేదంటే అందరికీ అన్నం పెట్టేవారు నిలువునా మోసపోవడం ఖాయం.

**అక్రమాల పరంపర** ఈ ఏడాది టేకులపల్లి మండలంలో రూ. 5,400 విలువైన, 9 కిలోల నకిలీ విత్తనాల్ని సీజ్‌చేశారు. మూడు ఘటనల్లో నలుగురిపై కేసులు నమోదయ్యాయి. ఉమ్మడిజిల్లాలో వేల ఎకరాల్లో విత్తన రకం మొక్కజొన్న విఫలమై పంట నష్టపోయారు. వరిదీ అదే తీరు. 2021లో చంద్రుగొండ, జూలురుపాడు, బూర్గంపాడు, పినపాక మండలాల్లో 7 కిలోల నకిలీ విత్తనాల్ని పట్టుకున్నారు. దళారులపై కేసులు పెట్టారు. అదే ఏడాది ఇల్లెందులో నకిలీ మొక్కజొన్న, టేకులపల్లి మండలం రాజారాంతండాలో నాణ్యతలేని పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.

**రైతులూ.. ఇవి పాటించండి**

కేంద్రం హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి విత్తనాల్ని 2017లో నిషేధించింది. వీటిని ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దు.

అధీకృత డీలర్లు (లైసెన్స్‌డ్) డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్యాకింగ్‌ను సరిచూసుకోవాలి. ఏది కొన్నా రశీదు తప్పనిసరి, దాన్ని, ఖాళీ సంచుల్ని పంట దిగుబడి చేతికందే వరకు భద్రపరచుకోవాలి. నిషేధిత, గడువు ముగిసిన రకాల్ని పసిగట్టాలి. ధర తక్కువని, లూజుగా విక్రయించే పత్తి, మిరప విత్తనాల్ని కొని మోసపోవద్దు.

అంగట్లో కూరగాయల్లా ఎక్కడ విత్తనాలు విక్రయానికి పెట్టినా విజిలెన్స్‌కు ఉప్పందించాలి.

రశీదులో రైతు పేరు, విత్తన కంపెనీ పేరు, చిరునామా, లాట్ నంబరు, సంచులు/ప్యాకెట్ల సంఖ్యను డీలర్లు తప్పక పొందుపర్చాలి.

డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా నిల్వల రిజిస్టర్లను వ్యవసాయ శాఖ తనిఖీ చేయాలి.

లైసెన్స్‌లేని వారు జరిపే విక్రయాలపై చర్యలు తీసుకోవాలి.

వరి విత్తనోత్పత్తిపై రైతు ఉత్పత్తి సహకార కేంద్రాల ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన పెంపొందించాలి.

విత్తన రకాలు సాగుచేస్తున్నట్లయితే, కంపెనీ ప్రతినిధులతో రైతులు బాండ్ పేపర్(ఒప్పందపత్రం)ను రాసుకోవాలి.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే బ్రాండెడ్ విత్తనాల్ని కొనడం మేలు. రశీదుపై వారితో పాటు రైతూ సంతకం చేయాలి. వాటిని, ఖాళీ సంచులు, లేదా ప్యాకెట్లను పంట చేతికొచ్చే వరకు భద్రపరుకుంటే నష్ట నివారణ రాబట్టుకోగలం. విత్తనాలు మొలకెత్తకపోయినా, దిగుబడి రాకపోయినా విత్తన కంపెనీలు పరిహారమిస్తాయి. జిల్లాస్థాయిలో 2, మండలాల వారీగా ఏవోలు, పోలీసు అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడతాయి. వి.బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం2024-2025 పంట ఉత్పత్తి సంవత్సరంలో..

విత్తన శాంపిళ్లు ఖమ్మం : 406 భద్రాద్రి : 324 నమోదైన కేసులు ఖమ్మం : 20 భద్రాద్రి : 09

## ఇల్లే.. ఓ జల నిధి

కొత్తగూడెం : ఇంటి ఆవరణలో పొంగిపొర్లే వర్షపు నీరు ఓవైపు.. చుక్క విదిల్చని కుళాయిలు ఇంకోవైపు. పట్టణాలు, నగరాల్లో ప్రతిఇంట్లో సాధారణంగా కనిపించే భిన్న పార్శ్వాలివి. ఒక్క సీజన్‌లో వర్షపు నీటిని ఒడిసిపడితే, ఏడాదంతా దాహార్తి కష్టాలు దరిచేరవు. పెద్దగా ఖర్చవని ఇంకుడు గుంతల నిర్మాణమే ఎద్దడికి సరైన పరిష్కారం. జలవనరుల శాఖ అధికారులు, పర్యావరణ వేత్తలూ ఇదే సూచిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలోనైనా మేల్కోవాలి.

**తక్కువ ఖర్చు.. ఎంతో లాభం**

వేసవిలో వంద ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో నెలకు సుమారు 50 వేలు ట్యాంకర్లకే ఖర్చు చేస్తున్నారని అంచనా. తాగునీటి క్యాన్ల ఖర్చు అదనం. ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఇంకుడుగుంత నిర్మించొచ్చు. వంద చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఇంటికి 6 క్యూబిక్ మీటర్ల విస్తీర్ణంలో గుంతను వాలుగా ఉన్న వైపున నిర్మిస్తే సరిపోతుంది.

**నిర్మాణం ఇలా..**

ఇంకుడు గుంతల్ని బోర్ల సమీపంలో ఏర్పాటు చేసుకోవడం మేలు. స్థలం పరిమాణాన్ని బట్టి అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతున గుంత తవ్వాలి. అడుగు నుంచి సగభాగం వరకు 40 మిల్లీమీటర్లు, తర్వాత పావు భాగం 20 మిల్లీమీటర్ల పరిమాణం గల కంకర నింపాలి. కొంతభాగం ఖాళీగా ఉండేలా చూసుకుని మిగతా దొడ్డు ఇసుకను నింపాలి. ఇంటి పైకప్పు, ఆవరణలోని వర్షపు నీటి ప్రవాహమంతా పైపులు, కాలువల్లో గుంతలోకి చేరేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

**ఇదీ.. చినుకు విలువ**

ఒక ఇంటి పైకప్పు వైశాల్యం, కురిసిన వర్షపాతంపై ఇంకింపజేసే వర్షపు నీటి సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక సంవత్సర సగటు వర్షపాతం 800 మి.మీ. నమోదై, 100 చదరపు మీటర్ల వైశాల్యం గల ఇంటి పైకప్పు ఉన్నట్లయితే.. 68 వేల లీటర్ల నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని నగర, పురపాలికల్లో నివాసాల సంఖ్య.. 2,02,941. ఒక నివాసం సగటు పైకప్పు వైశాల్యం 180 చ.మీ. అనుకుంటే, ఏడాది సగటు వర్షపాతం 900 మి.మీ. కురుస్తుందని అంచనా వేస్తే.. సుమారు 30 వేల మిలియన్ లీటర్ల నీటిని భూగర్భంలోకి ఇంకింపజేయొచ్చు. ప్రస్తుతం అంచనా ప్రకారం ఖమ్మం నగరం, ఇతర పురపాలకాల ఏడాది తాగునీటి వినియోగం 29 వేల మిలియన్ లీటర్లుగా ఉంది. అంటే, నివాసాల్లోని పైకప్పు మీద కురిసే వర్షపునీరు, ఏడాదంతా పుర, నగరవాసులు వినియోగించే తాగునీటి కంటే ఎక్కువన్నమాట. "పట్టణాలు కాంక్రీటు కీకారణ్యాలుగా మారుతున్న నేపథ్యంలో భూగర్భజలాలు ఇంకడం లేదు. దీంతో వేసవి రాగానే ఎద్దడి తలెత్తుతోంది. ప్రత్యామ్నాయం ఇంకుడు గుంతలే. ప్రతిఇంటా నిర్మించుకుంటే, నీటి కొరత రాకుండా చూసుకోవచ్చు. గ్రామాల్లోని నివాసాలు, రహదారుల పక్కన విస్తృతంగా నిర్మాణాలు చేపడుతున్నాం. పట్టణాల్లోనూ చైతన్యం పెరగాలి'.

రమేశ్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, ఉమ్మడి ఖమ్మం

# పశు సంపదకు యాంత్రీకరణ దెబ్బ

వికారాబాద్: వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో పశు పోషణపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఏటా పెరుగుతున్న యాంత్రీకరణతో పశుసంపద ప్రశ్నార్థకంగా మారుతోంది. రెండు దశాబ్దాల కిందట ఎకరం పొలమున్న రైతుల దగ్గర సైతం రెండు కాడెడ్లు ఉండేవి. కాలానుగుణ పరిస్థితులతో పశుపోషణ భారంగా మారి నాలుగేళ్లలో జిల్లాలో 57,148 పశు సంపద తగ్గడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే..**

యాంత్రీకరణతో పశుసంపదకు భారీ నష్టం వాటిల్లుతోంది. వ్యవసాయ పనులు చేసే ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు, పంట నూర్పిడి యంత్రాలొచ్చాయి. దీంతో పశుపోషణపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోయింది. రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే పశుసంపద సగానికిపైగా తగ్గింది. పాడికి బదులుగా గ్రామాల్లోకి పాల ప్యాకెట్లు వచ్చాయి. రసాయన ఎరువుల



వాడకంతో పంటలు పండిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులిచ్చే పశువులు తగ్గిపోతున్నాయి.

**అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?**

ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినా అక్రమ రవాణా ఆగడం లేదు. వ్యవసాయానికి పనికి రాని, వయసు పైబడిన పశువులను మాత్రమే పశువైద్యుడి ధ్రువీకరణ మేరకు కబేళాలకు తరలించాలి. దూడలు మొదలుకొని ఇతర పశువులను కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

గ్రామ పంచాయతీలు: 566
పశువైద్య కేంద్రాలు: 96
తాలూకా స్థాయిలో: 05
మండల స్థాయిలో: 33
గ్రామీణ స్థాయిలో: 58

# జేఎన్‌టీయూ జంక్షన్.. దాటాలంటే టెన్షన్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతాల్లో జేఎన్‌టీయూ జంక్షన్ ఒకటి. రైల్వేట్రాక్‌పై వంతెన నిర్మించడంతో రద్దీ మరింత పెరిగింది. కానీ, వాహనాలు, జనాభాకు తగ్గట్టు జంక్షన్ అభివృద్ధి ఆ స్థాయిలో జరగలేదు. దీంతో రోడ్డు దాటేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఒకసారి సిగ్నల్ పడితే సుమారు 200 మంది పాదచారులు జాతీయ రహదారి దాటుతున్నారు. ఇందుకు 60 సెకన్లు మాత్రమే ఉండడంతో పరుగులు తీయాల్సి ఉంటుంది. సిగ్నళ్లు మొరాయించి, ట్రాఫిక్ సిబ్బంది లేకుంటే వాహనాలు జీబ్రా గీతలపైకి రావడంతో పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. సిబ్బంది



రాత్రి ఒంటి గంట వరకు విధుల్లో ఉంటారు. అప్పటి నుంచి ఉదయం పోలీసులు విధుల్లోకి వచ్చేంత వరకు నియంత్రించే వారుండరు. ఆ సమయంలో జరిగే ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు.

**చక్రబంధంలో పాదచారి:** జాతీయ రహదారి దాటే పాదచారులే కాకుండా చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న మార్గాల్లో పాదచారుడి పరిస్థితి చక్రబంధంలో ఇరుక్కున్నట్టే మారుతోంది. జాతీయ రహదారిలో సిగ్నల్స్ ఉండగా.. మిగతా మార్గాల్లో ఆ నియంత్రణ లేక వాహనాలు ఢీకొట్టే అవకాశముంది. పాదచారుల వంతెన నిర్మించేందుకు అంత స్థలం లేదు. మెట్రో రైలు ట్రాక్ కింద ఎత్తు సరిపోదు. అండర్ పాస్ నిర్మాణానికి వీల్లేదు. చౌరస్తాలో ప్రస్తుతం మలుపు విస్తరణ అభివృద్ధిలో ఉంది. ముమ్ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ తరహాలో స్కై వాక్ అభివృద్ధి చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. స్కై వాక్‌తో ట్రాఫిక్ జామ్ లేకుండా ఇబ్బందులు తీరుతాయని పాదచారులు సూచిస్తున్నారు.

2019-2025 మధ్య ప్రమాదాల్లో..
మృతులు : ఐదుగురు
గాయాలపాలైన వారు : 15మంది

## మిస్ వరల్డ్ సంబరాలు.. మెట్రో సొబగులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అతిథ్యం ఇస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నేను సైతం అంటూ భాగస్వామ్యమైంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మెట్రోరైలు సంస్థ అందాలపోటీలపై విస్తృత ప్రచారం చేపట్టింది. తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటూ ప్రపంచ సుందరీమణులను తెలంగాణకు పరిచయం చేసేలా ప్రచారం చేపట్టింది. హైటెక్‌సిటీ నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు ఉన్న మెట్రో స్టేషన్లు, స్తంభాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న మెట్రో రైలింగ్‌లకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మెట్రోరైలు స్క్రీన్లపైన, స్టేషన్ ఫ్లాట్‌ఫామ్ ప్రకటనల బోర్డులపై మిస్ వరల్డ్ వేడుకలను ప్రతిబింబించేలా ప్రచారం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మెట్రోరైలులో ప్రచారం ద్వారా తెలంగాణ వారసత్వ సంపదను నలుగురికీ తెలియజేసే బృహత్ కార్యక్రమంలో భాగస్వామ్యమైందని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆధ్యాత్మిక సంరంభం, అమ్రాబాద్ పులుల అభయారణ్యం, రామప్ప దేవాలయం, బోనాలు, బతుకమ్మ, చారిత్రక కట్టడం చార్మినార్‌తో సహా పలు విశేషాలతో కూడిన ఆకర్షణీయ చిత్రాలతో మెట్రోరైలు మరింత విస్తృత ప్రచారం కల్పించిందని చెప్పారు. **అందమా.. చందమా**ప్రపంచ సుందరి తుది పోటీలకు సమయం దగ్గరపడుతోంది. అందాలభామలు రకరకాల పోటీలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. వారు బస చేసిన మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో సందడి చేస్తున్నారు.

# పర్యవేక్షణ కొరవడి.. అవినీతికి అడుగులు పడి



హైదరాబాద్: కోటిన్నర మంది ప్రజలకు సేవలందించే హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ)లో పరిపాలన గందరగోళంగా మారింది. పలువురు ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. సొంత కార్యక్రమాలు, అడ్డదారిలో సంపాదించిపెట్టే పనులకే కొందరు ఉన్నతాధికారులు ప్రాధాన్యమిస్తుండగా.. కింది స్థాయిలో పనిచేసే ఉద్యోగులు వసూళ్ల కోసం అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారు. గడిచిన రెండేళ్లలో నలుగురు కమిషనర్లు మారడంతో విభాగాల వారీగా పర్యవేక్షణ లోపించిందనే విమర్శలొస్తున్నాయి.

**పారిశుద్ధ్య విభాగంలో దందా..**

నగరంలో పొరుగు సేవల కింద 18,557 మంది, శాశ్వత ప్రాతిపదికన 2,365 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. శాశ్వత కార్మికులు 10శాతం కూడా విధుల్లో కనిపించరు. ప్రైవేటు వారికి ముఖహాజరు ఉండటంతో హాజరైన పని దినాలకే జీతం చెల్లిస్తారు. కార్మికులను పర్యవేక్షించే శానిటరీ జవాన్లదీ అదే దారి. చాలామంది ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో నకిలీ చలాన్లు విధించడం, ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు చెల్లించాలంటూ జనాల నుంచి లంచాలు తీసుకోవడం, ఇతర దందాల్లో మునిగి తేలుతున్నారు.

**రవాణా విభాగంలో దోపిడీ**

వాహనాల నిర్వహణ బాధ్యతలు చూసుకునే రవాణా విభాగంలో 1,600ల మంది ప్రైవేటు కార్మికులుండగా, వారిని ముఖ హాజరు విధానంలో చేర్చే పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. లేని వాహనాలకు మరమ్మతులు చేయడం, వాస్తవ ధరకు రెండింతలు చెల్లించినట్టు పరికరాలను కొనుగోలు చేయడం, టైర్లను సొంత వాహనాలకు వాడుకోవడం, డీజిల్ కూపన్ల పేరుతో ఏటా రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

**ప్రణాళికాబద్ధంగా..**

నగర ప్రణాళిక విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలను సంపాదన వనరుగా మార్చుకున్నారు. అనుమతి లేని నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. 60, 80 గజాల్లో ప్రమాదకరంగా ఆరు, ఏడు అంతస్తులు నిర్మిస్తుంటే అంతస్తుకు రూ.లక్ష, రూ.2లక్షలు వసూలు చేసుకుంటున్నారు. ఆ విభాగంలోని సగానికిపైగా అధికారులు పనివేళలు పాటించరు. ఇదేంటని అడిగితే క్షేత్రస్థాయి తనిఖీలంటారు.

**కమిషనర్ ఆదేశాలు బేఖాతరు..**

2023 నుంచి 2025 వరకు రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ఇలంబర్తి జీహెచ్ఎంసీకి కమిషనర్లుగా పని చేశారు. అందరూ తక్కువ కాలంలోనే బదిలీ అయ్యారు. చివరి కమిషనర్ ఇలంబర్తి.. అధికారులు సమయపాలన తప్పక పాటించాల్సిందేనని, విభాగాధిపతులు ఆ విషయాన్ని రోజూ పర్యవేక్షించాలని, హెచ్ఓడీలు సైతం సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య కార్యాలయంలో సందర్శకులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నెల క్రితం ఆయన బదిలీ అవడంతోనే ఆ విషయాన్ని అధికారులు పక్కకుపెట్టారు.

**పరిపాలనలోనూ..**జీహెచ్ఎంసీలో కొత్తగా నియామకమైన 200ల మంది జూనియర్ అసిస్టెంట్లలో 100 మందిని రెవెన్యూ విభాగానికి కేటాయించాలని అప్పటి అదనపు కమిషనర్ పరిపాలన విభాగాన్ని కోరారు. వందలాది మంది పదవీ విరమణ ప్రయోజనాలు, బదిలీ అభ్యర్థనలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు, తదితర అంశాలను పరిపాలన విభాగం అటకెక్కించింది.

# 'రసాయనం'.. నేల నిస్సారం



వికారాబాద్ : సాగు నేలలు రోజురోజుకూ నిస్సారమవుతున్నాయి. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. భవిష్యత్తు తరాలు వ్యవసాయం చేయలేని విధంగా మారుతోంది. అవగాహన కల్పించేవారు లేక పంట దిగుబడి కోసం అన్నదాతలు ఇష్టానుసారంగా రసాయనాలు వాడుతున్నారు.

**జిల్లాలో 80 శాతం వ్యవసాయమే ఆధారం..**

జిల్లాలో 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5.95 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నాయి. అందులో పత్తి, కంది పంటలే 3 లక్షల ఎకరాల్లో పండించనున్నారు. ఎకరాకు 150 కిలోల డీఏపీ, వంద కిలోల యూరియాతోపాటు 95వేల మె.ట. రసాయన ఎరువులు అవసరం. వీటితో పంటలకు చీడపీడల బెడద అధికమవుతోంది. పంటలు పూత దశకు వచ్చాక పత్తికి 5-6, కందికి 3 సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది.

**పొంచి ఉన్న ప్రమాదం..**

బస్తాలో 46 శాతం మాత్రమే యూరియా ఉంటుంది. మిగతా 54 శాతం సున్నపు గుళికల్లాంటి మూలపదార్థం ఉంటుంది. దీనిపై యూరియా పూత(కోటింగ్) పూస్తారు. దాన్ని నేలపై చల్లడంతో 54 శాతమున్న మూల పదార్థం ఏటా నేలపై పేరుకుపోయి భూసారం తగ్గుతోంది. నేలలోని సహజమైన బ్యాక్టీరియాలు, వానపాములు నశించిపోతాయి. ఈ ఎరువులతో నేల గట్టిగా మారి కర్ర నాగలితో దున్నలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో భూములు పనికిరాకుండా పోతాయి.

**సరైన ప్రచారం లేక..**

సేంద్రియ ఎరువులపై సరైన ప్రచారం లేకపోవడంతో రైతులు వాటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా అవగాహన లేక రైతులు రసాయన ఎరువులనే విచ్చలవిడిగా వాడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. వ్యవసాయ భూముల్లో రోజురోజుకూ ఆమ్ల, క్షార లక్షణాలు పెరిగి భూసారం తగ్గి, సరైన దిగుబడులు రావడం లేదు. అంతేకాకుండా ఆరోగ్యం, పర్యావరణంపై రసాయన ఎరువులు ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్య నుంచి రైతులు బయట పడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గం. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో వ్యవసాయాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి.

**సేంద్రియ ఎరువులు వాడాలి..**

సాగు భూముల్లోని సారాన్ని కోల్పోకుండా ఉండేందుకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి. దీంతో భూమిలో పోషక విలువలు పెరిగి గుల్లగా మారుతుంది. నీటిని పీల్చుకొనే తత్వం వృద్ధి చెందుతుంది. దీంతో మొక్కలకు నీటితోపాటు పోషకాలు సమృద్ధిగా అందుతాయి. మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

# కరుణించి.. కష్టాలను దాటించండి



కరీంనగర్ : ఇది శంకరపట్నం మండలం అర్కండ్ల సమీపంలోని లోతట్టు వంతెన. ఏటా చిన్న వర్షం పడినా వాగులోని నీరు పైనుంచి పారుతుంది. దీంతో కన్నాపూర్ నుంచి అటు వీణవంక మండలానికి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువుంటే కిలోమీటర్ల మేర దూరంగా ఉన్న మరో దారిలో గమ్యస్థానానికి చేరాల్సిందే! శంకరపట్నం నుంచి వీణవంక మండలంలోని పలు గ్రామాలకు అనుబంధంగా ఉన్న ఈ రోడ్డును విస్తరించినా.. ఈ చిన్న వంతెన స్థానంలో కొత్తది నిర్మించలేదు. ఇదే తరహాలో ఈ ఒక్క మండలంలోనే గద్దపాక-కాసాపూర్, చర్లపల్లి-కేశవపట్నం, గద్దపాక-అంబేడ్కర్‌నగర్‌లతోపాటు మరో ఆరు ఊళ్ల మధ్య ఇలాంటి సమస్యనే ఉంది. జిల్లావ్యాప్తంగా 83 చోట్ల ఇలాంటి లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రెండేళ్ల కిందట గుర్తించిన సమస్యల్లో.. దాదాపుగా 70 శాతానికిపైగా వంతెనల మన్నిక బాగాలేదని, పూర్తిగా పైపులు శిథిలమయ్యాయనే నివేదికను ఉన్నతాధికారులకందించారు. రోడ్లు దెబ్బతిన్నప్పుడు కేవలం వాటి బాగు కోసమే తాత్కాలికంగా నిధులు మంజూరవుతుండటం, వీటిపై శ్రద్ధ పెట్టకపోవడంతో సమస్య పెరుగుతోంది. **8 కి.మీ.లు తిరిగి రావాల్సిందే**మానకొండూరు మండలం అన్నారం సమీపంలో వంతెన నిర్మించకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వరదనీరు చేరడంతో మానకొండూరు-జమ్మికుంట ప్రధాన రహదారికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దేవంపల్లి, పచ్చునూర్, కెల్లేడు, మద్దికుంట గ్రామాల వాసులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే 8 కి.మీ తిరిగి రావాల్సిందే.

**ఆరు గ్రామాల ప్రజల అవస్థలు**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి సమీపంలోని లోతట్టు వంతెన వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. సమీపంలోని నాగిరెడ్డిపూర్ దారిలోనూ ఇదే పరిస్థితి తలెత్తడంతో ఆ మార్గంలో కొన్నాళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక కురిక్యాల-కొండన్నపల్లి మార్గంలోనూ వరద ప్రవాహం పెరిగిందంటే మండల కేంద్రానికి రావడమనేది ప్రజలకు సాహసమే! ఈ మండలంలో దాదాపుగా 6 గ్రామాల మధ్య ఇలాంటి విపత్కర పరిస్థితి ఉండటంతో రాకపోకలు నిలుస్తున్నాయి.

**ఒక్కోదానికి రూ.కోటికిపైనే..**

చిన్న వంతెనల స్థానంలో కొత్త పిల్లర్లు వేసి నిర్మించాలంటే ఒక్కోదానికి రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు దూరాన్ని బట్టి నిధులు అవసరమవుతాయి. వీటిని బాగు చేయాలని కొన్నేళ్లుగా అందిన వినతులకు మోక్షం లభించడంలేదు. గతేడాది జిల్లా వ్యాప్తంగా సైదాపూర్ సమీపంలోని ఒక్క వంతెన నిర్మాణానికి మాత్రమే నిధులొచ్చాయి. ఇటీవల టెండర్ ప్రక్రియ ముగిసింది. ఇప్పటికైనా ఆయా మండలాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటి విషయంలో యంత్రాంగం చొరవ చూపించాలి.

# చిన్నారులను ఆకర్షించేలా అంగన్‌వాడీలు

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ప్రవేశాలు పెంచడానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వయసుల వారీగా సర్వే చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రైవేట్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేరిన వారిని గుర్తించింది. మూడేళ్లలోపు పిల్లలు ప్రైవేట్ వైపు మళ్లకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. పౌష్టికాహారంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థంగా అందిస్తామని ప్రచారం చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి, పిల్లలున్న ఇళ్లకు వెళ్లి వారిని కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు చేపట్టారు.

**ప్రత్యేక ప్రయత్నాలు** జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో పిల్లలు చేరేలా వారిని ఆకర్షించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అద్దె భవనాల్లో ఉన్న వాటిని అవకాశమున్న ప్రాథమిక పాఠశాల భవనాల్లోకి మార్చుతు న్నారు. చిన్నారులకు ఏకరూప



దుస్తులు, గోడలపై ఆకర్షణీయంగా, నేర్చుకునే విధంగా అంకెలు, పండ్ల పేర్లతో పెయింటింగ్స్, వయసుల వారీగా ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలతో బోధనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జిల్లాలో వివరాలు..**

మూడేళ్లు దాటిన చిన్నారులు : 8,834
అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన వారు : 6,138
నాలుగేళ్లు దాటిన వారు 5,672
అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేవారు : 2,620

**పిల్లల సంఖ్య పెరిగేలా కృషి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరగడానికి కృషి చేస్తున్నాం. జిల్లా పాలనాధికారి ఆదేశాలను అనుసరించి ప్రత్యేక సర్వే చేపట్టాం. కేంద్రాల్లో చేరని పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నం చేస్తాం.ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

# నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర

తాండూరు: తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌తో సంబంధం లేకుండా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. ఇటీవల ఓ అధికారి అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. త్వరలో విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

**ఉత్తర్వులను విస్మరించి..:** రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఫిబ్రవరిలో ఇచ్చిన ఉత్తర్వులను విస్మరించి తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఉత్తర్వుల ప్రకారం సంబంధిత సర్వే నెంబరులో 2020 ఆగస్టు 26 నాటికి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా 10 శాతం ప్లాట్లు అమ్ముడుపోవాలి. మిగిలిన 90 శాతం ప్లాట్లను నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలను



పక్కనబెట్టి ఏకంగా 220కుపైగా ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు వెలుగులోకొచ్చింది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దస్తావేజు లేఖరులు, కార్యాలయ సిబ్బంది కలిసే వ్యవహారం నడిపించారనే ఆరోపణలున్నాయి. నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది.

**ఇద్దరు అధికారులు సెలవులో ఉన్నప్పుడు..**

తాండూరు సబ్‌రిజిస్ట్రార్ సాయికుమార్ ఏప్రిల్ 22 నుంచి ఈనెల 17 వరకు సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి పవన్‌కుమార్ ఇన్‌ఛార్జిగా వచ్చారు. ఆయన ఈనెల 12 నుంచి 23 వరకు సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ సహాయకుడు ఫసియుద్దీన్ విధుల్లో చేరారు. ఆయన ఈనెల 12- 17 వరకు నిర్వహించిన 220కిపైగా రిజిస్ట్రేషన్లలో చాలావరకు అక్రమమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇటీవల ఆయన్ను సస్పెండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని ఓ అధికారి తెలిపారు.

## మాతా శిశు సంరక్షణ కార్డుల కొరత

ఆదిలాబాద్ : జిల్లాలో ఏడాదిగా మాతా శిశు సంరక్షణ కార్డు(ఎంసీపీ - మదర్-చైల్డ్ ప్రొటెక్షన్) కార్డుల కొరత వేధిస్తోంది. మాతా, శిశు మరణాలను సమర్థంగా నివారించడంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్డులను ప్రవేశపెట్టింది. ఆ కార్డుల్లో గర్భిణుల పూర్తి వివరాలు, వారి ఆరోగ్య సమస్యలు, ఇదివరకు ప్రసవమైతే ఆ వివరాలు, గర్భస్థ శిశు వివరాలు, బరువు, ప్రస్తుతం అందించిన వైద్యం, ముమ్ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు/చికిత్సలు తదితర వివరాలను నమోదు చేస్తేనే మాతా శిశు మరణాలను అరికట్టడం సాధ్యమవుతుంది. ఒక మహిళ మొదటి నెల గర్భిణి అయిన నుంచి తొమ్మిదో నెల వరకు.. ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించిన వైద్యం తదితర వివరాలన్నీ అందులో నమోదు చేస్తారు. జిల్లాలో ఈ కార్డులకు కొరత ఏర్పడటంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్డులు అందుబాటులో లేక పలు చోట్ల పాత కార్డులను జిరాక్స్ తీయించి అందులోనే రాస్తున్నారు. జిరాక్స్ కాగితాలు నాణ్యంగా ఉండకపోవటం వల్ల దీర్ఘకాలం మన్నే అవకాశాలు తక్కువ. ఒక్కో కార్డు జిరాక్స్ తీసుకోవాలంటే రూ.50 నుంచి వంద వరకు వ్యయం చేయాల్సి వస్తోంది.జిల్లాలో 9,213 మంది గర్భిణులు

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,239 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. వీరెవరికి మాతా శిశు సంరక్షణ కార్డులు అందుబాటులో లేవు. జిల్లాలో ప్రస్తుతం మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణులు మొత్తం 9,213 మంది ఉన్నారు.

ఈ నెలలో సరఫరా అవుతాయి : సాధన, మాతా శిశు సంరక్షణాధికారిణి చాలా రోజుల నంచి ఎంసీపీ కార్డుల కొరత కొనసాగుతోంది. ప్రస్తుతం జిరాక్స్ తీసిన కాపీలపైనే వివరాలను నమోదు చేస్తున్నాం. జిల్లాకు నెలకు కనీసం ఒక వేయి కార్డులు అవసరం అవుతాయి.

# నడ్డివిరుస్తున్నాయ్..!

కోరుట్ల: జిల్లాలో జగిత్యాల తర్వాత రెండో అతిపెద్ద పట్టణం కోరుట్ల. పట్టణంలో దారులన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. మొత్తం 33 వార్డులుండగా సుమారు 86 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. రోజురోజుకు పట్టణం విస్తరించినంతగా అభివృద్ధి కనిపించడం లేదు. నాలుగేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సుమారు 190 కి.మీల పైగా సీసీరోడ్లు, మట్టిరోడ్లను తవ్వి ఇంటింటికీ కుళాయిలను బిగించారు. భగీరథ పైపులైన్ నిర్మాణంతో సిమెంట్ రోడ్లను తవ్వారు. నాసిరకంగా మరమ్మతు చేసి వదిలేశారు. దీంతో పట్టణంలో ఏవార్డుకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపించే వారి నడ్డి విరిచేలా సిమెంట్‌రోడ్లు మారాయి.అయిదేళ్లుగా దెబ్బతిన్న సీసీరోడ్లపై నూతన రోడ్ల నిర్మాణాలు చేట్టాలని పట్టణ ప్రజలు బలియా అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. టీయూఎఫ్ఐడీసీ కింద పట్టణంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు రెండేళ్ల కిందట రూ.15 కోట్ల నిధులు మంజూరుకాగా నవంబరు 2024లో అప్పటి ఎమ్మెల్యే భూమి పూజ సైతం చేశారు. అనంతరం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పాత టీయూఎఫ్ఐడీసీ నిధులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం కొత్తగా ఎన్నికైన కోరుట్ల శాసనసభ్యులు




డా.సంజయ్ ప్రతి అసెంబ్లీ సమావేశాల్లోనూ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు టీయూఎఫ్ఐడీసీ కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులు విడుదల చేయాలంటూ వాపోయినా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పట్టణంలో 200 కి.మీ వరకు మురుగు కాలువలున్నాయి. చాలావరకు కాలువలు దెబ్బతిని గోడలు కూలిపోతున్నాయి. కాలువల పైకప్పులు దెబ్బతిని బుంగలు పడుతున్నా నిధులు లేవంటూ నూతన నిర్మాణాలు చేపట్టకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రాత్రిపూట దెబ్బతిన్న రోడ్లు, మురుగు కాలువతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి బోల్తాపడి గాయాలపావుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక సంఘ ఏఈ అరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండేళ్ల కిందట రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని, తర్వాత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే పట్టణంలో నూతనంగా సిమెంట్‌రోడ్ల, మురుగు కాలువల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు.

## కొత్త కార్డుల్లో పేర్లు తారుమారు

సిరిసిల్ల : కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో ఎన్నో ఏళ్లుగా మార్పులు చేర్పులకు ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఊరట లభించింది. గతేడాది కులగణన సర్వే ఆధారంగా కొన్ని కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా... మరోసారి దరఖాస్తులను ఆహ్వానించారు. ఆయా అంశాల ఆధారంగా సిబ్బంది సర్వే చేపడుతున్నారు. పొరపాట్లను సవరిస్తూ నిజమైన లబ్ధిదారుల ఎంపికకు క్షేత్రస్థాయిలో కొంత జాప్యం జరుగుతోంది. జిల్లాలోని పన్నెండు మండలాలతోపాటు వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీల పరిధిలో 345 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 1.74 లక్షల రేషన్‌కార్డులు ఉండగా అందులో 5.33 లక్షల మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. అంత్యోదయ అన్నయోజన 13 వేలు, అన్నపూర్ణ కార్డులు 203 ఉన్నాయి. ప్రతినెలా 3.3 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారుల కోటాగా పంపిణీ చేస్తున్నారు. కొత్త కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ప్రజాపాలన, గ్రామసభల ద్వారా సుమారు 30 వేల దరఖాస్తులు సమర్పించారు. ఈ దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది.

**పంచాయతీ కార్యదర్శుల విముఖత**

నూతన రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త నిబంధనలు అమలు చేస్తుంది. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో దరఖాస్తుదారుల కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆదాయ వివరాలను ఆధార్‌తో పరిశీలించనున్నారు. సర్వే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని




జిల్లా అధికారులు భావించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, వివిధ రకాల పన్నుల వసూలు, భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఈజీఎస్ పనులు, గ్రామపంచాయతీల నిర్వహణ, ఇతర పనులతో తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని కార్యదర్శులు వాపోయారు. పని ఒత్తిడితో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని, రేషన్‌కార్డుల సర్వే ఇతర శాఖకు అప్పగించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనపై సందిగ్ధత నెలకొంది.

**ఇంటిపేరుతో ప‘రేషన్’...**

జిల్లాలో కులగణన తర్వాత తొమ్మిది వేల మందికి కొత్తగా కార్డులు మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. నూతనంగా పెళ్లైన వివాహిత ఇంటి పేరు మార్పు చేయలేదు. దీంతో బియ్యం తీసుకోవడం ఇబ్బందిగా మారింది.

**సమస్య వివరించాం-ప్రవీణ్, వీర్నపల్లి**

మాకు వివాహం జరిగి అయిదేళ్లు పూర్తికావస్తోంది. గ్రామసభలో మాకు రేషన్‌కార్డు వచ్చిందని అధికారులు చెప్పారు. తీరా సమయానికి మా పేర్లు మా అత్తగారి రేషన్ కార్డులో చూపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యను వివరించాను. మా కుమారుడి పేరు నమోదు కాలేదు. దీనిపై ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు. పరిశీలన జరుగుతోందివసంతలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి నూతన రేషన్‌కార్డుల మంజూరుకు పరిశీలన జరుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందేలా చూస్తాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని వివరాలు పరిశీలించిన తరువాతే కార్డు మంజూరవుతోంది. లబ్ధిదారుల వివరాలు కొన్నిచోట్ల తారుమారయ్యాయని మా దృష్టికి వచ్చింది. సాంకేతిక ఇబ్బందులతో అలా జరిగి ఉండచ్చు. పరిశీలించి పరిష్కరిస్తాం.

# సూచనలు బేఖాతర్.. చోరీతో బేజార్



హైదరాబాద్: కాచిగూడలో వ్యాపారి ఇంట్లో నేపాలీలు పనికి చేరారు. దంపతులకు మత్తుమందు ఇచ్చి రూ.3 కోట్ల సొత్తుతో పారిపోయారు. నెలక్రితం పనికి చేరిన వారి ఫోన్ నంబర్లు, గుర్తింపుకార్డులను యజమాని తీసుకోలేదు. పనివాళ్ల ఎంపికలో జాగ్రత్తలు పాటించట్లేదని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోనూ చోరీ జరిగినప్పుడు పోలీసులు అప్రమత్తమయ్యారు. నేపాల్ పౌరులు, సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. నమ్మకానికి మారుపేరుగా కాపలాకాసే నేపాలీయులు దాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. ఆ ప్రభావం కొంతకాలం ఉన్నా మళ్లీ పాత పద్ధతికే వచ్చారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 25 కేసులు నమోదయ్యాయి.

**ఏం చెప్పినా చేస్తారనే**

2019లో హిమాయత్‌నగర్‌లోని వ్యాపారి వద్ద ఒకరి తర్వాత ఒకరు 10 మంది నేపాలీలు పనికి చేరారు. యజమాని కుటుంబం తీర్థయాత్రలకు వెళ్లగానే 60 తులాల బంగారం, రూ.4-5 లక్షల నగదు చోరీ చేసి పరారయ్యారు. ఈ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసినా సొత్తు స్వాధీనం చేసుకోలేకపోయారు. 2023లో సికింద్రాబాద్ సింధ్ కాలనీలో రూ.5 కోట్ల సొత్తును కొట్టేసి పారిపోయారు. పోలీసులు ముంబయిలో కొందరిని అరెస్ట్ చేశారు. ఇద్దరు తప్పించుకొని నేపాల్ పారిపోయారు. ముఠాలో ఒకరిద్దరు మహిళలు ఉంటారు. ఏం చెప్పినా చేస్తారని, తక్కువ వేతనం ఇస్తే 24 గంటలు అందుబాటులో ఉంటారని పనిలో కుదుర్చుకుంటున్నారని ఓ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

**అదను చూసి..**

చోరీ చేసేందుకు వచ్చినవారు యజమానుల కదలికలను గమనిస్తుంటారు. ఏ పని చెప్పినా సకాలంలో చేసి నమ్మకాన్ని చూరగొంటారు. విలువైన వస్తువులు, నగదు కనిపించినా ముట్టరు. ఇంట్లో ఆభరణాలు, నగదు భద్రపరిచే ప్రదేశాలు.. కుటుంబ సభ్యులు ఏఏ సమయాల్లో ఎక్కడికి వెళతారనే విషయాలను తెలుసుకుంటారు. కుటుంబీకులతో కలసి నాలుగైదు రోజులు బయటకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలియగానే పథకం అమలు చేసేందుకు ఒక్కచోటికి చేరతారు. సొమ్ము కాజేసి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తారు. వాహనాలు, ప్రాంతాలు మారుతూ దళారి వద్దకు చేరి సొమ్ము అప్పగించి మాయమవుతారు. మూడేళ్లలో నేపాలీల చోరీ చేసిన కేసుల్లో సగం మాత్రమే పోలీసులు ఛేదించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా, జాగ్రత్తలపై సూచనలు చేసినా కొందరు యజమానులు తేలికగా తీసుకుంటున్నారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

# నేతన్నకు అభయహస్తం అందేదెప్పుడో?



చౌటుప్పల్ : తెలంగాణలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం ‘చేనేత అభయహస్తం’ పేరుతో సంక్షేమ పథకాలను ప్రకటించింది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసింది. వాటి స్థానంలో కొత్త పథకాలకు రూపకల్పన చేసింది. దీంతోపాటుగా నేత కార్మికుల రుణాలను మాఫీ చేయనున్నట్టు వెల్లడించింది. జిల్లాలో చేనేత వృత్తిపై వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. చేనేత, జౌళిశాఖ అధికారులు నిర్వహించిన ఇంటింటి సర్వేలో యాదాద్రి భువనగిరి జిల్లాలో 10400, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 5000 మంది జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై నేత పని, అనుబంధ వృత్తి పని చేస్తున్నట్టు గుర్తించారు.

‘తెలంగాణ నేతన్న పొదుపు’ పేరుతో ప్రకటించిన పథకంలో మగ్గం నేసే కార్మికుడు, ఒక అనుబంధ కార్మికుడు తమ నెలవారీ వేతనంలో 8 శాతం డబ్బును ప్రతినెలా బ్యాంకులో రికరింగ్ డిపాజిట్(ఆర్‌డి-1) ఖాతా తెరిచి అందులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం దానికి రెట్టింపు(16శాతం) డబ్బును చేనేత, జౌళిశాఖ అధికారి, చేనేత కార్మికుడి పేరిట తీసిన మరొక సంయుక్త ఖాతా(ఆర్‌డి-2)లో జమచేస్తుంది. ఈ పథకం గత ప్రభుత్వంలో 36 నెలల కాలపరిమితితో అమలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత సంవత్సరం ఆగస్టులో ముగిసింది. కార్మికులకు వారు బ్యాంకు ఖాతాల్లో పొదుపు చేసుకున్న, ప్రభుత్వ వాటా డబ్బును కలిపి ఏకమొత్తంగా తిరిగి ఇచ్చేశారు. ఆ పథకాన్ని పునరుద్ధరించలేదు.

కార్మికులు ప్రభుత్వాన్ని కోరడంతో చేనేత అభయహస్తంలో పొదుపు పథకాన్ని కొన్ని సవరణలతో చేర్చారు. 36 నెలల కాలపరిమితిని 24 నెలలకు కుదించారు. ఒక చేనేత కార్మికుడితోపాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు బదులుగా ఒక్కరికే అవకాశం కల్పించారు. అనుబంధ కార్మికులకు గతంలో రూ.800 పొదుపు చేసుకునే అవకాశముండగా దాన్ని రూ.600లకు తగ్గించారు. దీనిపై చేనేత ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో రూ.600లను గతంలో మాదిరిగా రూ.800లకు పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేశారు. అనుబంధ కార్మికులు ఇద్దరికి అవకాశం ఇవ్వలేదు. ఎనిమిది నెలల అనంతరం పొదుపు పథకాన్ని ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతించింది. జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై వస్త్రాలు నేస్తున్న వారికి మాత్రమే చేనేత, జౌళి శాఖ అధికారులు వారికి బ్యాంకుల్లో 24 నెలల పరిమితితో బ్యాంకుల్లో రికరింగ్ డిపాజిట్ ఖాతాలు ఆర్‌డి-1, ఆర్‌డి-2 తెరిపిస్తున్నారు.

**ఖాతాలు తెరిపిస్తున్నాం..**

తెలంగాణ నేతన్న పొదుపు పథకం ఏప్రిల్ నుంచి అమలవుతుంది. యాదాద్రి జిల్లాలో మగ్గం నేసే, అనుబంధ వృత్తి పని చేసేవారు 10,400 మంది పథకంలో చేరడానికి అర్హులని గుర్తించాం. వారికి బ్యాంకుల్లో 24 నెలల కాలపరిమితితో రికరింగ్ డిపాజిట్ ఖాతాలు ఆర్‌డి-1, ఆర్‌డి-2 తెరిపిస్తున్నాం. మగ్గం నేసే కార్మికుడికి నెల రోజులకు వేతనం రూ.15వేలు వస్తుందని లెక్కగట్టి అందులో 8శాతం రూ.1200, అనుబంధ కార్మికుడు నెలకు రూ.800 చొప్పున బ్యాంకులో జమ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం దానికి రెట్టింపు డబ్బు ఇస్తుంది. 24 నెలల తర్వాత ఈ రెండు ఖాతాల్లోని డబ్బును వారు పొందవచ్చు.శ్రీనివాస్, సహాయ సంచాలకుడు, చేనేత, జౌళిశాఖ, భువనగిరి

# కొరవడిన అనుబంధం



జగిత్యాల : విభిన్న పైర్లసాగుతో ప్రత్యేకత చాటుతున్నా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో వెనుకంజలోనే ఉంది. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా టీఎస్ఐపాస్ ద్వారా యూనిట్లు, పీఎంఈజీపీ యూనిట్లను, టీప్రైడ్‌ద్వారా పెట్టుబడి రాయితీని అధికంగా మంజూరివ్వాల్సి ఉంది. ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిస్తే కనీసం 50 వేల ఎకరాల్లో చెరకు, మూతపడిన సోయాబీన్ నూనెతయారీ పరిశ్రమను తెరిస్తే 30 వేల ఎకరాల్లో సోయాబీన్‌ను సాగుచేసే అవకాశం ఉంది.

జిల్లాలో యశ్వంతరావుపేట వద్ద ఆయిల్‌పామ్ క్రషింగ్‌యూనిట్ను నెలకొల్పుతున్నారు. పారిశ్రామికప్రాంత స్థానిక ప్రాధికార హోదాతో పరిశ్రమలశాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పల్లెల్లో పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేయాలి. మెట్లచిట్టాపూర్ వద్ద 150 ఎకరాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పాలని యోచించినా అమల్లోకి రావటంలేదు. వెల్గటూరు మండలం స్తంభంపల్లి వద్ద 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేయాల్సి ఉంది. పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జిల్లాకు మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించినా క్షేత్రస్థాయికి చేర్చాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని, పొలాస పరిశోధనస్థానంలోని పారిశ్రామిక యూనిట్ల శిక్షణ ఇంక్యూబేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తే రైతులకు మేలు కలుగుతుంది.

జిల్లాలోని చాలా గ్రామాల రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా(ఎఫ్.పి.ఒ) ఏర్పడగా వీరికి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమివ్వాలి. బియ్యంమిల్లులు, మామిడి తాండ్ర, రసంతయారీ పరిశ్రమలు, పసుపు పాలిషింగ్, పొడి, రంగులు, ఔషధాల తయారీ, మక్కల ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కెట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. సంకరవరి, సూటివరి, జొన్న, ఆవాలు, పత్తి, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతుండగా విత్తనశుద్ధి కర్మాగారాలను, విత్తనోత్పత్తి కంపెనీలను నెలకొల్పవచ్చు. నూనె మిల్లులు, పప్పు మిల్లులు, పత్తి జిన్నింగ్‌మిల్లులు, మిరప ఉపఉత్పత్తుల తయారీ మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అరటి, బొప్పాయి, ఇతర పండ్లతోటలు, కూరగాయల సాగు అధికంగా ఉండగా అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

జిల్లాలో ఆహార పంటలను 3.63 లక్షలు, ఉద్యాన పంటలను 81 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. టీఎస్ ఐపాస్‌ద్వారా ఇదివరకు రూ.865 కోట్లతో 1,255 పరిశ్రమలను ఏర్పాటు చేయగా 10 వేలమంది వరకు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల సంఖ్య పెరిగితే మరింతమందికి ఉపాధి కలగనుంది. రైతుల ఉత్పత్తులకు స్థానికంగానే అధిక ధరలు దక్కుతాయి. నాబార్డు రుణాలకు తోడు రాష్ట్రప్రభుత్వం రాయితీలనిస్తే వ్యవసాయ అనుబంధంగా చేపలు, రొయ్యలు, కోళ్లపెంపకం, మేకలు, గొర్రెలు, తేనెటీగల పెంపకం, పాడిపరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం తదితరాలను కూడా చేపట్టినప్పుడు సాగుకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.

# సహజ సాగుకు సమాయత్తం

కొత్తగూడెం: ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహజ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు ‘నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్’ పథకానికి శ్రీకారం చుట్టింది. మూసపద్ధతిలో సాగుకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే పంటలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 15, భద్రాద్రి జిల్లాలో 22 క్లస్టర్లలో 33 గ్రామాలను ఎంపిక చేసింది. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

జాతీయ సహజ వ్యవసాయ మిషన్ విశేషాలు..

సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది.

2025-26లో ఈ పథకం కోసం వెచ్చించే రూ.2,481కోట్ల మూలధనంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,584కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897కోట్లు ఖర్చు చేయనున్నాయి.

ఇప్పటికే సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తున్న రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) వంటి వాటికి ఈ పథకంలో ప్రాధాన్యమిస్తారు.

సేంద్రియ వ్యవసాయానికి అవసరమయ్యే సహజ ఉత్పత్తులను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవసరాన్ని బట్టి జీవాధార వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో 2వేల వరకు నమూనా



సహజ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు.

ఆసక్తి గల రైతులకు నిపుణులైన శిక్షకులు (మాస్టర్‌ట్రైనర్లు) సహజ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ వంటి వాటిలో శిక్షణనిస్తారు.

జిల్లాల్లో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లలో ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు, స్థానిక రైతుల మధ్య సహకారం పెంచేందుకు ‘కృషి సఖులు, సాగు సహాయకుల(సీఆర్పీ)ను ఉపయోగించుకోనున్నారు.

**చేకూరే ప్రయోజనాలు..**

సేంద్రియ ఎరువులు, జీవసంబంధ పద్ధతుల వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూసారం మెరుగుపడుతుంది.

రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గటం వల్ల వాతావరణంలో కార్బన ఉద్గారాలు తగ్గుతాయి. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్, ధర ఉండటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి సురక్షితమైనవి. పోషక విలువలను అధికంగా కలిగి ఉంటాయి.

సహజ వ్యవసాయం పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది.

శ్రీనివాస్, కేవీకే, శాస్త్రవేత్త, భద్రాద్రి

# సాగర్ కళకళ..
# గోదావరి వెలవెల

ఖమ్మం: గతేడాది కన్నా భిన్నంగా ఈసారి సాగర్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో వేసవిలో తాగునీటి గండం నుంచి గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు భద్రాద్రి జిల్లాలోని గోదావరిలో నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. నీటిని పొదుపుగా వాడటంతో పాటు.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది.

**ఢోకా లేనట్టే..** పాలేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2.558 టీఎంసీలు. ప్రస్తుతం 1.975 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని 2,375 ఆవాసాల తాగునీటి అవసరాలకు 137 క్యూసెక్కుల జలాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత నిల్వలతో ఈ వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు ఢోకాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నుంచి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పదకొండు మండలాల్లో 465 గ్రామాలకు రోజుకు పదికోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.30 అడుగులు కాగా.. ప్రస్తుతం 14.90 అడుగుల వద్ద నీరు ఉంది. వేసవి అవసరాలకు ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచకు 0.2 టీఎంసీలు, కొత్తగూడెం పట్టణానికి 0.473 టీఎంసీల నీరందుతుంది. వీటితోపాటు



పారిశ్రామిక ప్రాంతాలైన కేటీపీఎస్, నవభారత్‌కు జలాలు సరఫరా అవుతాయి. ‘కిన్నెరసాని’ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం 396.7 అడుగుల వద్ద నీరు ఉంది. ఈ నిల్వలు వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చనున్నాయి.

**గోదావరి పరీవాహకంలో ఇక్కట్లు**

గోదావరి పరీవాహకంలో కాస్త ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండు అడుగులకే పరిమితమైంది. పర్ణశాలలోని మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రోజుకు 50 లక్షల లీటర్లు, భద్రాచలం పట్టణానికి గోదావరి నుంచి నిత్యం 65 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగితే గోదావరి నీటిమట్టం మరింత తగ్గుతుంది. తాగునీటి అవసరాలను బట్టి ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి జలాలను రప్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# ఐసీడీఎస్‌లో రూ.5 లక్షలు దుర్వినియోగం

అనంతపురం : జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ పీడీ కార్యాలయంలో ఐఎస్ఓ హంగులన్నీ మాయం అయ్యాయి. దీనికి వెచ్చించిన సుమారు రూ.5 లక్షలు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. అసలే ఆర్థిక భారంతో విలవిల్లాడుతున్న రాష్ట్ర ఖజానాకు ఇదొక తీరని నష్టంగా మిగిలింది. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ ధ్రువీకరణ పేరుతో రూ.లక్షలు వృథా, దుర్వినియోగం చేశారన్న అభియోగాలు నిత్యకృత్యంగా వినిపిస్తున్నాయి. నిధుల లేమితో అల్లాడిపోతున్న ఐసీడీఎస్ పీడీ కార్యాలయానికి ఐఎస్ఓ వ్యవహారం ఒక గుదిబండలా మారినా అప్పట్లో వెనుకడుగు వేయలేదు. కొత్త హంగుల పేరుతో ఏకంగా రూ.5 లక్షలు ఖర్చు పెట్టడం తీవ్ర దుమారం రేగింది. సమగ్ర పిల్లల సంరక్షణ సమితి(ఐసీపీఎస్), చైల్డ్‌లైన్-1098, డీసీపీ.. వంటి విభాగాలను బాలల సంరక్షణ సమితి (సీడబ్ల్యూసీ) కార్యాలయ భవన సముదాయంలోనే ఉండాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడో ఆదేశించాయి.



ఎప్పటికైనా ఈ విభాగాలు సీడబ్ల్యూసీ ఆవరణానికే తరలిపోతాయని తెలిసినా.. ఐఎస్ఓ పేరుతో ఆయా విభాగాలకు కొత్త హంగులతో ఫర్నీచర్, ఇతరత్రా సదుపాయాలు కల్పించారు.

**ఆ విభాగాలు తరలింపు**

పీడీ కార్యాలయంలో ఉన్న చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, డీసీపీ విభాగాలను అనంత గ్రామీణ మండలం తడకలేరు సమీపంలోని సీడబ్ల్యూసీ కార్యాలయ సముదాయానికి మార్పు చేశారు. ఐఎస్ఓ కోసం తయారీ చేసిన ఫర్నీచర్‌ను తొలగించేసి.. కొన్ని చెక్కలను తీసుకెళ్లారు. ఇప్పుడు అక్కడి విభాగాన్ని సమావేశ మందిరంగా మార్పు చేస్తున్నారు. చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, డీసీపీ వంటి విభాగాలు పీడీ కార్యాలయ ఆవరణలోనే ఉంటేనే ప్రజలకు బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాకపోతే దేశ వ్యాప్తంగా పాటిస్తున్న మార్గదర్శకాలనే అమలు చేయాలన్న నిబంధన ప్రకారం మార్పు చేశారు. ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల ప్రకారమే ఆ విభాగాలను సీడబ్ల్యూసీ భవన సముదాయానికి తరలించినట్లు పీడీ నాగమణి తెలిపారు. ఇక్కడి ఫర్నీచర్, ఇతరాత్ర సామగ్రి వృథా కాకుండా ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నామన్నారు.

# పగలు తరలింపు.. రాత్రికి చదును

తొట్టంబేడు : విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు అక్రమార్కులు సిద్ధమయ్యారు. పగలు టిప్పర్లతో గ్రావెల్ తరలించడం.. రాత్రికి భారీ యంత్రంతో చదును చేయడం.. ఈ అక్రమం శ్రీకాళహస్తి- తడ ప్రధాన రహదారిలో శ్రీకాళహస్తి పట్టణానికి అత్యంత సమీపంలో జరుగుతోంది. మూడురోజుల్లోనే ఈ మొత్తం తంతు జరిగింది. వివరాల్లోకి తొట్టంబేడు మండల పరిధిలోని బీడీ కాలనీకి సమీపంలో ప్రధాన రహదారి పక్కన విలువైన ప్రభుత్వ స్థలం ఉంది. బహిరంగ విపణిలో ఎకరా రూ.కోటి పలుకుతుంది. దీంతో కొందరు అక్రమార్కుల కన్ను ఆ స్థలంపై పడింది. ఈనెల 22వ తేదీ గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు టిప్పర్లతో పదుల సంఖ్యలో మట్టిని తరలించారు.



భారీ యంత్రంతో చదును చేసేశారు. ఇప్పటికే దాదాపు 5 సెంట్ల విస్తీర్ణాన్ని చదును చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పక్కనే మరికొన్ని మట్టి కుప్పలు కనిపిస్తుండటంతో మరింత స్థలాన్ని చదును చేస్తారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమానికి స్థానిక రెవెన్యూ అధికారి సహకారం ఉందని ఆరోపణలున్నాయి. రహదారి విస్తరణకు ఇటీవలే ఆ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. రహదారి పనులు ప్రారంభమైతే కబ్జా కుదరదని తెలిసి పక్కా ప్రణాళికతో అక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ మధుసూదనరావు దృష్టికి తీసుకెళ్లగా.. విషయం ఆయన దృష్టికి వచ్చిందని, వెంటనే పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

# కుళాయిల ముసుగులో దోపిడీ

గుంతకల్లు : గుంతకల్లు మున్సిపాలిటీలో పెద్దఎత్తున దొంగ కుళాయిలు వెలిశాయి. తద్వారా మున్సిపాలిటీ భారీగా గండి పడుతోంది. కొందరు ఇళ్లకు మున్సిపాలిటీ అనుమతులు, ఎలాంటి రుసుం చెల్లించకుండానే రాజకీయ నాయకుల ఇళ్ల యజమానుల నుంచి కొంత మొత్తం వసూలు చేసుకుని అనధికారికంగా ఇళ్లకు సిబ్బంది సహకారంతో కనెక్షన్లు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు నాయకులు ఎన్నికల్లో కౌన్సిలర్లుగా మళ్లీ మళ్లీ గెలవాలన్న ఉద్దేశంతో అక్రమ కుళాయిలు వేయించారన్న విమర్శలున్నాయి. అధికారులు అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగించడానికి వెళ్లినప్పుడల్లా కొందరు నాయకులు అడ్డుపడుతుండటంతో వారు ఏమీ చేయలేకపోతున్నారు. గతంలో అధికారులు ఒక్క వార్డులోనే 120 అక్రమ కుళాయిలను గుర్తించారు. తరువాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగింపు పనులు అర్ధాంతరంగా ఆపేశారు. సందట్లో సడేమియా అన్న చందంగా కొందరు మున్సిపల్ సిబ్బంది రాత్రికి రాత్రే ఇళ్లకు అక్రమ కుళాయిలు ఏర్పాటు చేసి డబ్బులు దండుకుంటున్నారు. రెండు నెలల కిందట ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ సిబ్బంది నిర్వాకాన్ని గుర్తించి ఇద్దరిని సస్పెండ్ చేశారు.

**15 ఏళ్లుగా సాగుతున్నా.. పట్టని తీరు**

గుంతకల్లు మున్సిపాలిటీలో అధికారికంగా 33 వేలు, అక్రమ కుళాయిలు దాదాపు 10 వేలు ఉన్నట్లు అంచనా. వీటి కనెక్షన్ల ద్వారా ఏడాదికి రూ.5.20 కోట్లు ఆదాయం వస్తోంది. అక్రమ కుళాయిల వల్ల మున్సిపాలిటీకి నెలకు రూ. 12 లక్షలు, ఏడాదికి రూ. 1.44 కోట్ల రావాల్సి ఉంది. 15 ఏళ్లుగా రూ.21 కోట్ల నీటి పన్ను వసూలు కాలేదు. పట్టణానికి నీటిని సరఫరా చేయడానికి నెలకు విద్యుత్తు ఛార్జీలు, కార్మికులకు వేతనాల కింద రూ.50 లక్షలు ఖర్చు చేస్తోంది. అక్రమ కుళాయిల నుంచి ఆదాయాన్ని గడిస్తే.. పురపాలక ప్రగతికి దోహదపడుతుంది. **పరిశీలించి చర్యలు తీసుకుంటాం: నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్**

అక్రమ కుళాయిలు ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని తొలగించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. అవినీతికి పాల్పడు తున్న వారిపై వేటు వేశాం. ప్రజల సహకారంతో అవినీతికి తావులేకుండా తగు చర్యలు తీసుకుంటాం.

# పది శాతం పనులపై నిర్లక్ష్యం



విశాఖపట్నం : ఏళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మోక్షం కలగడం లేదు. పది శాతం పనులు పూర్తయితే అప్పగించేలా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పూర్తిస్థాయి తాగునీటి వసతి కల్పిస్తే సరిపోయేలా ఉన్నా పట్టించుకోని దుస్థితి నెలకొంది. మరో వైపు బ్యాంకు ఈఎంఐ రుణాలు చెల్లించలేక, అద్దెకు ఉండలేక సామాన్యుడు నలిగిపోతున్నాడు. జిల్లాకు మొత్తంగా 24192 టిడ్కో ఇళ్లను కేటాయిస్తే వాటిల్లో 7296 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన వాటిల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాల్సి ఉంది. పాలకులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

**దసరాకు అప్పగించాలంటున్నప్పటికీ..**

క్షేత్రస్థాయిలో టిడ్కో ఇళ్ల పూర్తి నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం దసరాకు లబ్ధిదారులకు అప్పగించాలనే ప్రణాళికతో ఉన్నప్పటికీ కింది స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కొన్ని చోట్ల గుత్తేదారులకు డబ్బులు చెల్లించకపోవడంతో నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టాల్సినప్పటికీ అదేమీ కనిపించడం లేదు.

**ఎక్కడ, ఎలా ఉందంటే?**

జిల్లాలో 16,896 మందికి టిడ్కో ఇళ్లను అప్పగించాలి. మధురవాడ పరిధి కొమ్మాదిలోని నాలుగు ఎకరాల్లోని ఏడు బ్లాకుల్లో 336 గృహాలు నిర్మించారు. అప్పట్లో నీలిరంగులు వేసి వదిలేశారు. లోపల విద్యుత్తు, ప్లంబింగ్, యూజీడీ ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. వీటికి నిధులు మంజూరైనా ఎప్పటికి పూర్తవుతాయో చూడాలి.

బక్కన్నపాలెంలో 384 గృహాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. పైకప్పు వరకు నిర్మించి వదిలేశారు. కొన్ని బ్లాకులు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. సంగివలసలో 480 గృహాలదీ అదే పరిస్థితి.


పెందుర్తి మండలం చీమలాపల్లి1, 2 లేఅవుట్‌లో మొత్తంగా 1200 ఇళ్లకు సంబంధించిన పనులు అప్పట్లో మొదలెట్టారు. గుత్తేదారులకు బిల్లులు మంజూరవ్వకపోవడంతో మధ్యలోనే పనులు ఆపేశారు. ఇవి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. పశ్చిమ నియోజకవర్గంలోని అచ్చెన్నాయుడులోవలో 2894 ఇళ్లను నిర్మించారు. అంతర్గత రహదారులు పూర్తయినప్పటికీ ఇక్కడ పూర్తిస్థాయి వసతులు కల్పించాలి. తాగునీటి సమస్య ఉంది.

పెదగంట్యాడలో 6072 ఇళ్లు పూర్తయినా మౌలిక వసతుల సమస్య ఉంది. ట్రైజంక్షన్‌లో 1284 ఇళ్లు పూర్తవ్వగా మరో 1296 అసంపూర్తిగా ఉన్నాయి. దువ్వాడలో 1056, భానోజితోట 1056, కళావానిపాలెంలో 1200 ఇళ్లను నిర్మించారు. ఇక్కడ రహదారులు, కాలువలు నిర్మించినప్పటికీ తాగునీటి సమస్య ప్రధానంగా ఉంది. ఇళ్లకు తాగునీటి వసతి కల్పించాలి.

**మీరే కొనసాగుతారా?:** ప్రస్తుతం టిడ్కో లబ్ధిదారులకు జీవీఎంసీ అధికారులు నోటీసులు అందిస్తున్నారు. అందులో లబ్ధిదారు వివరాలతో పాటు రుణం తీసుకున్న వివరాలు పొందుపరుస్తున్నారు. ప్రధానంగా టిడ్కో ఇల్లు వద్దనుకుంటే ఎందుకో కారణం తెలిపి రాత పూర్వకంగా తీసుకుంటున్నారు. అందులోనే కొనసాగుతారనుకుంటే ఆ వివరాలు నమోదు చేస్తూ దీన్ని ఓ సర్వేలా చేపడుతున్నారు. కొందరు ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. చాలా మంది లబ్ధిదారులు రుణాల చెల్లింపునకు మరికొంత సమయం కోరుతున్నారు. చెల్లించని వారిలో చాలామంది ఇళ్లల్లో దిగిపోయిన వారే ఉడడం గమనార్హం.

మొత్తం 24 వేల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 12 వేల రిజిస్ట్రేషన్లు లబ్ధిదారుల పేరుతో జరిగాయి. మిగిలిన వారికి త్వరలోనే చేసేలా సోమవారం నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేశారు.

# 'ఈ-వాహనం'.. రోడ్డే ఇంధనం..!



ఏయూ ప్రాంగణం : గత దశాబ్దకాలంలో కార్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వీటిలో డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలే అధికం. దీంతో వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్తు వాహనాలు వచ్చినప్పటికీ ఛార్జింగ్ సమస్యల దృష్ట్యా అనుకున్న స్థాయిలో వాటికి డిమాండ్ పెరగలేదు. ఇందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఒక పరిష్కారాన్ని కొనుగొన్నారు. వాహనాలు రహదారిపై పరుగెడుతుంటే బ్యాటరీ ఛార్జింగ్ అయ్యే విధానాన్ని రూపొందించారు. అయితే దీనికోసం ప్రత్యేకంగా స్మార్ట్ రహదారి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**ఎలాంటి తీగలు లేకుండానే..**

ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు కె.భార్గవి, బి.భార్గవి, జి.సాయి పూజిత, సీహెచ్.డి.ఎన్.సత్యశ్రీ, ఎన్.వి.కె. అమూల్య, చాందిని తమ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం మార్కెట్‌లో విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ సమస్యలను గుర్తించారు. వాటికి పరిష్కారం కనుగొనాలని భావించారు. ఆలోచనను అధ్యాపకులు డాక్టర్ ఎం.దివ్య, డాక్టర్ ఎం.రేవతిలతో పంచుకున్నారు. వారి ప్రోత్సాహంతో ప్రయోగాలు చేసి 'డైనమిక్ వైర్‌లెస్ ఛార్జింగ్ ఎలక్ట్రికల్ వెహికల్' ప్రోటోటైప్‌ను తయారు చేశారు. ఎలాంటి తీగల సహాయం లేకుండానే ఈ వాహనం ఛార్జింగ్ అవుతుంది. 90శాతం ఛార్జింగ్ కాగానే దానంతట అదే ఆగిపోతుంది. అతి తక్కువ వ్యయంతో దీన్ని తయారు చేశారు. పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు చేశారు.

**ఎలా పనిచేస్తుందంటే...**

ఇప్పుడున్న రహదారుల్లో ఒక వరసను విద్యుత్తు వాహనాలు నడిచేందుకు విడిచి పెట్టాలి. ఈ రహదారులపై కాపర్ తీగ అమర్చుతారు. రహదారి పక్కనే సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తారు. దాని నుంచి విద్యుత్తు ప్రవహించి వోల్టేజి డివైజర్ ద్వారా కాపర్ వైర్‌కు వెళుతుంది. అక్కడి నుంచి రహదారిపై నడిచే విద్యుత్తు వాహనంలోకి ప్రవేశిస్తుంది. వాహనం బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి దానంతట అదే ఛార్జింగ్ అవుతుంది. డ్రైవర్ వద్ద గల డిస్‌ప్లేలో ఛార్జింగ్ అవుతున్న దృశ్యం కనిపిస్తుంది. బ్యాటరీ 90శాతం ఛార్జింగ్ పూర్తి కాగానే ఆటోమెటిక్‌గా నిలిచిపోతుంది. ఈ విధానంలో తక్కువ సమయంలో బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది. స్మార్టు రహదారులు ఏర్పాటవుతాయి. పెట్రోలు, డీజిల్ వాహనాలు తగ్గి నగరాలలో కాలుష్య సమస్య తగ్గుతుంది.

**ఉపయోగించిన పరికరాలు ఇవే...**

వాహనం గమనాన్ని నియంత్రించేందుకు మోటార్ డ్రైవర్‌ను ఉపయోగించారు. విద్యుత్తు ప్రవాహం కోసం మైక్రో కంట్రోలర్‌ను అమర్చారు. ప్రాజెక్టులో ఇది కీలకమైనది. శక్తి(విద్యుత్తు) సరఫరా కోసం సోలార్ ప్యానల్ లేదా బ్యాటరీలు, విద్యుత్తు ఛార్జింగ్ చూసేందుకు ఎల్‌ఈడీ డిస్‌ప్లే, డిస్‌ప్లేను మైక్రోకంట్రోలర్‌తో అనుసంధానించడానికి ఐ2సీ మాడ్యూల్ ఉపయోగించారు.

# ప్రభుత్వ భూముల్లో పాగా..

కె.కోటపాడు : కొందరు నేతల అండదండలతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. గెడ్డ పోరంబోకు, ప్రభుత్వ భూములను ఆక్రమించి దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. చౌడువాడ లో సంపద కేంద్రాన్ని ఆనుకుని సర్వే నం.410-1, పక్కనే సర్వే నం.414-3లో గెడ్డ పోరంబోకు భూములున్నాయి. వీటిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. రోడ్డు పక్కనే తొలుత కూరగాయల అమ్మకాలు జరిపారు. తర్వాత పాకలు వేసి ఇప్పుడు పక్కా నిర్మాణాలు మొదలుపెట్టారు. ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.50 లక్షలకుపైగా ఉంటుంది. సర్వే నం.410-1లో 3.19 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ, గెడ్డవాగు భూమిగా నమోదై ఉంది. ఇందులో కొంత భూమిలో సంపద కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణంలో ఉంది. మిగిలిన భూమి ఆక్రమణలకు గురవుతోంది. 414-3లో 5 సెంట్లను ఆక్రమించేశారు. తహసీల్దారు రమేశ్‌బాబుకు దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన వెంటనే స్పందించారు. వీఆర్వో నాయుడు, వీఆర్ఏలను పంపి నిర్మాణ పనులను నిలిపివేయించారు.



# సీటొస్తే.. చాలు

తిరుపతి : కార్పొరేట్ సంస్థల దూకుడులోనూ తితిదే విద్యాసంస్థలు తమ ఉనికిని బలంగా చాటుతున్నాయి. ఇంటర్ ప్రవేశాల్లో వీటికున్న డిమాండు అంతాఇంతా కాదు. బాలబాలికలకు ప్రత్యేకంగా రెండు జూనియర్ కళాశాలలు ఉండగా బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా మరోటి నిర్వహిస్తున్నారు. అతి తక్కువ ఫీజులు ఉండటం, ఉత్తమ బోధన, వసతిగృహ సౌకర్యం, సైన్స్ విద్యార్థులకు తగినన్ని ప్రయోగశాలలు, సరైన క్రీడా మైదానాలు ఉండటంతో రాయలసీమలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువగా పోటీ పడుతున్నారు.

**రెండు జూనియర్ కళాశాలల్లోనూ..**

ఎస్వీ జూనియర్ కళాశాలలో మొదటి ఏడాదిలో ఏటా 792 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 600 మంది విద్యార్థులకు వసతిగృహం సౌకర్యం ఉటుంది. బాలికల కోసం ఉద్దేశించిన శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో 968 మందికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశం ఉంటుంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 1,100 మందికి వసతిగృహ అవకాశం కల్పిస్తారు. ఒకే ప్రాంగణంలో కళాశాల, వసతిగృహం ఉండడంతో తల్లిదండ్రులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. తెల్లరేషన్ కార్డులు కలిగినవారు విద్యుత్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

**బధిరులకు ప్రత్యేకం:** అలిపిరి సమీపంలో బధిర విద్యార్థులకు ప్రత్యేక



కళాశాల ఉంది. ఇందులో హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులు ఉండగా 45 చొప్పున భర్తీ చేస్తారు. ప్రాంగణంలోనే వసతి గృహం ఉంది. తిరుపతి భవానినగర్‌లోని ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన వెంటనే ప్రీడిగ్రీ, బీఏవోఎల్‌లో తెలుగు, సంస్కృతం, హిందీ విభాగాల్లో ప్రవేశాలు ఉన్నాయి. ఆయా విభాగాల్లో మొత్తంగా 180 మందికి ప్రవేశాలు కల్పిస్తారు.

**ఉత్తీర్ణత ఇలా..**

శ్రీపద్మావతి: 93%,

ఎస్వీ: 84.50%

రుసుములు, దరఖాస్తుల సమర్పణ ఇలా..

సైన్స్ విద్యార్థులు: రూ.5,350

ఆర్ట్స్ విద్యార్థులు: రూ.4,400

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు

పద్మావతి: 6,000

ఎస్వీ: 7,200 దరఖాస్తు ఇలా..ఈ ఏడాది ప్రవేశాలకు ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. మే 31వ తేదీ వరకు అవకాశం ఉంది http://admission.tirumal.org వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తులు సమర్పించవచ్చు.

# కాలుష్య వ్యర్థాల.. కట్టడి సున్నా

పుత్తూరు :నారాయణవనం మండలం కీళగరం వద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీ ఏర్పాటులో నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తోంది. కంపెనీ ప్రారంభంలోనే ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయాల్సిన యాజమాన్యం అప్పటి వైకాపా నేతల అండతో అందుకు తిలోదకాలిచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు పట్టించుకోకుండానే ఉత్పత్తి ప్రారంభించారు. అరుణా నదితోపాటు ఇతర ప్రాంతాల్లో వ్యర్థాలు వదిలేస్తున్నట్లు తాజాగా వెలుగు చూసింది. ఇదే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలికి స్థానిక అధికారులు లిఖితపూర్వకంగా నివేదించారు.

**నిబంధనలకు విరుద్ధంగా..:** ఫార్మాస్యూటికల్ కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలు ట్రీట్‌మెంట్ చేసి బయటకు వదలాలి. అయితే ఇవేమీ పట్టనట్లు



కంపెనీ యాజమాన్యం వ్యవహరించింది. వాస్తవానికి కంపెనీ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జడ్‌ఎల్‌డీ) అనంతరం వదిలిపెట్టాలి. ప్రస్తుతం ప్లాంటు నుంచే నేరుగా వ్యర్థాలు వదిలేస్తుండటంతో సమీప ప్రాంతాల్లో కాలుష్య సమస్యలు ఎదురవుతున్నాయి. కంపెనీ ప్రారంభించే ముందు అన్ని శాఖల అధికారులతోపాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేసి అనుమతులు ఇవ్వాలి. అయితే ఇవేవీ లేకుండానే వైకాపా నాయకుల అండతో అనుమతులు పొందినట్లు స్పష్టమవుతోంది.

**నోటీసులు ఇస్తున్నాం..:** నారాయణవనంలోని ఫార్మాస్యూటికల్ కంపెనీలో జడ్‌ఎల్‌డీ ప్లాంటు ఇంకా నిర్మించలేదు. దీంతో వ్యర్థాలను బయట ప్రాంతాల్లో వదులుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే మండల అధికారుల బృందం నిర్ధారించింది. కంపెనీ యాజమాన్యం నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలకు ఉపక్రమిస్తాం. రాజశేఖర్, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, తిరుపతి

# 30 కిలోలు.. రూ.1674

చిత్తూరు : ఖరీఫ్ రైతులకు వేరుసెనగ విత్తనకాయల ధరలు ఖరారు చేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జిల్లాకు 26 వేల క్వింటాళ్ల విత్తు కేటాయించగా విత్తన సరఫరా బాధ్యతలను ఏపీ విత్తన సంస్థకు అప్పగించారు. ప్రస్తుతానికి జిల్లాకు 7,500 క్వింటాళ్లు చేరినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కే6 రకం క్వింటా రూ.9,300 కాగా ప్రభుత్వ రాయితీ రూ.3,720 (40%) పోను రైతువాటా రూ.5,580 చెల్లించాలి. ఈ లెక్కన 30 కిలోల బస్తా ధర రూ.1,674 కానుంది. రాయితీపోను నారాయణి రకం 30 కిలోల విత్తన ధర రూ.1,710, కదిరి లేపాక్షి రకం 30 కిలోల ధర రూ.1,476గా ఖరారు చేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా వీలైనంత త్వరగా విత్తు పంపిణీ ప్రారంభించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు వేగవంతం చేసింది.బస్తాపై రూ.36 తగ్గింపు : ఖరీఫ్‌లో వేరుసెనగ పంట విస్తారంగా సాగవుతోంది. ఏటా విత్తన ధరలు పెరుగుతూనే ఉండేవి. కూటమి ప్రభుత్వం రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో విత్తన ధరలు తగ్గించింది. గతేడాది 30 కిలోల బస్తా ధర రూ.1,710 ఉండగా ఈ ఏడాది బస్తాపై రూ.36 తగ్గించి రూ.1,674కే అందజేయనుంది.జిల్లా రైతులకు రూ.80 లక్షలు ఆదా కానుంది.

# అనుగ్రహమేదీ

కర్నూలు : జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను చేర్చుకుంటుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు సదుపాయాలు కానరావడం లేదు. అవసరమైన సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ కరవైంది. వెల్దుర్తి, ఎమ్మిగనూరులోని బీసీ బాలికల వసతిగృహాలు, కంబాలపాడు, ఆదోనిలోని బీసీ బాలుర వసతిగృహాల్లో విద్యార్థులు ఎక్కువగా చేరుతున్నారు. దీంతోపాటు రాజకీయ నాయకులు సైతం సిఫార్సు చేస్తుండటంతో అధికారులు అడ్డుచెప్పలేకపోతున్నారు. ఆ నాలుగుచోట్ల అదనంగా మరో వసతిగృహం కావాలని ప్రతిపాదనలు పంపినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

వెల్దుర్తిలోని బీసీ బాలికల వసతిగృహంలో 2024-25 విద్యా సంవత్సరంలో 573 మంది ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ కేవలం 200 మందికి తగ్గట్టు సదుపాయాలున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో వంద మందిని, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మరో వంద మందిని చేర్చుకోవాలి. 2023లో అధికారిక అనుమతులు తీసుకుని వాటి ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇక్కడ 200 మందికంటే అదనంగా 373 మందిని చేర్చుకోవడంపై విమర్శలు రేగుతున్నాయి. విద్యార్థినుల ఇబ్బందులు తీర్చేందుకుగాను దాతల సాయంతో ఒక భవనం, ఒక షెడ్డు నిర్మించి అందులోనే ఉంచుతున్నారు.




**సౌకర్యాలు కరవై..**

వసతిగృహాలను ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసే వాటి సామర్థ్యానికి తగ్గట్టు అవసరమైన సిబ్బందిని నియమిస్తుంది. వంద మంది విద్యార్థులుంటే కనీసం ముగ్గురిని కేటాయిస్తుంది. ఒకరు వంట చేసేందుకు, మరొకరు అటెండరూగా, ఇంకొకరిని రాత్రి కావలాదారుగా నియమిస్తారు. 573 మంది విద్యార్థులకు ఇద్దరితో వంట చేయించడం కష్టమే. నిబంధనల ప్రకారం 500 మంది విద్యార్థులు ఉంటే కనీసం పది మంది నాలుగో తరగతి ఉద్యోగులుండాలి. దీనికితోడు అవసరమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.

**సామర్థ్యానికి మించి..**

కృష్ణగిరి మండలం కంబాలపాడు బీసీ బాలుర వసతిగృహంలో 2024-25 విద్యా సంవత్సరంలో 300 మంది విద్యార్థులకుగాను 480 మంది ఉన్నారు. 180 మందికి అదనంగా ప్రవేశాలు కల్పించారు. ఈ వసతిగృహానికి ఉన్న డిమాండు దృష్ట్యా ఇక్కడే మరో వసతిగృహం నిర్మించాలని అధికారులు ప్రతిపాదించగా గత వైకాపా ప్రభుత్వం దానిని పక్కన పెట్టింది. ఆదోని బీసీ కళాశాల విద్యార్థుల వసతిగృహం అధికారిక సామర్థ్యం 100 కాగా 422 మంది ఉన్నారు. ఇక్కడ సైతం మరో 300 మంది విద్యార్థులకు సరిపడా వసతిగృహానికి అనుమతించాలన్న ప్రతిపాదనకు మోక్షం కలగలేదు. ఎమ్మిగనూరు బీసీ బాలికల వసతిగృహ సామర్థ్యం 200 కాగా 2024-25లో 350 మంది విద్యార్థినులు ఉన్నారు.

# వజ్రాన్వేషకులు

మద్దికెర: తొలకరి వర్షాలు పలకరిస్తే చాలు.. వజ్రాన్వేషకు లు పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే అన్వేషకుల పంట పండుతోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మద్దికెర, తుగ్గలి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వజ్రాలు వెతికేందుకు తరలివెళ్తున్నారు. తొలకరి వర్షాల నేపథ్యంలో పలువురికి విలువైన వజ్రాలు లభ్యమవుతున్నాయి. దొరికిన వాటిని ఈ ప్రాంత వ్యాపారులు అవసరమైతే బహిరంగ ఎవరికీ తెలియకపోతే రహస్యంగా కొనుగోలు చేస్తున్నారు.

**అదృష్టం కలిసొస్తే..**

వజ్రాన్వేషణలో కలిసొస్తే.. క్షణాల్లో లక్షాధికారి కావొచ్చన్న ఉద్దేశంతో ఎక్కడో దూర ప్రాంతాల నుంచి జనం ఈ ప్రాంతాలకు వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటారు. తొలకరి చినుకులు పలకరిస్తే.. రైతులు పొలం బాట పడతారు. కానీ ఈ ప్రాంతంలో ఎర్ర నేలల్లో ఏటా వజ్రాన్వేషకులు తిష్ఠవేస్తారు. తుగ్గలి మండలం పగిడిరాయి, జొన్నగిరి, జి.ఎర్రగుడి, చెన్నంపల్లి, రాంపురం, ఉప్పర్లపల్లి గ్రామాలతో పాటు మద్దికెర మండలం పెరవలి,



మదనంతపురం, బసినేపల్లి గ్రామాల్లోని ఎర్ర నేలల్లోనూ వజ్రాలు లభిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో వజ్రాన్వేషణ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకొ ంటుంటారు. ఏటా మే చివరి వారం, జూన్‌లో జొన్నగిరి, మదనంతపు రం బస్టాండ్ సమీప పొలాల్లో వజ్రాన్వేషకులు గుంపులు గుంపులుగా కనిపిస్తారు. స్థానికులేకాక ప్రకాశం, గుంటూరు, అనంతపురం జిల్లాలు, సమీప కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఎక్కువగా వజ్రాన్వేషకులు వస్తుంటారు. గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారిపై కార్లలో వెళ్లేవారు సైతం పొలాల్లో జనాల గుంపులను చూసి ఓ అరగంటపాటు వజ్రాల కోసం వెతికి వెళ్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు పగలంతా వజ్రాన్వేషణ చేసి రాత్రివేళలో జొన్నగిరి బాటాంజనే య స్వామి, మదనంతపురం బస్టాండ్, దొన వద్ద రాత్రివేళల్లో సేదదీరుతు ంటారు. ఆయా గ్రామాల్లో హోటళ్లు కళకళలాడుతున్నాయి. మదనంతపురం బస్టాండ్ సమీపంలో రహదారి వెంబడి గత ఏడాది రెండు హోటళ్లు ఉండగా.. ఇప్పుడు ఏడుకు చేరింది జనం గుంపులుగా పొలాల్లో తిరుగుతుం డటంతో భూమి గట్టి పట్టి విత్తనాలు చల్లే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సాగుకు ఊతం.. రైతులకు వరం



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో బిందు, తుంపర సేద్యం పథకం కింద పరికరాలు అందక నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకం అమలుకు చర్యలు తీసుకుంది. 2014-19 అప్పటి ప్రభుత్వ హయాంలో పాత నిబంధనలు పునరుద్ధరిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు 32 వేల హెక్టార్లు అమలుకు లక్ష్యంగా నిర్దేశించారు. అనంతపురం జిల్లాకు 18 వేలు, శ్రీసత్యసాయి జిల్లాకు 14 వేల హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**కోరిన కంపెనీని ఎంపిక చేసుకోవచ్చు..**

ఈ ఏడాది బిందు, తుంపర సేద్యం పరికరాలు సరఫరా చేసేందుకు 29 కంపెనీలకు బాధ్యతలు అప్పగించారు. ఆయా కంపెనీల జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాల్లో అంటించారు. రైతులు కోరిన కంపెనీ ఎంపిక చేసుకుని పేర్లు నమోదు చేసుకోవచ్చు. రైతు ఆధార్ కార్డు నకలు, పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఒన్‌బీ నకలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్యాంకు ఖాతా పుస్తకం వంటి నకళ్లను రైతు సేవా కేంద్రానికి వెంట తీసుకెళ్లాలి. ఈ పత్రాలన్నీ రిజిస్ట్రేషన్ పత్రానికి జత చేయాల్సి ఉంటుంది.

అంశం : బిందు, తుంపరసేద్యం
ఈ ఏడాది లక్ష్యం : 32 వేల హెక్టార్లు
ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీ : 100 శాతం
10 ఎకరాల్లోపు రైతులకు.. : 90 శాతం
తుంపర సేద్యం అందరికీ : 50 శాతం

**డిజిటల్ పేమెంట్ చెల్లింపులు**

పేరు నమోదు చేసుకున్న రైతులు పొలాల్లో ప్రాథమిక పరిశీలన చేసిన తర్వాత చెల్లించాల్సిన రైతు వాటా రిజిస్టరైన చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా సంక్షిప్త సమాచారం వస్తోంది. డిజిటల్ పేమెంట్ (ఎన్ఈఎఫ్టీ, ఫోన్‌పే, గూగుల్ పే) ద్వారా ఏపీఎంఐపీ ఖాతాకు నేరుగా జమ చేయాల్సి ఉంటుంది. సొమ్ము చెల్లింపులో రైతులు మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు.

సద్వినియోగం చేసుకోండి: రఘునాథరెడ్డి, సుదర్శన్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్లు

గత ప్రభుత్వంలో బిందుసేద్యం అమలుకు చిన్న సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాల్లోపు 90 శాతం, 5-10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం రాయితీ ఉండేది. ఈ ప్రభుత్వం పాత నిబంధనలను పునరుద్ధరించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ, 10 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం తుంపర సేద్యం పరికరాలు అందరు రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తాం.

# దస్త్రాలు మాయం.. బిల్లులు అందక దయనీయం



చెన్నేకొత్తపల్లి : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాక గుత్తేదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. 2016 నుంచి 2019 వరకు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో గుత్తేదారులు వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు. వీటికి కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. పూర్తి బిల్లులకు సంబంధించి అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించారు. డిపాజిట్లు, నాణ్యత ప్రమాణాల ధ్రువీకరణపత్రాలు పూర్తయ్యాయి. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లుల మంజూరుపై నిర్లక్ష్యం వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులకోసం గుత్తేదారులు అధికారులను సంప్రదించగా వాటికి సంబంధించిన సామాజిక దస్త్రాలు తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయం, ఉమ్మడి జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగినా అవి కనిపించలేదు. ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**చేపట్టిన అభివృద్ధి పనులు**

2014 నుంచి 2019 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మినీ గోకులం పశువుల షెడ్లు, సీసీదారుల నిర్మాణం, పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, ధోబీఘాట్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, చెక్‌డ్యామ్ తదితర పనులు చేపట్టి పూర్తి చేశారు. సీకేపల్లిలో 61 సీసీ రోడ్లు రూ.6.29 కోట్లు, 8 పాఠశాలల ప్రహరీలు రూ.3.5 కోట్లు, 16 అంగన్‌వాడీ భవనాలు రూ.1.12కోట్లు, 6 ధోబీఘాట్లు రూ.27 లక్షలు, 13 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు రూ.34 లక్షలతో పనులు పూర్తి చేశారు. వాటి బిల్లులు గుత్తేదారులకు అరకొరగా అందాయి. మిగతా సొమ్ము మంజూరు కావాలంటే సామాజిక తనిఖీ దస్త్రాలు, క్వాలిటీ కంట్రోల్ దస్త్రాలు అవసరం. కొంతమంది గుత్తేదారుల వద్ద దస్త్రాలు లేక బిల్లుల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. అప్పులు చేసి పనులు నిర్వహించామని గుత్తేదారులు వాపోతున్నారు.

**రూ.5.20 లక్షలు రావాల్సి ఉంది: వెంకటేశులు, గుత్తేదారు**

పులేటిపల్లిలో అభివృద్ధి పనులు పెద్దఎత్తున నిర్వహించాం. స్థానికుడైన కేశవరెడ్డితో కలిసి రూ.15 లక్షల అంచనా వ్యయంతో సీసీదారులు నిర్మించాం. ఒక దఫా రూ.9.80 లక్షల బిల్లు మంజూరైంది. సామాజిక ఆడిట్ సిబ్బంది వచ్చి దారులను తనిఖీ చేశారు. తరువాత వైకాపా అధికారంలోకి వచ్చింది. తాము తెదేపా వాళ్లమన్న ఉద్దేశంతో బిల్లులు మంజూరు చేయలేదు.

**దస్త్రాలు ఉంటేనే మంజూరు: విజయేంద్ర ప్రసాద్, డ్వామా పీడీ**

డ్వామా కార్యాలయాలతోపాటు ఇతర ఉన్నతాధికారులకు సామాజిక తనిఖీ దస్త్రాలు అందిస్తారు. చెన్నేకొత్తపల్లి కార్యాలయంలో అవి మాయమైన విషయాన్ని అధికారులను విచారిస్తాం.

# రెట్టింపు దోపిడీ

చోడవరం : వేసవి సెలవులే కదా అని నలుగురు పిల్లలు పశువులను తోలుకుని శారదా నది ఒడ్డుకు వెళ్లారు. పశువులు మేత మేస్తున్నాయి. ఖాళీగా కూర్చోవడం ఎందుకని నలుగురూ నదిలో స్నానాలకు దిగారు. ఇసుక కోసం తవ్విన గోతిలో చిక్కుకుని ఊపిరాడక మృత్యువాత పడ్డారు. చోడవరం మండలం ముద్దుర్తి సమీపంలో ఈ ఘటన గతంలో చోటుచేసు కుంది. ఇటుకల తయారీ పరిశ్రమలో పని చేసేందుకు ఒడిశా నుంచి వచ్చిన ఓ కూలీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదికి వెళ్లాడు. నీటిలో దిగిన చోట ఊబిలాంటి గొయ్యి ఉండటంతో పట్టుతప్పి మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గౌరీపట్నంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన ముగ్గురు వేర్వేరు సందర్భాల్లో నదిలో నీట మునిగి మృతి చెందారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరిగింది. ఇసుక ధర చుక్కలను తాకి సామాన్యులను అందుబాటులో లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితం చేయడంతో అందరూ సంతోషించారు. స్థానికంగా ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా తవ్వి, తరలించవచ్చన్న వెసులుబాటును ఇసుక అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. స్థానికత పేరుతో రెట్టింపు దోపిడీకి పాల్పడుతూ అక్రమార్జన చేస్తున్నారు. శారదా నదిలో అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలతో జన్నవరం, గవరవరం, లక్కవరం, గజపతి నగరం పరివాహక ప్రాంతాలు మృత్యుకుహరాలుగా మారాయి. చోడవరం మండల పరిధిలో పది మంది వరకు నదిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతుల్లో చిక్కుకుని ప్రాణాలు విడిచారు. వీరిలో ఆరుగురు పిల్లలే. పశువులు కాసేందుకు వెళ్లి ఈతకొట్టేందుకు, స్నానాలు చేసేందుకు నీటిలో దిగి తల్లిదండ్రులకు తీరం శోకం మిగిల్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరంతా నదీ పరివాహక, కొండను ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన వారే కావడం గమనార్హం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు



ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. శారదా నది, కంకర కోసం కొండలను గుల్ల చేస్తుండటంతో ఏర్పడిన గోతులు ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. నర్సాపురం వద్ద కొండను పూర్తిగా డొల్ల చేశారు. పెద్ద పెద్ద సొరంగాలుగా కొండ దిగువ ప్రాంతాలున్నాయి. కొండ అంచున రాళ్లు దొర్లి పడేలా ఉన్నాయి. ఇక్కడకు సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉంది. అటుగా వెళ్లేందుకు పిల్లలు భయపడుతున్నారు. గోవాడలో కొండ దిగువ ప్రాంతాలను చదును చేసి ఆవాసాలకు అనుకూలంగా మార్చేందుకు పలువురు కంకర తవ్వకందారులను ప్రోత్సహించారు. సీమునాపల్లిలో ఇసుక తవ్వకాలతో శారదా నది గర్భం 30 అడుగుల లోతుకు పడిపోయింది. గవరవరం, లక్కవరం గ్రామాల వద్దా ఇదే పరిస్థితి. నదీ పరివాహక ప్రాంతాలకు చెందిన రైతులు సాగు భూములంటూ నది భూభాగాన్ని ఇసుక తవ్వకందారులకు విక్రయిస్తున్నారు. తవ్వకాలతో నది లోతుగా మారి పంట కాలువలకు నీరందడం లేదు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్టవేయాలని జనసేన, సీపీఐ నాయకులు కోరుతున్నారు.

# సేవలకు మధ్యేమార్గం

కర్నూలు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూతన విధానాలు ప్రవేశపెట్టినా మధ్యవర్తులకు అడ్డుకట్ట పడటం లేదు. రిజిస్ట్రేషన్, ఇతరత్రా సేవల్లో వారి జోక్యం తప్పనిసరిగా మారింది. కూటమి ప్రభుత్వం ఇటీవల స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం ప్రవేశపెట్టినప్పటికీ వివిధ సమస్యల నేపథ్యంలో జనం వారినే ఆశ్రయిస్తున్నారు.

**ప్రచారం లేక పాట్లు**

ప్రస్తుతం అమలులో ఉన్న స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ 72 స్లాట్లకే అనుమతి ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. స్లాట్ బుకింగ్ చేసుకోకుండా నేరుగా వెళితే ఇబ్బంది పెడుతున్నారు. సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల కోసం జనం మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కర్నూలులో ఈ సమస్య ఎక్కువగా ఉంది. స్లాట్ బుకింగ్ విధానంపై పెద్దగా ప్రచారం చేయకపోవడంతో చాలామందికి దీనిపై అవగాహన కరవైంది.

**దళారులను సంప్రదిస్తేనే..**

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం దళారులకు మరో అవకాశంగా మారింది. బుకింగ్ చేసేందుకు పలువురు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. స్లాట్ బుకింగ్‌పై చాలామందికి అవగాహన లేదు. దీనిని దళారులు అవకాశంగా చేసుకుంటున్నారు. కొందరికి అవగాహన ఉన్నా స్లాట్ నమోదు చేసుకునే క్రమంలో పొరపాట్లు జరుగుతుండటంతో దళారులను ఆశ్రయించక తప్పటం లేదు. రిజిస్ట్రేషన్‌తోపాటు స్లాట్ బుకింగ్‌కు మామూళ్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



**నిఘా ఉత్తిదే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతిరోజూ 500 రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. అత్యధికంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని కర్నూలు, కల్లూరు కార్యాలయాల్లో 150 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో మధ్యవర్తులు, దస్తావేజులేఖరుల ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. గతంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కొందరు దస్తావేజులేఖరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు బయటపడింది. 2022, ఏప్రిల్ 27న అవినీతి నిరోధకశాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేసిన సందర్భంలో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.41,470 అనధికార డబ్బు, కల్లూరు కార్యాలయంలో ఓ బీరువా వెనుక రూ.40 వేల నగదుతో పాటు మధ్యవర్తుల వద్ద మరో రూ.19,330 గుర్తించి సీజ్ చేశారు. కల్లూరు కార్యాలయంలో దొరికిన అనధికార డబ్బు అవినీతి సొమ్ముగా నిర్ధారించి కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మధ్యవర్తులను కట్టడి చేసే ఉద్దేశంతో అదే ఏడాది మేలో ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి విజయవాడలోని రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ కార్యాలయానికి అనుసంధానం చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా మధ్యవర్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

# తొలకరి చినుకులు.. నిండుకున్న ఎరువులు

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేసవిలోనే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో పంటలు పెద్దఎత్తున సాగవుతాయని అంచనా వేస్తున్నారు. కానీ అవసరాలకు తగ్గట్టు ఎరువుల సరఫరా కావడం లేదు. గత కొన్ని నెలలుగా యూరియా సరఫరా ఆగిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

**నిల్వలు అరకొరే** ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. త్వరలో ఖరీఫ్ మొదలుకానుంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఖరీఫ్ నుంచి రబీ వరకు కర్నూలు జిల్లాలో 2,34,141 మె.టన్నులు, నంద్యాల జిల్లాలో 3,36,292 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని గోదాముల్లో కేవలం 75,665 మె.టన్నుల ఎరువులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**యూరియా.. ఊసే లేదయా**

ఉమ్మడి జిల్లాకు ఎంతమేర యూరియా అవసరమన్న ప్రతిపాదనలు రూపొందించలేదు. రాష్ట్రానికి ఏమేర ఎరువులు అవసరమన్న విషయాన్ని కేంద్రం అడగకపోవడంతో ఉన్నతాధికారులు జిల్లా నుంచి వివరాలు తీసుకోలేదన్న ప్రచారం ఉంది.గతేడాది నంద్యాల జిల్లాకు 1,16,816 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా 1,09,518 మె.టన్నులు సరఫరా చేశారు. కర్నూలు జిల్లాకు 95,876 మె.టన్నులు అందజేశారు. ప్రస్తుతం ఖరీఫ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు 1.47 లక్షల మె.టన్నుల యూరియా అవసరమని అంచనా.

**పెరగనున్న సాగు విస్తీర్ణం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6.75 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సాగు పెరగనుంది. సాధారణంగా రైతులు పంటలు వేసిన తర్వాత జూన్, జులైలో యూరియాను అధికంగా వాడుతారు. ఆగస్టు, సెప్టెంబరులో వరి, మిరపకు ఎక్కువ మోతాదులో వినియోగిస్తారు. గతేడాది ఇదే సమయానికి కర్నూలు జిల్లాలో 10 వేల మె.టన్నుల యూరియా నిల్వలు ఉండగా ప్రస్తుతం 5 వేల మెట్రిక్ టన్నుల్లోపే ఉన్నాయి. నంద్యాల జిల్లా పరిధిలో గతేడాది 20 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉండగా.. ఈసారి 6 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**మూడు నెలలుగా రాక..**

ఉమ్మడి జిల్లాకు గత మూడు నెలలుగా యూరియా సరఫరా కాలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు కొద్దిగా కాంప్లెక్స్ ఎరువులు వచ్చినప్పటికి యూరియా మాత్రం రాలేదు. మార్చి నుంచి ఇప్పటి వరకు ఒక్క రైల్వే ర్యాక్ కూడా రాకపోవడం గమనార్హం. ఖరీఫ్ సాగు పెరిగే అవకాశాలున్నప్పటికీ యూరియా సరఫరా కానరావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# కాసుల డీజిల్

అమలాపురం : పొరుగున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమ మార్గాల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ధరలో వ్యత్యాసం ఉండటంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. యానాం చెంతన ఉన్న ఐ.పోలవరం మండలం నుంచి ముమ్మిడివరం, అమలాపురం చుట్టుపక్కల మండలాలకు నిత్యం వేల లీటర్లు అక్రమంగా తరలిస్తున్నారు. కోనసీమలో ఆక్వా సాగు పెద్ద ఎత్తున ఉండటంతో చెరువుల వద్ద జనరేటర్లలో భారీగా డీజిల్ వినియోగిస్తారు. వీరికి అవసరమైన డీజిల్ యానాం నుంచి ఇక్కడికి అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నారు. పెట్రోల్ సైతం తెస్తున్నారు. దీంతో పోల్చితే డీజిల్ పరిమాణం ఎక్కువ. బంకుల్లో లూజు విక్రయాలపై నిషేధం ఉన్నా.. యానాంలో వాటిని పట్టించుకోవడం లేదు. రవాణా సమయంలో కొందరు సిబ్బంది డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వాహనాలు ఎక్కడైనా ప్రమాదానికి గురైతే భారీ నష్టం తప్పదు. వేసవి నేపథ్యంలో మరింత ముప్పు ఉంది.

**దొరికింది కొంతే..**

కోనసీమలోని తీర ప్రాంతాల్లో నదీమార్గంలో పడవలు, బోట్లు ద్వారా, ఇతర ప్రాంతాల్లో రోడ్డు మార్గంలో ఈ అక్రమదందా సాగుతోంది.



నిత్యం వేల లీటర్ల డీజిల్ అక్రమంగా యానాం నుంచి వస్తోంది. ఎక్కువ మంది పోలీసుల కన్నుగప్పి గమ్యం చేరుతున్నారు. అలాంటి వారికి కొంతమంది సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా మరింత నిఘా పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఇక్కడి బంకుల్లో విక్రయాలు తగ్గి..**

యానాం నుంచి అక్రమంగా ఇంధనం వస్తుండటంతో కోనసీమ శివారు ప్రాంతాల్లోని పెట్రోలు బంకులు మూతపడుతున్నాయి. 216 జాతీయ రహదారి చెంతనే ఉన్న బంకులకు పెద్ద ఇబ్బంది లేకపోయినా, శివారు మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు తదితర మండలాల్లోని కొన్ని బంకుల్లో అమ్మకాలు భారీగా తగ్గడంతో మూసివేసే పరిస్థితికి వస్తున్నాయి. **ఎవరినీ ఉపేక్షించం..** యానాం నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు తరలించే వారిని ఉపేక్షించం. వీటి అక్రమ రవాణా కారణంగా ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనాల్లో ఇంధనం తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.
–టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

# అతివేగం.. అంతులేని అనర్థం

చిత్తూరు : తిరుపతి జాతీయ రహదారిలో ముందు వెళ్తోన్న కంటైనర్‌ను అధిగమించే ప్రయత్నంలో కారు ఢీ కొట్టింది. అందులో ఉన్న ఏడుగురిలో అయిదుగురు ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. ఆ సమయంలో దాదాపు 110– 120 కి.మీ. వేగంతో కారు ప్రయాణిస్తోంది. గాదంకి టోల్‌ప్లాజాకు మధ్యాహ్నం 1.17 గంటలకు చేరుకోగా ఆపై ఎనిమిది–తొమ్మిది నిమిషాలకే తోటపల్లి వద్ద దుర్ఘటన జరిగింది. అతివేగం, ముందున్న వాహనాన్ని త్వరగా అధిగమించి గమ్యస్థానానికి చేరాలన్న తొందరే ప్రమాదానికి కారణం. చిత్తూరు నగరం మురకంబట్టులో ముందు వెళ్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేగంకన్నా ప్రాణం మిన్న.. ఇదీ రవాణా శాఖ నినాదం. అటు ప్రయాణికులు దీన్ని పాటించడం లేదు. ఇటు అతివేగానికి అడ్డుకట్ట వేయాల్సిన రవాణా శాఖ పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిసిన మరుసటిరోజే వాటిని ఆశాఖ మరచిపోతుండటంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రహదారులు రక్తమోడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు–తిరుపతి, బెంగళూరు– చెన్నై, పలమనేరు– కుప్పం, రేణిగుంట–నాయుడుపేట, రేణిగుంట– చెన్నై జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. తరచూ ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మానవ తప్పిదాలతోపాటు అధికారుల నిర్లక్ష్యం, అలసత్వమే దీనికి ప్రధాన కారణం. రహదారుల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడం, నిబంధనలను అతిక్రమించిన వాహనాలను సీజ్ చేయడం వంటివి రవాణాశాఖ అధికారులు చేయలేకపోతున్నారు. పోలీసు అధికారులు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతూ జరిమానాలు విధిస్తున్నా.. ప్రజల్లో చైతన్యం తేలేకపోతున్నారు.

**అధిగమిస్తూ.. అదుపుతప్పుతూ..**

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. త్వరగా దేవుడిని దర్శించుకుని అంతే త్వరగా గమ్యస్థానానికి చేరుకుని విధులకు హాజరవ్వాలని హడావుడి పడుతుంటారు. ఒక్కోసారి దర్శనం ఆలస్యమైతే కారులో వచ్చే వ్యక్తులు నిర్ణీత వేగానికి మించి వెళ్తున్నారు. ముందున్న లారీలు, బస్సులను అధిగమించే క్రమంలో అదుపు తప్పుతున్నారు. కొన్ని సందర్భాల్లో వేరే వరుసలో ఉన్న వాహనాలను ఢీకొడుతున్నారు. వాహనదారులు రహదారిపై అప్రమత్తంగా ఉండటమే కాకుండా.. వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆగి ఉన్న వాహనాలతో..**

జిల్లాలోని రోడ్లు, రహదారుల పక్కనే దాబాలు, భోజనశాలలు, కొంత దూరంలో మద్యం దుకాణాలు ఉండటంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు రోడ్లపక్కనే ఆగుతున్నాయి. చిత్తూరు నుంచి తిరుపతి వరకు రహదారి పక్కనే ఈ తరహా పార్కింగ్ ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కనిపించని రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు**

చిన్న వాహనాల నుంచి భారీ వాహనాల వరకు వెనుకాముందు ఉండాల్సిన రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు చాలావరకు కనిపించడం లేదు. ఇవి ఉంటే రాత్రి సమయంలో చాలావరకు ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**బెంగళూరు నుంచి స్నేహితుడి కారులో..**

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హొసూరుకు చెందిన త్యాగరాజన్, బెంగళూరు సౌత్ గౌడనపాళ్యకు చెందిన బీఎస్ సహాన మధ్య ఓ హెల్త్ కంపెనీలో పనిచేసే సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత రెండు కుటుంబాల మధ్య స్నేహం కొనసాగుతోంది. సహాన భర్త ఎస్ఆర్ రజిని గౌడ సినీపరిశ్రమలో పనిచేస్తున్నారు. రజినిగౌడ, బీఎస్ సహాన కుటుంబం తిరుమలకు వెళ్లాలని త్యాగరాజన్‌కు చెప్పడంతో ఆయన తన కుమారుడు క్రిష్విన్‌తో బయలుదేరారు. ఈనెల 25వ తేదీ తనతో జీఆర్‌బీ డెయిరీ ఫుడ్స్‌లో పనిచేసే స్నేహితుడి కారు తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. మరుసటి రోజు రజినిగౌడ కుటుంబ సభ్యులు ఐదుగురితో కలిసి తిరుమలకు వచ్చారు. 28వ తేదీ వేకువ జామున శ్రీవారి దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతున్నట్లు మధ్యాహ్నం 12.30 గంటలకు త్యాగరాజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. **కుక్కల కోసం ఆగిపోయారు** త్యాగరాజన్ కుమారుడితోపాటు తన భార్యను తిరుమలకు రమ్మని పిలిచారు. అందరూ వెళ్తే ఇంట్లో ఉన్న రెండు కుక్కల బాధ్యత ఎవరు చూసుకుంటారని భార్య మీగల్ ఆగిపోయింది.

# జలం అందలేదు.. జీవనం మారలేదు!



అనకాపల్లి : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడొచ్చిందంటారు. గ్రామాల్లో ఇంటింటా కుళాయితో రక్షిత నీటిని అందిస్తామని బడాయి కబుర్లు చెప్పిన గత సర్కారు అసలుకే ఎసరు పెట్టినంత పనిచేసింది. జల్‌జీవన్ మిషన్‌లో ఇష్టారాజ్యంగా పైపులైన్ పనులు చేపట్టడంతో అప్పటివరకు సక్రమంగా నీరందే గ్రామాల్లోనూ తాగునీటి సమస్యలను తెచ్చిపెట్టింది. వీటిలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు కూడా ఉన్నాయి. రక్షిత నీరు సక్రమంగా అందక ఆయా గ్రామాల్లో స్థానిక నీటివనరులపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో ఫ్లోరైడ్ ముప్పు నుంచి పూర్తిగా బయటపడలేక పోతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు: రోలుగుంట, జానకీరాంపురం, కొమరవోలు, కె.నాయడిపాలెం, అంట్లపాలెం, కిలపర్తిపాలెం, ఎన్.కొత్తూరు, కొవ్వూరు, నిండుగొండ

జిల్లాలో రోలుగుంట మండలంలోనే ఎక్కువ ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలున్నాయి. ఇక్కడ భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ స్థాయిలో ఉండడంతో చాలామంది కాళ్లు, చేతులు వంకరగా మారిపోయాయి. చిన్న వయసులోనే దంతాల సమస్యలు, యుక్తవయసు దాటకుండానే ఎముకలు, కీళ్ల నొప్పుల బారిన పడినవారు ఉన్నారు. ఈ సమస్యను ఆలస్యంగా గుర్తించిన అధికారులు 2008లో జానకీరాంపురం వద్ద వరాహ నదిలో ప్రత్యేకంగా ఊట బావులు తీయించి అక్కడి నుంచి ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు నీటి సరఫరా చేయడం మొదలుపెట్టారు. మొదట్లో బాగానే నీటిని అందించగలిగినా తర్వాత క్రమంలో నిర్వహణ లోపాలు, విస్తరించిన గ్రామాలు, జనాభా పెరగడం, నీటి పథకాల చెంతనే ఇసుక తవ్వకాలు పెరిగిపోవడంతో ఈ గ్రామాలకు కొంతకాలంగా తగినంత నీటిని సరఫరా చేయలేపోతున్నారు.

'జల్‌జీవన్ మిషన్ పథకంలో అప్పటివరకు ఫ్లోరైడ్ గ్రామాల్లో ఉన్న జీఐ పైపులైన్లను తొలగించారు. రోడ్లను తవ్వేసి ప్లాస్టిక్ పైపులు వేశారు. అవి నాసిరకంగా ఉండటంతో తరచూ మరమ్మతులతో నీటి సరఫరాకు ఆటంకాలు వస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడోకచోట పైపులు లీకవ్వడం, వాటిని బాగుచేయడానికే సమయం సరిపోతోంది.'

శెట్టి సంధ్య, నిండుగొండ సర్పంచి ఆవేదన ఇదీ.


'ఇంటింటికీ కుళాయి అన్నారు ఏ ఇంటికీ నీరు సక్రమంగా అందడం లేదు. అస్తవ్యస్తంగా పైపులు వేయడంతో ఓ వీధికి నీరు వస్తే మరో వీధికి అందడం లేదు. మాలాటి వాళ్లం ఇళ్లల్లో నీటిశుద్ధి పరికరాలు పెట్టుకున్నాం. అందరూ అలా ఏర్పాటు చేసుకోలేరు కదా. ఫ్లోరైడ్ గ్రామాలపై ఇంత నిర్లక్ష్యం తగునా'

**కె.నాయుడుపాలెం మాజీ సర్పంచి చంద్రమౌళి ప్రశ్న ఇదీ**

ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా డీఈ అల్లు సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా గతంలో రూ. 6 కోట్లతో మరో నీటి పథకం ఏర్పాటుకు ప్రతిపాదించినా టెండర్ల దశ దాటకుండానే రద్దయిపోయాయి. తాజాగా వాటర్ గ్రిడ్‌లో ఈ గ్రామాలను చేర్చి సురక్షిత నీటిని అందించే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల జనాభా : సుమారు 18,000
చేతిబోర్లు : 270
గతంలో నిర్మించిన రక్షిత నీటిపథకం విలువ: రూ. 3.5 కోట్లు
రోజుకు సరఫరా చేయాల్సిన నీరు : 4.8 లక్షల లీటర్లు
ప్రస్తుతం సరఫరా చేస్తున్నది : 3 నుంచి 3.5 లక్షల లీటర్లు

# రైతులారా. . రారండోయ్



కాకినాడ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి కొత్తవి అందించాలనే ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. అలాగే, గత ప్రభుత్వం హయాంలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకూ మోక్షం కల్పించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 46,736 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఏటా పెరుగుతున్న వ్యవసాయ బోర్లకు అనుగుణంగా విద్యుత్తు కనెక్షన్లు సకాలంలో అందించలేకపోతున్నారు. దీంతో పంటల సాగులో తీవ్ర ప్రతికూల పరిస్థితులు పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ బోర్లకు సంబంధించి ఒక్కొక్క రైతు 5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటారును వినియోగించుకుంటారు. దీనికి గాను 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. కండక్టర్, ఇన్సులేటర్లు, స్తంభాలు తదితర ఖర్చులన్నీ కలిపి సుమారు రూ.2.30 లక్షల వరకు అవుతుంది. దీంతో పాటుగా 11కేవీ, ఎల్‌టీ 180 మీటర్లు వరకు సుమారు రూ.1.40 లక్షలు ఖర్చు అవుతుంది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోరిన చోట ఒక్క రైతు ఉన్నా కనెక్షన్ ఇచ్చేందుకు రూ.3.70 లక్షలు డిస్కంలు భరిస్తున్నాయి. 25 కేవీ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన చోట నలుగురు రైతులు వ్యవసాయ కనెక్షన్లు కోరితే ఇచ్చేందుకు వీలుంది. ఒక్కో కనెక్షన్‌కు 180 మీటర్ల 11 కేవీ లైన్ డిస్కం ఏర్పాటు చేసే సమయంలోనే.. సగటున 5 స్తంభాలు అవసరమైతే వాటిలో మూడు స్తంభాలు ఉచితంగా ఇస్తారు. ఉదాహరణకు 180 మీటర్ల లైను దాటి 200 మీటర్లు వరకు లైను పెరిగితే ఆ 20 మీటర్ల ఖర్చును రైతు భరిస్తే సరిపోతుంది.

**రూ.5.5 కోట్లు ఖర్చు** గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికే పెండింగ్‌లో ఉన్న వాటిలో 354 కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలోని 18 మండలాల్లో 511 కనెక్షన్ల కోసం అన్నదాత ఇంకా ఎదురుచూస్తున్నారు వీటికోసం సుమారుగా రూ.5.5 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేయనుంది. మెట్ట మండలాలు రంగంపేట, గోకవరం, రాజానగరం, దేవరపల్లి, గోపాలపురం తదితరచోట్ల ప్రతి రైతుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాల్సిన సమయంలో ప్రభుత్వానికి మరింత ఖర్చు పెరగనుంది.

**కొత్త కనెక్షన్లకూ దరఖాస్తులు**

ఇప్పటివరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు అందించడంతో పాటు రైతుల నుంచి కొత్తవాటికి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో ఒక్క రైతు కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నా 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్, లైన్లు ఏర్పాటు చేసేందుకు సుమారుగా రూ.3.70 లక్షల ఖర్చు భరించనున్నాం. అలా ఏర్పాటుచేసిన చోట మరో ఇద్దరు రైతులు కొత్త కనెక్షన్లు పెట్టుకుంటే వెంటనే ఇచ్చేందుకు వీలుంటుంది.– కె.తిలక్‌కుమార్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, తూర్పుగోదావరిజిల్లా

# కష్టం తీరాలి.. మత్స్యారే అనాలి

కాకినాడ : సుదీర్ఘ సాగర తీరం, గోదావరి పరివాహకం ఉన్న ఉమ్మడి జిల్లాలో మత్స్యరాశులనే నమ్ముకుని బతుకుతున్నవారి జీవనచిత్రం మారడంలేదు. చేపల వేటలో నైపుణ్యాలు పెంచుకోలేక.. చేతికొచ్చిన సంపదను సొమ్ముచేసుకోలేక సతమతమవుతున్నారు. వసతుల లేమి.. శీతల గిడ్డంగులు చెంత లేక వేటలో దక్కించుకున్న మత్స్యసంపద ఎంతోకొంతకు అమ్ముకోవాల్సి వస్తోంది.

**నైపుణ్యం.. ఆదాయం ప్రాప్తిరస్తు..**

ఉమ్మడి జిల్లాలో సముద్రంతోపాటు రొయ్యల చెరువుల నుంచి ఏటా 1.30 లక్షల టన్నుల నిల్వలు సేకరిస్తున్నారు. ఈ వ్యాపారం రూ.3,900 కోట్ల వరకు సాగుతోంది. రోజుకు 27,426.50 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో పది ప్రైవేటు కోల్డ్ స్టోరేజీలు ఉన్నా.. వీటిని మత్స్యకారులు ఉపయోగించుకునే పరిస్థితి లేదు. పలుచోట్ల చేపల రేవులను నిర్మించే వెసులుబాటు ఉన్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రూ.422 కోట్లతో నిర్మిస్తున్న చేపలరేవు నిర్మాణం కొలిక్కివస్తే మౌలిక సదుపాయాలతోపాటు.. మత్స్యసంపద పెరిగి.. చేపలు నిల్వచేసుకోవచ్చు.



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లెపాలెంలోని మినీ ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లో శీతల గిడ్డంగి, ఐస్ తయారీ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 3 వేల మంది మత్స్యకారులకు మేలు. ఓడలరేవు, ఉప్పలంక, మట్లపాలెం, కోనపాపపేట మెరైన్ ఇన్‌ల్యాండ్ సెంటర్లలో వసతులు మెరుగుపడాలి.

ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో 61, గ్రామీణ ప్రాంతాల్లో 55 చేపల బజార్లు ఉన్నాయి. ఇక్కడ శీతల గిడ్డంగులు ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుంది.

# బాప్‌రే.. యాప్

చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీకి తిప్పలు తప్పడం లేదు.. ప్రతి నెలా మొదటి శుక్రవారానికి పూర్తి కావాల్సిన పంపిణీ, ఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నా 84.6 శాతం మాత్రమే పంపిణీ చేశారు.. పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత ధ్రువీకరణ హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చింది.. సరకులు అందించే సమయంలో యాప్ సక్రమంగా పనిచేయకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సేవలు సరిగా లేక గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు పలుమార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సి వస్తోంది.

గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు తప్పక నమోదు చేసుకోవాలి. వారి వివరాలను సిబ్బంది బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మిల్క్ యాప్‌లలో నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా వారికి పోషకాహార కిట్లు అందజేస్తారు. ప్రతి నెలా 15వ తేదీలోగా నమోదైన లబ్ధిదారులకు మాత్రమే తర్వాత నెల పోషకాహార కిట్లు ఇస్తారు. యాప్ సమయానికి పనిచేయక 15వ తేదీ తర్వాత పేర్లు నమోదు చేస్తున్న వారికి పోషకాహారం అందడం లేదు.

**పంపిణీ ఇలా..**

బాలింతలకు ప్రతి నెలా రాగి పిండి 2 కిలోలు, అటుకులు కిలో, బెల్లం పావు కిలో, ఎండు ఖర్జూరం, చిక్కీలతో పాటు బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, అరలీటరు నూనెను.. పౌరసరఫరాల శాఖ నుంచి అందజేస్తున్నారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంకా



15.4 శాతం మంది లబ్ధిదారులకు కిట్లు అందాల్సి ఉంది. వాటికోసం వారు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

**పని చేయని చరవాణులు..** లబ్ధిదారులకు ముఖ ఆధారిత హాజరు నమోదుతో సరకులు అందజేస్తారు. గత ప్రభుత్వం నాసిరకమైన చరవాణులు సిబ్బందికి అందజేసింది. ఇవి పనిచేయక కార్యకర్తలు సొంత ఫోన్లలో యాప్‌లు నిక్షిప్తం చేసుకున్నారు. దీనికి ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే 2 జీబీ డేటా చాలడం లేదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. దీనివల్ల అదనపు భారం తమపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాం.. – వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో యాప్‌ల నిర్వహణపై ప్రారంభంలో సమస్యలు ఎదురయ్యాయి. వాటిని క్రమంగా పరిష్కరించాం. ప్రతి నెలా మొదటి శుక్రవారంలోగా పోషకాహార పంపిణీ పూర్తిచేయాలి. ఇప్పటి వరకూ 84.6 శాతం పంపిణీ చేయించాం. మిగిలిన వారికీ ఒకట్రెండ్రోజుల్లో అందజేస్తాం.

# నిర్వహణ 'కసరత్తు' మరిచారు

కర్నూలు : ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి.. కారణాలేవైనా పట్టణవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రోజుకు కనీసం 20 నిమిషాలైనా వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. 'కసరత్తు' చేసేందుకు పట్టణాల్లో పార్కులకు వచ్చేవారికి సంఖ్య పెరిగింది.. కొందరు ఉదయం, మరికొందరు సాయంత్రం వస్తున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని బహిరంగ వ్యాయామశాలలు (ఓపెన్ జిమ్) ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ గాలికొదిలేశారు. గ్రీజు పూయడం లేదు.. బోల్టులు పోయినా బిగించడం లేదు.. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా. పుర అధికారులు పట్టించుకోవడం లేదు.

**బిగించారు.. వదిలేశారు**

ఒక్కో పార్కు నిర్మాణానికి రూ.20–40 లక్షలు ఖర్చు చేశారు. వీటిలో పచ్చదనం పెంపు, బల్లల ఏర్పాటు, కొన్ని చోట్ల వ్యాయామ పరికరాలు అందించింది. వాటిలో ఎయిర్ వాకర్, క్రాస్ వాకర్, సైకిల్, చెస్ట్ ప్రెస్ డబుల్, హార్స్ రైడర్, సిట్ ఆఫ్ బోర్డు డబుల్, ట్రిపుల్ ట్విస్టర్, ఆర్మ్ షోల్డర్ డబుల్, సర్ఫేస్ బోర్డు ఇలా ఆరు నుంచి పది రకాల వ్యాయామ పరికరాలు అందించారు. ఒక్కో పరికరం విలువ సుమారు రూ.7–8 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుంది. పుర అధికారులు నిర్వహణ చేపట్టకపోవడంతో పాడైపోతున్నాయి.

**వృథాగా పడి ఉన్నాయి**

ఎమ్మిగనూరు పురపాలక సంఘం వీవర్స్ కాలనీలో రూ.20 లక్షలు వ్యయంతో పార్కు నిర్మించి, 14 రకాల వ్యాయామ పరికరాలు బిగించారు. వీటి పర్యవేక్షణ గాలికొదిలేయడంతో నాలుగు పరికరాలు



దెబ్బతిన్నాయి. మరికొన్ని పరికరాల బోల్టులు వదులుగా మారి, ఎప్పుడు విరిగిపోతాయో తెలియని పరిస్థితి.

**గోడ కట్టేశారు** ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పార్కు కోసం కేటాయించిన 30 సెంట్ల స్థలాన్ని గతంలో వైకాపాకు చెందిన కౌన్సిలరు కబ్జాకు యత్నించారు. స్థానికుల ఫిర్యాదుతో మేల్కొన్న పుర అధికారులు రూ.20 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మించారు. రూ.25 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు చేపట్టిన గుత్తేదారు ఇంతవరకు ఆరంభించలేదు.

**రూ.2 కోట్లు ఖర్చు.. పనికొస్తే ఒట్టు**

నగరంలో 52 వార్డులు ఉండగా.. 150కిపైగా ఉద్యానవన స్థలాలు ఉన్నాయి. అందులో 50 పార్కులు అభివృద్ధి చేశారు. నిర్వహణ కానరావడం లేదు. నగర పరిధిలో సుమారు ఎనిమిదేళ్ల కిందట పలు ఉద్యానవనాల్లో వ్యాయామ పరికరాలు అమర్చారు. రెండేళ్ల కిందట 35 పార్కుల్లో ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. పరికరాలు నాణ్యమైనవి కాకపోవడంతో చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. అదేవిధంగా నిర్వహణ సరిగా లేకపోవడంతో **తుప్పు పడుతున్నాయి**

గుడూరు నగర పంచాయతీకి ఐదేళ్ల కిందట వ్యాయామ పరికరాలు ఇచ్చారు.. ఇక్కడ పార్కు లేకపోవడంతో పుర కార్యాలయంలో వృథాగా పడేశారు. అవన్నీ తుప్పు పడుతున్నాయి.

చురకలు



## నిధులున్నా నిర్లక్ష్యమెందుకో..?

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వ హయాంలో నిధుల్లేక పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులున్నాయి. కొన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిధులు పుష్కలంగా విడుదలవుతున్నా నిర్మాణాల్లో గుత్తేదారు సంస్థల నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. దీనికి రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల ప్రధాన భవనం పనులే నిదర్శనం. 2022లో రూ.450 కోట్లతో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవన నిర్మాణం ప్రారంభించారు. విద్యార్థుల బోధనకు తాత్కాలిక భవనం, ఆసుపత్రి ఆధునికీకరణ, అయిదు అంతస్తుల వసతి గృహాల భవనాలు, మాతాశిశు భవనంపై రెండంతస్తుల బ్లాకులు నిర్మించారు. ఆసుపత్రి పక్కన కేంద్ర కారాగారం స్థలంలో రూ.90 కోట్లతో వైద్య కళాశాల ప్రధాన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఈ ఆగస్టు నెలకు పూర్తిస్థాయిలో అన్ని వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉంది. వీటికి సంబంధించి కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నా గుత్తేదారు



సంస్థ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవనం అందుబాటులోకి రాకుంటే వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేటప్పుడు వైద్యవిద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మూడు, నాలుగు నెలల్లో ఇది పూర్తిస్థాయి వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉండగా.. ఇదేమాదిరి పనులు జరిగితే భవనం పూర్తయ్యేసరికి మరో ఏడాది పట్టే అవకాశం ఉందని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు నిర్మాణాలపై పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పనులు జరిగేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నా గుత్తేదారు సంస్థ తీరు నత్తనడకన సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

## హరిత వనాలుగా విద్యాలయాలు

పామర్రు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కూరగాయలు, ఆకుకూర తోటల పెంపకం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఐఎంఎంఎస్ యాప్‌లో కిచెన్ గార్డెన్ అవసరం, ఖాళీ స్థలం వివరాలు, వీటి నిర్వహణకు కమిటీని రూపొందించి సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. హరిత వనాలుగా, పోషకాహార తోటల పెంపక క్షేత్రాలుగా మార్చడానికి జిల్లాలో 858 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.5000 చొప్పున మొత్తం రూ.42.90 లక్షలు ఆయా మండల విద్యాశాఖాధికారి1 ఖాతాలకు సోమవారం వేశారు. వీటిని పాఠశాలల యాజమాన్య ఖాతాలకు జమ చేస్తారు. ఇప్పటికే అమ్మకోసం ఒక మొక్క పేరుతో పలు పాఠశాలల్లో పండ్ల



మొక్కలు నాటారు.

**మొక్కలు, పాదుల పెంపకం వివరాలు**

ప్రధానోపాధ్యాయులు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ శాఖ నర్సరీలకు వెళ్లి మొక్కలు తెచ్చుకుని పాఠశాలలో నాటి, పెంచాల్సి ఉంటుంది. నాటిన మొక్కల వివరాలను 'ఫారెస్ట్.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరచాల్సి ఉంటుంది. ధవళేశ్వరం (రాజమహేంద్రవరం), పళ్ల కడియం (రాజానగరం), పేరూరు, కామనగరువు (అమలాపురం), కట్టుంగ, మెర్లపాలెం (ఆత్రేయపురం), శ్రీరామపురం (కపిలేశ్వరపురం), అవిడి (కొత్తపేట మండలం)లో మొక్కల పెంపకం నర్సరీలున్నాయి. వీటి నుంచి జామ, మామిడి, సపోట వంటి పండ్ల మొక్కలు తెచ్చి నాటతారు. ఉద్యానశాఖ నుంచి వంగ, బెండ, బీర, కాకర, ఆనప, తోటకూర, పాలకూర, గోంగూర తదితర కూరగాయల విత్తనాలు ఒక కిట్‌గా స్థలమున్న పాఠశాలలకు అందించనున్నారు.

## అటుగా పో'దారంటే'.. అవట్లేదు!

కాకినాడ : కాకినాడలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పలు పనులు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. రూ.90 కోట్లతో 2018-19లో నిర్మించిన వసలపాకల-పోర్టు రైల్వేస్టేషన్ రోడ్డు మాత్రం నిరుపయోగంగా ఉంది. రోడ్డులో కొంత మేర పనులు అసంపూర్తిగా వదిలేయడంతో లక్ష్యం నెరవేరలేదు. వలసపాకల ప్రధాన రోడ్డు నుంచి ఆర్టీవో కార్యాలయం, డెయిరీ ఫారం సెంటర్, పోర్టు రైల్వేస్టేషన్ మీదుగా జగన్నాథపురం వంతెన రోడ్డుకు అనుసంధానంగా దీని నిర్మాణం చేపట్టారు. 9 కి.మీ. పొడవుగల ఈ రోడ్డును స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఈ రోడ్డును నిర్మించారు. సర్పవరం జంక్షన్ వైపునుంచి అమలాపురం, రామచంద్రపురం వైపువెళ్లే ప్రయాణికులు మెయిన్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించేందుకు నిర్ణయించారు. అమలాపురం, రామచంద్రపురం వైపునుంచి వచ్చే వాహనాలు కూడా నగరంలోకి కాకుండా ఈ రోడ్డు మీదుగా పిఠాపురంవైపు వెళ్లవచ్చు. ఇంతటి ప్రయోజనకరమైన రోడ్డును గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేవలం అర కిలోమీటరు మేర పూర్తి చేయలేకపోయారు. వాస్తవానికి ఈ రోడ్డులో కొంత స్థలం రైల్వేశాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రోడ్డును పూర్తి చేయాల్సిఉంది. గత తెదేపా హయాంలో అనుమతులకోసం ప్రయత్నిస్తుండగానే.. ప్రభుత్వం మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే కొండబాబుకు వివరించగా రహదారిపైకొచ్చిన చెత్తను శుభ్రం చేయించారు. దాంతో కాస్త మార్గం ఏర్పడింది.

**కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మించాం. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కట్టడి, దుమ్ములపేట, సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలవారు జగన్నాథపురంవైపు వెళ్లేందుకు దగ్గరి దారికోసం దీనిని నిర్మించాం. గత పాలకులు అర కి.మీ. రోడ్డును నిర్మించలేకపోయారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా. పూర్తి చేయిస్తాం.
- వనమాడి కొండబాబు, కాకినాడ ఎమ్మెల్యే

# స్వచ్ఛతకు తూట్లు.. 'ఆటో'పాట్లు



అనంతపురం : పల్లెసీమలు పరిశుభ్రంగా ఉంచి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తీసుకొని రావాలనే ఆశయాన్ని వైకాపా సర్కారు నీరు గార్చింది. ఉమ్మడి అనంత జిల్లాలో 2,500 జనాభాపైగా ఉన్న గ్రామాల్లో బ్యాటరీతో నడిచే పవర్ ఆటోలు ఇవ్వాలని గత తెదేపా ప్రభుత్వం సంకల్పించింది. చెత్తను తరలించడంతో పాటు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోలు అందించింది. 2018-2019 ఆర్థిక సంవత్సరంలో వాహనాలు వచ్చాయి. ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రాగానే ఆటోలను పక్కన పడేశారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాలతోపాటు వైకాపా మద్దతుదారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఉంచడం గమనార్హం.

**రాయితీ వచ్చినా..ఉపాధి దక్కలే..**

ఒక ఆటో రూ.2.10 లక్షలు. ప్రభుత్వం 60 శాతం రాయితీ ఇవ్వగా.. 40 శాతం బ్యాంకు ద్వారా రుణం అందించారు. ఒక్కో ఆటోకుగాను నెలకు సంబంధిత ఎంపీడీఓ నుంచి రూ.10 వేలు ఎస్సీ కార్పొరేషన్‌కు పంపితే లబ్ధిదారుకు రూ.8వేలు వేతనంతో పాటు రూ.2వేలు బ్యాంకు రుణం చెల్లిస్తారు. ఐదేళ్ల వైకాపా హయాంలో పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను మళ్లించి... సర్కారే వాడేసుకొంది. రూ.కోట్లు వెచ్చించి సరఫరా చేసిన ఆటోలు మూలకు చేరాయి.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం..**

ఉమ్మడి జిల్లాలో వృథాగా ఉన్న ఆటోలను ఏవిధంగా వినియోగించాలో కలెక్టరు, ఎండీ దృష్టికి తీసుకెళతాం. చాలాచోట్ల బ్యాటరీలు పని చేయడం లేదు. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే తగిన చర్యలు తీసుకుంటాం. రాధిక, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

**స్పందన కొరవడి..**

కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మారుతికి బ్యాటరీతో నడిచే ఆటో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైంది. మరమ్మతు చేయించినా వాహనం కదులుతుందో లేదో తెలియని విధంగా మారింది. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని లబ్ధిదారు వాపోయారు.

**ఎస్సీ కార్పొరేషన్ ప్రాంగణంలోనే 60**

అనంతపురంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోనే ఆరేళ్లుగా చెట్ల కిందే 60 పవర్ ఆటోలు ఉండటం గమనార్హం. తెదేపా హయాంలో కొన్ని గ్రామాలకు సరఫరా చేయగా మిగిలిన వాటినే అలాగే ఉంచారు.

**ఒక్క రోజైనా... ఉరవకొండలో..**

ఉరవకొండ మండలానికి ఐదేళ్ల క్రితం నాలుగు ఆటోలు మంజూరు అయ్యాయి. వాటిని ఆయా పంచాయతీలకు ఇవ్వకుండా పట్టణంలోని మేజరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉంచారు. ఒక్క రోజు అయినా వినియోగించిన పాపాన పోలేదు. ఉరవకొండ

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం ఆటోలు: 362

వెచ్చించిన నిధులు:రూ.7.60 కోట్లు

ఏజెన్సీ సరఫరా చేసిన ఆటోలు: 353

లబ్ధిదారులకు పంపిణీ చేసింది: 232

పంపిణీ చేయకుండా మూలన పడేసినవి: 121

## కొడిగెనహళ్లి గురుకులం.. సీటు కోసం ఆరాటం



పరిగి : ఇది 50 వసంతాలు పూర్తిచేసుకున్న గురుకులం.. సీటు వస్తే చాలు వారి భవిష్యత్తు మారిపోయినట్లే.. ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ స్థిరపడ్డారు. ఎందరో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లన తయారు చేసిన ఘనత ఈ గురుకులానిది. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధిస్తుండంతో కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ర్యాంకుల బ్యాంకుగా గుర్తింపు పొందినందుకే ఇక్కడి సీటు కోసం విద్యార్థులు ఆరాటపడతారు.

**నాటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు చొరవతో..** 1972లో అప్పటి ముఖ్యమంత్రి పి.నరసింహారావు చొరవతో పరిగి మండలం కొడిగెనహళ్లిలోని పెన్నానది తీరాన ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్న వారంతా నిరుపేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులే.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో నాలుగేళ్లుగా పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలను సాధించి పెట్టారు. 2025లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఏపీఆర్ఎస్ గురుకులానికి తొమ్మిది మంది విద్యార్థులు వరుసగా 595, 595, 594, 593, 592, 591, 590, 590, మార్కులు సాధించి విజయభేరి మోగించారు. రాష్ట్ర స్థాయిలో ఏపీఆర్ఈఐ సొసైటీ పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలల్లో కెల్ల కొడిగెనహళ్లి గురుకులం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి పాఠశాలకు వన్నె తెచ్చారని ప్రిన్సిపల్ ఎన్.వి.మురళీధర్‌బాబు తెలిపారు.

**డాక్టరుగా పేద ప్రజలకు సేవలందిస్తా..**

అమ్మానాన్నలు షమీవుల్లా, అయిషాలు వ్యవసాయం చేస్తారు. మాది చిలమత్తూరు మండలం కొడికొండ. భవిష్యత్తులో ఏఐఎంఎస్ (న్యూదిల్లీలో మెడిసిన్ పూర్తి చేసి డాక్టరుగా ప్రజలకు సేవలు అందిచాలన్నదే నా ఆశయం. - ఆఫ్రిది (595)

**ఇంజినీరునవుతా..**

మాది కదిరి నియోజకవర్గంలోని గోకనపల్లి. నిరుపేద రైతు కుటుంబం. అమ్మానాన్న నూర్‌మహమ్మద్, నస్రీన్‌లు కూలీ పనులు చేస్తారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్ వేర్ ఉద్యోగం సంపాదించి ప్రజలకు సేవ చేయాలన్నదే నా అభిలాష. - అహ్మద్‌హుసేన్ (595)

**నాలుగేళ్లుగా ఉత్తమ ప్రతిభ**

గురుకుల పాఠశాల ప్రారంభమై 52 ఏళ్లు కావస్తోంది. నాటి నుంచినేటి వరకు పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల విద్యాప్రగతికి ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సహకారంతో పదోతరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు దోహద పడ్డాయి. నాలుగేళ్ల నుంచి వరుసగా పది ఫలితాల్లో ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ పాఠశాలకు పూర్వవైభవం తీసుకొచ్చారు. - ఎన్.వి.మురళీధర్‌బాబు. ప్రిన్సిపల్

# చేపా.. చేపా.. ఏమయ్యావ్!



చోడవరం :చోడవరం సమీపంలోని లక్ష్మీపురం పెద చెరువులో చేపలు పడుతున్నారంటే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారంతా అక్కడే ఉంటారు. పెద్ద చేపలు దొరికితే వాటాలు వేసుకునేందుకు ఇద్దరు, ముగ్గురు జట్టు కడతారు. కానీ ఇక్కడి చేపలను విశాఖ తరలించేస్తున్నారు. ఒకటీ అరా.. విక్రయించినా ఎక్కువ ధర చెబుతున్నారని స్థానికులు వాపోతుంటే.. చెరువులో చేపల లభ్యత చాలా తక్కువగా ఉందని శ్రీగౌరి మత్స్యకార సహకార సంఘ సభ్యులు చెబుతున్నారు. నాలుగేళ్లుగా నష్టాలే వస్తున్నాయని సంఘ పెద్దలు చిట్టా విప్పుతున్నారు. ఏటా రూ.50 లక్షలకుపైగా ఆదాయం వచ్చే లక్ష్మీపురం చెరువులో చేపలు పడకపోవడమేంటి, నష్టాలు రావడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

లక్ష్మీపురం గ్రామాన్ని అనుకుని 178.6 హెక్టార్ల విస్తీర్ణంలో పెద చెరువు ఉంది. మత్స్య శాఖకు లీజు సొమ్ము చెల్లించి శ్రీగౌరి మత్స్యకార సహకార సంఘ సభ్యులు చెరువులో చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తుంటారు. లీజు సొమ్ములో 50 శాతం జలవనరుల శాఖకు, 20 శాతం మత్స్యశాఖకు, 30 శాతం పంచాయతీకి వెళ్తుంది. ఈ ఏడాది లీజు సొమ్ముగా రూ.1.10 లక్షలు సంఘం చెల్లించింది. ఈ సంఘంలో 11 గ్రామాలకు చెందిన మత్స్యకారులున్నారు. గతేడాది రూ.20 లక్షల వరకు నష్టం వచ్చిందంటూ ప్రభుత్వానికి ఇచ్చిన ఆడిట్ నివేదికలో సహకార సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఏడాది చేపలు పట్టి విక్రయించే బాధ్యతను గుత్తేదారుకు అప్పగించేశారు. ఈ ఏడాదీ నష్టం వచ్చేలా ఉందని సంఘ పెద్దలు చెబుతున్నారు.

చెరువులో మత్స్య సంపదకు లోటు లేదు. చేపల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వాటాలుగా పంచుకోవడం వల్ల సంఘానికి జమ కావడం లేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.15 లక్షల వరకు అనధికారికంగా పంచుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. ఖర్చులు రూ.లక్షల్లో చూపుతున్నారని వాపోతున్నారు. 'మత్స్య శాఖ నాలుగేళ్లుగా చేప పిల్లలను ఇవ్వకపోవడంతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. చెరువు చుట్టూ గస్తీకే ఎక్కువ ఖర్చవుతోంది. చెరువులో నీరు తగ్గడం వల్ల చేపల ఎదుగుదల పెద్దగా లేదు. చేప పిల్లల్ని గార తినేస్తుండటంతో ఖర్చులు తప్ప ఆదాయం పెద్దగా ఉండటం లేద'ని సంఘ అధ్యక్షుడు బేరా శివాజీ పేర్కొన్నారు.

## అతివకు అండగా.. పోలీసులు ఉండగా..

రాజమహేంద్రవరం : మహిళలు నిత్యం ఎక్కడో ఓచోట చిత్రహింసలకు, లైంగిక వేధింపులకు గురికావడం.. ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు తరుచూ మనం వింటున్నాం. నేరాల నియంత్రణకు ఎన్ని కొత్త చట్టాలు తీసుకువచ్చినా అవి ఎక్కువ భాగం కేసుల వరకే పరిమితం కావడం.. ఎక్కడో కొన్ని చోట్ల శిక్షలు పడిన సందర్భాలు ఉంటున్నాయి. ఈ క్రమంలో మహిళలకు మరింత భద్రత పెరగాల్సిన అవసరం ఉంది. మహిళా స్టేషన్‌లో అధికం..

మహిళా సాధికారత, వారి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా పీఎస్‌లతో పాటు శక్తి యాప్‌ను ఏర్పాటు చేసింది. గత ఏడాది జిల్లాలో మహిళల విషయంలో మొత్తం 958 కేసులు నమోదు కాగా వాటిలో రాజమహేంద్రవరం మహిళా పీఎస్‌లో 400 పైగా కేసులు ఉన్నాయి. ప్రస్తుతం మూడు నెలల కాల వ్యవధిలో మహిళా రక్షక్, శక్తియాప్, 112 కాల్ సెంటర్ నంబర్లకు సుమారు 100 పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 40పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో వేధింపులు, ఈవ్‌టీజింగ్, మహిళల వ్యక్తిత్వానికి భంగం కలిగించేలా



వ్యవహరించడం, దాడులు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

అన్నపూర్ణమ్మపేటకు చెందిన ఎన్.జ్యోతిసాయి శంకర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ, భార్యా పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మీరా(32) అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా, ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఇటీవల ఆమెను పథకం ప్రకారం హత్య చేశాడు.సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన పి.రాజేశ్వరి భర్తతో విడిపోయి పిల్లలతో ఒంటరిగా జీవిస్తోంది. అంతా సక్రమంగా ఉందనుకునే సమయంలో ఆమె ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రేమించిన వ్యక్తి రెండో వివాహానికి నిరాకరించడంతోనే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

గ్రామీణం పరిధిలో తనకు ఇష్టమైన కూర వండలేదని మద్యం మత్తులో భార్య మెడపై కొబ్బరి బొండాల కత్తితో దాడి చేశాడు ఆమె భర్త.

**కఠిన చర్యలు..**బాలికలు, మహిళలపై తరచూ దాడులు జరగడం.. వెంటనే పోలీసులు అప్రమత్తం కావడం పరిపాటైంది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ శక్తి టీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శక్తి యాప్‌తో మహిళకు రక్షణ ఉంటుందని.. ప్రతి ఫోన్‌లోనూ ఆ యాప్ ఉండేలా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే బాలికలు, యువతులకు ఆత్మరక్షణ మెళకువలపై శిక్షణ ఇస్తున్నారు.

## ఉపాధి శ్రామికులకు బీమా

చిత్తూరు : ఉపాధి పనులు చేసే శ్రామికులందరికీ ప్రమాద బీమా చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రమాదాలకు గురై శ్రామికులు మృతి చెందుతున్న సంఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి. వారికి ఎలాంటి బీమా లేకపోవడంతో ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందని పరిస్థితి. కొత్త విధానం అమల్లోకి వస్తే లక్షలాది కుటుంబాలకు బీమా భరోసా లభిస్తుంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2.67 లక్షల మంది జాబ్ కార్డులు కలిగిఉన్నారు. వీరిలో 1.44 లక్షల కుటుంబాలు, 4.79 లక్షల మంది విడతల వారీగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు.



వీరిని రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి బీమా యోజన పరిధిలోకి తీసుకు రావాలని నిర్ణయించారు. మే ఒకటో తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధి కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వివరాలు బ్యాంకుల్లో నమోదు చేయించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఒక వ్యక్తి ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. 18-70 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులు. కార్మికుడు ప్రమాదంలో చనిపోతే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం లభిస్తుంది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకానికి 18-50 ఏళ్ల వయస్సున్న వారు అర్హులు. ఏడాదికి రూ.436 చెల్లించాలి. పాలసీ వ్యవధిలో ఏ కారణంతోనైనా కార్మికుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుంది.

## విద్యుత్తు స్తంభం.. గాలిలో దీపం

నంద్యాల: విద్యుత్తు స్తంభాలు కూలినా.. విరిగిపోయినా వెంటనే మార్చాలి. పట్టణాల్లో అయితే 12 గంటల్లో, గ్రామాల్లో 24 గంటల్లో మార్చాలి. కొత్తవి ఏర్పాటు చేయడానికి స్తంభాలు అందుబాటులో లేవు. అవసరమైన సామగ్రి లేకపోవడంతో తాము ఏం చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నిరోజులుగా ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి ధాటికి విద్యుత్తు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది. పెద్ద సంఖ్యలో స్తంభాలు కూలిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కో విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో పదుల సంఖ్యలో స్తంభాలు విరిగిపోయాయి. కొత్త విద్యుత్తు స్తంభాలు కావాలంటూ తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయానికి ఎస్ఈలు నివేదించారు. ప్రస్తుతం అవసరానికి తగ్గట్టు సరఫరా లేక సమస్యలు ఎదురవుతున్నాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు సమస్యలు ఎదురవుతున్నాయి. గృహ, వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మారుస్తున్నవి కొన్నేఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన గాలివానలకు 500కు పైగా స్తంభాలు నేలకూలాయి. వీటి స్థానంలో అధికారులు కొన్ని మాత్రమే ఏర్పాటు చేశారు. మిగతా వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. మంత్రాలయం మండలంలో 10, కోసిగి 5, కోడుమూరు మండలంలో 5 చొప్పున కూలిపోయాయి.సామగ్రి కొరతగృహ అవసరాల విద్యుత్తును 8, 9.1, 11 మీటర్ల ఎత్తయిన స్తంభాల ద్వారా సరఫరా చేస్తారు. సాధారణంగా 11 మీటర్ల స్తంభం రూ.9 వేలు, 8 మీటర్లది రూ.3,500, 9.1 మీటర్ల స్తంభం ధర రూ.5 వేల వరకు ఉంటుంది. విద్యుత్తు స్తంభం కూలితే తీగలు, కాసారాలు దెబ్బతింటాయి. వాటికి మరో రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చవుతుంది.

విరిగిన స్తంభాల వివరాలను ఏఈ ఉన్నతాధికారులకు నివేదిస్తారు. రూ.లక్ష విలువ చేసే స్తంభాల వరకు డీఈ మంజూరు చేస్తారు. రూ.2 లక్షల వరకు ఎస్ఈ మంజూరు చేస్తారు. ఆ పైన మంజూరు కావాలంటే ఎస్పీడీసీఎల్ తిరుపతి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే.సాధారణంగా విద్యుత్తు స్తంభం గంటకు 20 కి.మీ వేగంతో వీచే గాలులకే తట్టుకోగలదు. కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీల వేగంతో గాలులు వీస్తున్నాయి. దీంతో స్తంభాలు విరిగిపోయి నేలకూలుతున్నాయి. కొరత కారణంగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం ఆలస్యమవుతోంది.




## అందంతో కవ్విస్తున్న రవీనా టాండన్ కూతురు

నటవారసులు చాలా మంది సినీపరిశ్రమకు పరిచయం అవుతున్నారు. కానీ వీళ్లలో ఎవరూ అంతగా ప్రభావం చూపడం లేదు. అందంతో లేదా నటనతో మెప్పించలేక తడబడుతున్నారు. ఇటీవలి కాలంలో జాన్వీకపూర్, సారా అలీఖాన్, అనన్య పాండే మాత్రమే నటవారసులలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాతి జనరేషన్ లో చాలా మంది పెద్ద తెరకు పరిచయమైనా కానీ, ప్రయోజనం లేదు. వారి నటప్రదర్శన అంతగా ఆకట్టుకోవడం లేదు. కనీసం అందచందాలు, గ్లామర్ ఎలివేషన్ పరంగానూ ఎవరూ మెప్పించలేకపోయారు. కొత్త తరం నటీనటులను చూసాక .. ప్రేక్షకులు పూర్తిగా పెదవి విరిచేస్తున్నారు. కానీ వీళ్లందరికీ భిన్నంగా మేటి కథానాయిక రవీనాటాండన్ కుమార్తె రాషా తడానీ చంపుతోంది. రాషా అందచందాలు, మేని విరుపులకు కుర్రకారులో గుబులు పుడుతోంది.



సినీపరిశ్రమలో పేరున్న బిజినెస్ మ్యాగ్నెట్స్ తడానీలు. హిందీ బెల్ట్ లో పంపిణీ రంగం సహా సినీ నిర్మాణ రంగంలో తడానీలు పెద్ద స్థాయి వ్యక్తులు. అలాంటి గొప్ప కుటుంబం నుంచి వచ్చిన రాషా పరిశ్రమకు పరిచయం కాక ముందే అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు తన మమ్మీ లెగసీని ముందుకు తీసుకెళ్లడానికి చాలా శ్రమిస్తోంది. రవీనా తరహాలోనే అద్భుతమైన డ్యాన్సులతో అదరగొడుతోంది. రాషా ఇటీవల అజయ్ దేవగన్ మేనల్లుడు అమన్ దేవగన్ సరసన ఆజాద్ అనే చిత్రంలో నటించింది. ఈ చిత్రంలో అదిరిపోయే స్పెషల్ నంబర్ లో కూడా నర్తించింది. రాషా నటన, అందచందాలకు మంచి మార్కులే వేశారు. ఇక ఇదే హుషారులో రాషా తడానీ టాలీవుడ్ లో అగ్ర హీరోల సరసన నటించడానికి ఎక్కువ సమయం పట్టదని ఊహిస్తున్నారు. రాషా టాలీవుడ్ కి తెలుగు చిత్రసీమలో ప్రవేశిస్తే ఇక్కడ ఒక ఊపు ఊపడం ఖాయం. ఈ టీనేజీ బ్యూటీ సహజ సౌందర్యం, ఒడ్డు పొడుగు, మత్తెక్కించే కళ్లు ప్రధాన ఆకర్షణ. అందుకే రాషా వేగంగా టాలీవుడ్ లో దూసుకెళుతుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఇండస్ట్రీలో ప్రవేశించేందుకు అవకాశం ఉన్న నవతరం హీరోలకు కూడా రాషా బెస్ట్ ఆప్షన్ గా మారుతుందనడంలో సందేహం లేదు. అయితే రాషా తడానీ నందమూరి మోక్షజ్ఞ డెబ్యూ చిత్రంలో నటిస్తుందని ప్రచారం సాగినా కానీ, ఆ తర్వాత ఈ మూవీ గురించిన సమాచారం ఏదీ బహిర్గతం కాలేదు. అటు హిందీలో పలు చిత్రాలకు రాషా తడానీ సంతకాలు చేసిందని తెలుస్తోంది.

## మహిళా నిర్మాతపై జాన్వీ కపూర్ కామెంట్

జాన్వీ కపూర్ - ఇషాన్ ఖట్టర్ నటించిన హెూమ్‌బౌండ్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమయిన సంగతి తెలిసిందే. సినిమా ప్రదర్శనకు ముందు జాన్వీ సోదరి ఖుషీ కపూర్ తన ప్రియుడు శిఖర్ పహారియా, స్నేహితుడు ఒర్రీతో ఫ్రెంచ్ రివేరాలో సందడి చేసారు. జాన్వీ మూవీకి వీరంతా ప్రచార సాయానికి విచ్చేసారు. ఆ తర్వాత జాన్వీ వరుసగా రెడ్ కార్పెట్ పై క్యాట్ వాక్ లతో మతులు చెడగొట్టిన సంగతి తెలిసిందే. జాన్వీ చివరిగా బ్లాక్ కలర్ డిజైనర్ దుస్తుల్లో కనిపించింది. దీనిలో రెట్రో అప్పియరెన్స్ హృదయాలను కొల్లగొట్టింది. ఈవెంట్ నుంచి ఫోటోలు ఇప్పటికే ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. శుక్రవారం జాన్వీ బ్లాక్ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని



ఆకర్షించింది. తన స్టైలిష్ ఫోటోలను షేర్ చేసిన జాన్వీ ముంబై వర్షాలకు సిద్ధంగా ఉంది ..రియా క్యాప్షన్ కోసం నన్ను చంపకు అని రాసింది. ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్ కం నిర్మాత రియా కపూర్ ని ఉద్దేశిస్తూ జాన్వీ చేసిన ట్వీట్ వైరల్ గా మారుతోంది. కేన్స్ లో జాన్వీ నటించిన హెూమ్ బౌండ్ ని ప్రదర్శించాక, 9 నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ లభించింది. నీరజ్ ఘయ్వాన్ దీనికి దర్శకత్వం వహించారు. ఇది ఈ సంవత్సరం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన ఏకైక భారతీయ చిత్రంగా నిలిచింది. తాజాగా రిలీజైన ఫోటోలలో జాన్వీ, ఇషాన్ ఖట్టర్, కరణ్ జోహార్, చిత్రనిర్మాత నీరజ్ ఘయ్వాన్ మరియు ఇతరులతో కలిసి పోజులిచ్చినట్లు కనిపిస్తుంది.

## కల్కి 2 కోసం ఎన్నేళ్లు వేచిచూడాలో..?




ప్రభాస్ సినిమాలు మొదలు పెట్టడమే కానీ వాటి రిలీజ్ ఎప్పుడన్నది మాత్రం చెప్పడం కష్టమనేలా ఉంది ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే. బాహుబలి నుంచి వరుస పాన్ ఇండియా సినిమాలతో ప్రభాస్ సినిమా సినిమాకు తన రేంజ్ పెంచుకుంటూ వస్తున్నాడు. ఆదిపురుష్ అంటూ డైరెక్ట్ గా బాలీవుడ్ డైరెక్టర్ తో ఒక సినిమా చేశాడు. ఐతే ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు.

ఐతే సలార్ 1 అంటూ ఒక భారీ సినిమా చేశాడు రెబల్ స్టార్. కె.జి.ఎఫ్ తో సూపర్ హిట్ అందుకున్న ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో ఈ సినిమా వచ్చింది. సలార్ 1 మాస్ హిట్ అందుకున్నాక కల్కి 2898 AD అంటూ మరో అద్భుతాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చాడు. నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో తెరకెక్కిన కల్కి సినిమా 500 కోట్ల పైన బడ్జెట్ తో రూపొందించారు. ఐతే కల్కి 1 పూర్తైంది సరే కల్కి 2 ఎప్పుడన్న డౌట్ మొదలైంది. ఆ సినిమాకు ఎక్కువ టైం తీసుకునేది లేదు 2025 లోనే రిలీజ్ అని అప్పట్లో చెప్పినా ఇప్పుడు అసలు ఆ ప్రాజెక్టు ఎప్పుడు షూటింగ్ మొదలవుతుందా అన్న ప్రశ్న వినిపిస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్ సినిమా చేస్తున్నాడు. దాదాపు రెండేళ్లుగా ఆ సినిమా షూటింగ్ లోనే చేస్తున్నాడు ప్రభాస్. మరోపక్క హనుతో ఫౌజీ సినిమా కూడా చేస్తున్నాడు ప్రభాస్. ఈ రెండు సినిమాలు పూర్తి కాగానే స్పిరిట్ లైన్ లో ఉంది. సందీప్ వంగ ప్రభాస్ ఎప్పుడు డేట్స్ ఇస్తే అప్పుడు సినిమా స్టార్ట్ చేయాలని ఉత్సాహంగా ఉన్నాడు. ఇవే కాకుండా ప్రభాస్ కల్కి 2, సలార్ 2 సినిమాలు చేయాలి. సలార్ 2 ఎలాగు ప్రశాంత్ నీల్ తారక్ సినిమా అయ్యాక ఉండొచ్చు. ఐతే కల్కి 2 ఎప్పుడన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ప్రభాస్ రాజా సాబ్ లాంటి సినిమాకే రెండేళ్లు పైన టైం తీసుకున్నాడు. ఇక కల్కి 2 మరింత భారీగా ఉంటుందని అంటున్నారు. మరి అలాంటి సినిమాకు ఇంకెంత టైం తీసుకుంటాడు అన్నది చూడాలి.

సలార్ 2, కల్కి 2 సినిమాలు ఎలా లేదన్నా 3, 4 ఏళ్ల దాకా ఎక్స్ పెక్ట్ చేయడం పొరపాటే అయ్యేలా ఉంది.

ప్రభాస్ కూడా వరుస సినిమాలు కమిట్ అవ్వడమే కాదు వాటిని పూర్తి చేసేలా కాస్త ఎక్కువ ఇన్వాల్వ్ మెంట్ చూపిస్తే బెటర్. మరి అసలు ప్రభాస్ సినిమాలు లేట్ ఎక్కడ జరుగుతుంది అన్నది తెలియదు కానీ ఫ్యాన్స్ మాత్రం వెయిట్ చేస్తూనే ఉన్నారు.

## సమంత సూపర్ ప్లానింగ్.. ఏడాది చివర్లోనే అది కూడా..?



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత మన దగ్గర సినిమాలతోనే స్టార్ డం తెచ్చుకోగా నార్త్ సైడ్ మాత్రం వెబ్ సీరీస్ లతో అలరిస్తూ వచ్చింది. అప్పటివరకు సమంత హీరోయిన్ గా మాత్రమే చేస్తుంది అనుకున్న వారందరికీ ఫ్యామిలీ మ్యాన్ 2 సీరీస్ లో ఒక వెరైటీ రోల్ చేసి సర్ ప్రైజ్ చేసింది. సమంత లోని ఈ టాలెంట్ చూసిన బీ టౌన్ ఆడియన్స్ ఆమెకు ఫ్యాన్స్ గా మారిపోయారు. ఫ్యామిలీ మ్యాన్ మేకర్స్ తోనే సిటాడెల్ సీరీస్ ని కూడా చేసింది సమంత. రాజ్ అండ్ డీకే డైరెక్షన్ లో సమంత చాలా కంఫర్టబుల్ గా సీరీస్ లు చేస్తుందని తెలుస్తుంది.ఇదే కాదు సమంత నిర్మాణంలోకి అడుగు పెట్టింది. సమంత తొలి సినిమా శుభం ఈమధ్యనే రిలీజైంది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో సమంత నిర్మాతగా చేసిన శుభం కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా నిర్మాతగా సక్సెస్ కి పేరు తెచ్చి పెట్టింది. ఐతే సమంత తన బ్యానర్ లో మొదట అనౌన్స్ చేసిన సినిమా మా ఇంటి బంగారం. ఆ సినిమాలో సమంత లీడ్ రోల్ గా నటిస్తుందని తెలుస్తుంది. తుపాకి పట్టుకుని సమంత పోస్టర్ తో మా ఇంటి బంగారం సినిమా అనౌన్స్ చేశారు. ఐతే ఆ సినిమా ఏమైందో కానీ సడెన్ గా శుభం అంటూ కొత్త ప్రాజెక్ట్ తో వచ్చి ఆ సినిమాను గట్టిగా ప్రమోట్ చేసి నిర్మాతగా పర్వాలేదు అనిపించుకుంది సమంత. ఇక సమంత బ్యానర్ నుంచి వస్తున్న రెండో ప్రాజెక్ట్ మా ఇంటి బంగారం ఈ సినిమా కూడా షూటింగ్ పూర్తి కావొచ్చిందని తెలుస్తుంది. సమంత ఈమధ్యనే మా ఇంటి బంగారం అప్డేట్స్ త్వరలో వస్తాయని అన్నది. ఐతే తెలుస్తున్న సమాచారం ప్రకారం సమంత ఈ సినిమాను కూడా ఇదే ఇయర్ లో రిలీజ్ ప్లాన్ చేస్తుందని తెలుస్తుంది. అన్నీ కుదిరితే ఈ ఇయర్ డిసెంబర్ లో ఆ సినిమాను వదిలేలా ప్లాన్ చేస్తున్నారట. సమంత నిర్మాతగా ఒకే ఇయర్ లో రెండు సినిమాలు రిలీజ్ చేయడం నిజంగానే గొప్ప విషయమని చెప్పొచ్చు. ఇక సమంత తన నిర్మాణంలో కాకుండా వేరే తెలుగు సినిమాలు ఎప్పుడు చేస్తుందా అని ఆమె ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. స్టార్ సినిమాలకు పూర్తిగా దూరమైన సమంతని మళ్లీ స్టార్ కమర్షియల్ సినిమాల్లో చూడాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఆ ఛాన్స్ ఎవరు ఎప్పుడు ఇస్తారన్నది చూడాలి. సమంత మాత్రం నిర్మాతగా చేస్తున్న సినిమాల్లో తను కూడా భాగమై తన ఫ్యాన్స్ ని అలరిస్తుంది.

## అదృష్టానికే అదృష్టవంతురాలు ఈహీరోయిన్!

హీరోయిన్ గా సక్సెస్ అవ్వాలంటే అందం..అభినయం ట్యాలెంట్ తో పాటు అదృష్టం కూడా కలిసి రావాలి. అప్పుడే అది సాధ్యమవుతంది. అందమైన భామలంతా హీరోయిన్లు కాలేరు. ప్రతిభ ఒక్కటే ఉన్నా సాధ్యం కాదు. ఆ రెండింటితో పాటు అదృష్టం కూడా తోడైతేనే సాధ్యమవుతుంది. కానీ కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ మాత్రం అదృష్టానికి అదృష్టవంతురాలు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడు సప్తసా గరాలు దాటి అనే కన్నడ చిత్రంతో తెలుగు నాట పరిచయమైన సంగతి తెలిసిందే. తొలి సినిమా తో ఇక్కడ మంచి పేరు తీసుకొచ్చింది. అమ్మడికి ఈ సినిమాలో అవకాశం ఎంత ఈజీగా వచ్చిందో తెలిస్తే షాక్ అవుతారు. అవును ఈ విషయంలో తానెంతో లక్కీ అని రుక్మిణీ చెప్పుకొచ్చింది. ఆ సినిమా డైరెక్టర్ ఇచ్చిన ప్రకటన పేపర్లో చూసి అతడి నెంబర్ కు ఒక్క మేసేజ్ పెట్టిందిట. అనుమతి ఇస్తే ఆడిషన్ లో పాల్గొంటాను అని ఆ మెసేజ్ లో ఉంది. నటనలో తను అభనువాన్ని అందులో జోడించింది.



సరే రండి అని రిప్లై ఇచ్చారుట. ఆ మేసేజ్ డైరెక్టర్ చూడకపోయి ఉంటే ఆ ఛాన్స్ తనకు వచ్చేది కాదని...దీన్నే అదృష్టం అంటారని పేర్కొంది. కాబట్టి ఎంత కష్టపడినా సరే ఆవగింజంత అదృష్టం కూడా కలిసొస్తేనే గొప్ప స్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రుక్మిణీ వసంత్ ఏకంగా పాన్ ఇండియా ఛాన్సులే అందుకుంటుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన డ్రాగన్ లో నటిస్తోంది. కన్నడ బ్యూటీ కావడంతో ప్రశాంత్ నీల్ మరో ఆలోచన లేకుండా రుక్మిణీని తీసుకున్నాడు. అలాగే మురగదాస్ దర్శకత్వం వహిస్తోన్న %-%మదరాసిలోనూ ఈ భామే హీరోయిన్. విజయ్ సేతుపతికి జోడీగా ఏస్ అనే చిత్రంలోనూ నటిస్తోంది. ఇలా ఇన్ని ఛాన్సులు వచ్చాయంటే కారణం తొలి సినిమాతో తానేంటే ప్రూవ్ చేసుకోవడంతోనే సాధ్యమైంది. ఇక్కడ ట్యాలెంట్ వర్కౌట్ అయింది.

## టాలీవుడ్ లో అమ్మడు ఖాళీ అయినట్టేనా..?

చిలసౌ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుహాని శర్మ ఆ సినిమాలో తన పాత్రతో చాలామంది ఆడియన్స్ కి దగ్గరైంది. ఆ సినిమా డైరెక్టర్ రాహుల్ రవిచంద్రన్ రుహానిని ఎలా ఆడిషన్ చేసి తీసుకున్నాడో కానీ ఆన్ స్క్రీన్ కాదు ఆఫ్ స్క్రీన్ కూడా రుహాని అలానే ఉంటుందా అనిపించేలా తన మ్యాజిక్ చూపించింది. ఐతే చిలసౌ తర్వాత హిట్ ఫస్ట్ కేస్ లో నటించిన అమ్మడు అది పర్వాలేదు అనిపించుకున్నా నెక్స్ట్ కథల ఎంపికలో కాస్త ట్రాక్ తప్పింది. డర్టీ హరి సినిమా చేసిన అమ్మడు ఆ తర్వాత పెద్దగా ఛాన్స్ లు అందుకోలేదు. అవసరాల శ్రీనివాస్ చేసిన నూటొక్క జిల్లాల అందగాడు చేసినా లాభం లేకుండా పోయింది. ఐతే రుహాని శర్మ సినిమాలైతే చేస్తుంది కానీ ఆమె పాపులారిటీ మాత్రం సంపాదించలేకపోయింది. హర్ చాప్టర్ 1, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగ నీతులు, లవ్ మీ ఇలా చెప్పడానికి కెరీర్ లో చాలా సినిమాలు ఉన్నాయి కానీ



అందులో ఏది ఆమెకు సరైన గుర్తింపు తీసుకు రాలేదు. అంతేకాదు ఆమె గ్రాఫ్ ని పడిపోయేలా చేశాయి. ఐతే రుహాని శర్మ కాన్ఫిడెన్స్ మాత్రం ఎక్కడ లూజ్ అవ్వలేదు. అమ్మడు ఇప్పటికీ తనకు తగిన రోల్ పడితే సత్తా చూపిస్తా అనే అంటుంది. ఐతే తెలుగులో ఒకసారి కెరీర్ డౌన్ అయితే మళ్లీ ఊపందుకోవడం చాలా కష్టం. ఒకటి రెండు కాదు గత రెండేళ్లలో రుహాని చాలా సినిమాల్లో అసలేమాత్రం ఇంపార్టెంట్ లేని పాత్రలు చేసింది. అవన్నీ కూడా ఆమె కెరీర్ కి ఎసరు పెట్టేలా చేశాయి. ప్రస్తుతం అమ్మడు తమిళ్ లో మాస్క్ సినిమా చేస్తుంది. తెలుగులో లక్ కలిసి రాకపోయినా తమిళం లో అయినా అమ్మడి టాలెంట్ ని గుర్తిస్తారేమో చూడాలి. అమ్మడికి తెలుగు ఆఫర్లు ఇక కష్టమే అని చెప్పొచ్చు. తప్పకుండా రుహాని లాంటి యాక్టర్ కి మంచి పాత్రలు పడితే మాత్రం బాగుంటుందని ఆమెను ఇష్టపడే ఆడియన్స్ అంటున్నారు. మరి ఇప్పటికైనా రుహాని ప్రతిభని ఎవరైనా గుర్తిస్తారా లేదా అన్నది చూడాలి. ఐతే రుహాని కూడా చేస్తే హీరోయిన్ గానే చేస్తా లాంటి లెక్కలేమి లేకుండా వచ్చిన ప్రతి రోల్ చేస్తూ వచ్చింది. ఐతే అదే ఆమెను కెరీర్ లో వెనకపడేలా చేసిందని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536